

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తిరుపతి

fb.com/vaartha Digital

Published from Tirupathi, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

12-3-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 39 పేజీలు: 10+4 వెల: 6.50


## పాకిస్థాన్‌లో ఎక్స్‌ప్రెస్ రైలు హైజాక్

5లో

## పునర్విభజనవల్ల పెరగనున్న సీట్లు: రాజ్‌నాథ్

## కేజ్రీవాల్, మరో ఇద్దరిపై కేసు

### 18 లోగా నివేదిక ఇవ్వాలని ఢిల్లీ కోర్టు ఆదేశం



**న్యూఢిల్లీ, మార్చి 11:** ఆప్ అధినేత మాజీ సీఎం అరవింద్‌కేజ్రీవాల్‌కు ఢిల్లీలోని రౌస్ అవెన్యూకోర్టునుంచి షాక్‌లాంటి ఉత్తర్వులు వచ్చాయి. అరవింద్‌కేజ్రీవాల్‌మరో ఇద్దరిపై కేసులునమోదుచేసి దర్యాప్తుచేయాలని ఈనెల 18వ తేదీనాటికి తమకు నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. 2019నాటి ఈ కేసులో దిగువకోర్టు తొలుత ఈపిటిషన్‌ను తిరస్కరించింది. మద్యంపాలసీ కుంభకోణంలో నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ సీఎం తన సొంత నియోజకవర్గంలో నిధులు దుర్వినియోగంజరిగిందని ఆరోపిస్తూ పిటిషన్ దాఖలుచేసారు. ప్రజల నుంచి పన్నులరూపంలో వసూలుచేసిన ప్రభుత్వ నిధులను ఢిల్లీవీధుల్లో భారీ హోర్డింగ్‌లు ఏర్పాటుకు మాత్రమే వినియోగించడంపై >>2

## కాలుష్య దేశాల్లో మనం '5'

### 13 నగరాలు భారత్‌లోనే..



ఢిల్లీలో వాయుకాలుష్య దృశ్యం

**న్యూఢిల్లీ, మార్చి 11:** ప్రపంచంలో వాయుకాలుష్యం అత్యధికంగా ఉన్న టాప్ 20 నగరాల జాబితాలో ఏకంగా 13 నగరాలు భారత దేశంనుంచే ఉన్నాయి. స్విస్ ఎయిర్‌క్వాలిటీ టెక్నాలజీ కంపెనీ ఐక్యూ ఎయిర్‌కాలుష్యంపై రూపొందించిన ది వరల్‌డ ఎయిర్‌క్వాలిటీ రిపోర్టు 2024 నివేదిక విడుదలచేసింది. ఇందులోప్రపంచంలోఐదో అత్యంత కలుషిత దేశంగా భారత్‌నిలిచింది. ఈ జాబితాలో అస్సాంలోని బైర్నిహాట్ అగ్రస్థానంలో ఉంది. తర్వాతస్థానాల్లో దేశరాజధాని ఢిల్లీ, పంజాబ్‌లోని ముల్లన్‌పూర్, ఫరీదాబాద్‌లోని ఘజియాబాద్, న్యూఢిల్లీ, గురుగ్రామ్, >>2

## ప్రధాని మోడీకి మారిషస్ అత్యున్నత పురస్కారం

### ప్రకటించిన ప్రధాని నవీన్‌రామ్ గులాం



ప్రధాని మోడీకి మారిషస్ అత్యున్నత పురస్కారం అందిస్తున్న ఆదేశ ప్రధాని నవీన్‌చంద్రరామ్ గులాం

**పోర్ట్‌లూయిస్, మార్చి 11:** మారిషస్ ద్వీపకల్పదేశంలో పర్యటిస్తున్న ప్రధానిమోడీకి ఆదేశ అత్యున్నత గౌరవం లభించింది. 'గ్రాండ్ కమాండర్ ఆఫ్‌ది ఆర్డర్ ఆఫ్‌ది స్టార్ అండ్‌కీ ఆఫ్‌ది ఇండియన్ ఓషన్'తో ప్రధాని మోడీని సత్కరించింది. మారిషస్ ప్రధాని నవీన్‌చంద్రరామ్ గులాం మంగళవారం ప్రధాని మోడీకి ఈ పురస్కారాన్ని ప్రకటించారు. ప్రధాని మోడీకి ఇది 21వ అంతర్జాతీయ అవార్డు. మారిషస్ అత్యున్నతపురస్కారాన్ని అందుకున్న తొలిభారతీయుడు కూడా ప్రధానిమోడీయే. రెండురోజులపర్యటనకోసం మారిషస్ వెళ్లినప్రధాని పోర్టులూయిస్‌లో భారతీయ సంతతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇదే వేదికపై రామ్‌గులాం ఈ ప్రకటనచేసారు. మారిషస్ దేశ 57వ జాతీయ దినోత్సవానికి >>2

## రూ.40వేల కోట్లతో అమరావతి అభివృద్ధి

### సిఆర్‌డిఎ గ్రీన్ సిగ్నల్‌తో త్వరలోనే పనులు ఆరంభం

### అంచనాలకు అనుగుణంగా కార్యాచరణ

### 22 పనులకు టెండర్లు ఓపెన్

### ప్రపంచబ్యాంక్, హడ్కో, వివిధ బ్యాంకుల నుంచి రుణాలు: సిఎం చంద్రబాబు



మంగళవారం సీఆర్డీఏ అధికారుల సమావేశంలో పాల్గొన్న సిఎం చంద్రబాబు, మంత్రి నారాయణ

**విజయవాడ,మార్చి11,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రానికి అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో రాజధాని అమరావతిని నిర్మించేందుకు ఒక మహాయజ్ఞం మాదిరిగా పనులు ముందుకు సాగాలని ఏపీ సీఎం చంద్రబాబునాయుడు స్పష్టం చేసారు. రాజధాని నిర్మాణానికి సంబంధించి భవన నిర్మాణాలు, రహదారుల నిర్మాణం విషయంలో మన అంచనాలకు అనుగుణంగా కార్యచరణ ఉండాలన్నారు. ఏ దిశలో అయితే మనం నిర్ణయాలు తీసుకున్నామో అందుకు అనుగుణంగా టెండర్లు ఆహ్వానం, అవి ఆమోదం పొందగానే నిర్దిష్ట వ్యవధిలో వాటిని పూర్తి చేయడం ముఖ్యమన్నారు. రాజధాని అమరావతిలో 40వేల కోట్ల నిర్మాణ పనులకు సీఆర్‌డీఏ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన సీఆర్‌డీఏ సమావేశంలో ఆ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ అమరావతిలో వచ్చిన డబ్బుతో అక్కడ అభివృద్ధి పనులు చేస్తాం. ఎక్కడ అభివృద్ధి పనులు చేపట్టినా కనీస సౌకర్యాలు కల్పించాలి. పక్కా ప్రణాళికతోనే అమరావతి నగరం అభివృద్ధి జరుగుతుంది. రాజధాని అమరావతి నిర్మాణానికి వరల్డ్ బ్యాంక్, ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు కలిసి రూ.13వేల 400 కోట్ల రుణాలను ఇచ్చేందుకు ముందుకు వచ్చాయి. హడ్కో నుంచి మరో రూ.11వేల కోట్ల రుణ సమీకరణకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో అన్ని ఏర్పాట్లు చేసింది. దానికి సంబంధించి అనుమతి లేఖ కూడా రాష్ట్రానికి వచ్చింది. రాష్ట్రం నుంచి అంగీకారం >>2

## జిల్లాలకు ఇన్‌ఛార్జిలుగా ఐఎఎస్ అధికారులు

**విజయవాడ మార్చి 11 ప్రభాతవార్త ప్రతినిధి:** సీనియర్ ఐఏఎస్ అధికారుల్ని జిల్లాలకు ఇనచార్జులుగా నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రాధన్యాత కార్యక్రమాల్ని సమర్థంగా అమలు చేసేందుకు పరిపాలనను బలోపేతం చేసేందుకు వివిధ శాఖల మధ్య సమన్వయంతో సమస్యల సత్వర పరిష్కారానికి ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు అధికారులను నియమిస్తోంది. వీరు జోనల్ ఇన్‌చార్జులుగా వ్యవహరించబడతారు. వీరు జిల్లా ఇన్‌చార్జులుగా ప్రభుత్వ కార్యక్రమాల అమల్లో జిల్లా కలెక్టర్ ఇతర జిల్లా అధికారులకు సహాయకారిగా ఉండాలి. ప్రభుత్వ ప్రధాన కార్యక్రమాల్లో పాల్గొనాలి. 15రోజులకోసారి జిల్లాఅధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించాలి. గ్రామాల్లో పర్యటించాలి. నెలకు కనీసం రెండుసార్లు గ్రామాల్లో రాత్రి బస చేయాలి. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంపై సమీక్షించాలి. తగు >>2

## ఖర్గే వ్యాఖ్యలతో ఎగువసభలో దుమారం

### ఛైర్మన్‌కు క్షమాపణలు



**న్యూఢిల్లీ, మార్చి 11:** విద్యాశాఖపనితీరుపై చర్చ సందర్భంగా రాజ్యసభలో విపక్ష నేత మల్లిఖార్జున ఖర్గేచేసిన వ్యాఖ్యలతో సభ దద్దరిల్లింది. కాంగ్రెస్ అధ్యక్షుడు అభ్యంతరకర వ్యాఖ్యలుచేసారని బిజెపి మండిపడింది. దీనిపై స్పష్టత ఇచ్చిన ఖర్గే క్షమాపణలు చెప్పారు. తానుచేసిన వ్యాఖ్యలు డిప్యూటి ఛైర్మన్‌ను ఉద్దేశించినవి కావని కేవలం ప్రభుత్వంపైనే విమర్శలుచేసానని చెప్పారు. రాజ్యసభలో ప్రశ్నోత్తరాల సమయం అనంతరం విద్యాశాఖ పనితీరుపై చర్చను ప్రారంభించారు. కాంగ్రెస్ సభ్యుడు దిగ్విజ యసింగ్‌ను డిప్యూటి ఛైర్మన్ హరివంశ్ సూచించారు. ఇదే సమయంలో తమిళనాడు ప్రభుత్వంపై >>2

## ప్రజల భద్రతకే లిఫ్టులు, ఎస్కలేటర్ల బిల్లు



### 15 రాష్ట్రాల్లో ఇప్పటికే లిఫ్టల చట్టం: మంత్రి రవికుమార్

**విజయవాడ,మార్చి11,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ లిఫ్టులు మరియు ఎస్కలేటర్ల బిల్లు 2025తో వృద్ధులు, మహిళలు, దివ్యాంగులతో పాటు ప్రజలకు మరింత భద్రత కలుగుతుందని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. శాసనసభలో మంగళవారం లిఫ్టులు, ఎస్కలేటర్ల బిల్లు 2025 ను ప్రవేశ పెట్టిన తరువాత ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లో జరుగుతున్న పట్టణీకరణతో పాటు వేగంగా నిర్మాణమవుతున్న బహుళ అంతస్తుల భవనాలు, ఆస్పత్రులు, వ్యాపార సముదాయాలు, హోటళ్లు, షాపింగ్ మాల్స్ ను దృష్టిలో ఉంచుకుని ఆంధ్రప్రదేశ్ లిఫ్టులు మరియు ఎస్కలేటర్లు బిల్లు 2025ను రూపొందించినట్లు వివరించారు. లిఫ్టులు, ఎస్కలేటర్ల వినియోగంతో ప్రమాదాలు పెరిగిపోతున్నాయని మంత్రి గొట్టిపాటి ఆందోళన వ్యక్తం చేశారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ప్రజల భద్రత చాలా ముఖ్యమని పేర్కొన్నారు. కొత్త బిల్లు చట్టరూపం దాల్చితే లిఫ్టులు, ఎస్కలేటర్ల ప్రమాదాలను చాలా వరకు కట్టడి చేయవచ్చని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ లో భాగంగా కేంద్ర ప్రభుత్వం లిఫ్టులు మరియు ఎస్కలేటర్ల బిల్లును 2024లోనే తీసుకొచ్చిందని మంత్రి గొట్టిపాటి ఈ సందర్భంగా గుర్తు చేశారు. పూర్తిస్థాయి అధ్యయనం తరువాతే లిఫ్టులు మరియు ఎస్కలేటర్ల చట్టాన్నిదేశంలోని 15 రాష్ట్రాల్లో ఇప్పటికే అమలు చేస్తున్నారని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. తమిళనాడు, కర్ణాటక, కేరళ, ఉత్తర ప్రదేశ్, బీహార్ వంటి రాష్ట్రాల్లో అమల్లో ఉన్న చట్టాన్నిపూర్తి స్థాయిలో అధ్యయనం చేసిన తరువాతే ఆం ధ్రప్రదేశ్ లిఫ్టులు మరియు ఎస్కలేటర్ల బిల్లు 2025ను రూపొందించి చట్ట సభల్లో ప్రవేశ పెట్టామని ఆయన వివరించారు. విస్తృత ప్రజా ప్రయోజనాలతో పాటు అతి ముఖ్యమైన పౌరుల భద్రత దృష్ట్యా బిల్లును చట్ట రూపంలోకి తీసుకొచ్చి అమలు చేయడానికి ప్రభుత్వం నిర్ణయించిందని ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి స్పష్టం చేశారు. అదే విధంగా సీసీ కెమెరాల వినియోగం, డేటాను భద్ర పరచడం వంటి వాటికి సంబంధించిన అంశాలన్నింటినీ బిల్లులో పొందుపరిచామని తెలిపారు. బిల్లుకు సంబంధించి గౌరవ సభ్యులు సూచించిన అంశాలను కూడా పరిగణనలోకి తీసుకుంటామని ఈ సందర్భంగా ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. తతప్రకాశం జిల్లాలో రెండు ఆల్ట్రా మెగా >>2

## ఇక నీటి విమానాశ్రయాలు

### దేశవ్యాప్తంగా 18, రాష్ట్రంలో 8

### సమగ్ర ప్రాజెక్టు నివేదికకు చంద్రబాబు ఆదేశం



రాష్ట్రంలో ఇటీవల ప్రయోగాత్మకంగా విజయవాడ నుంచి శ్రీశైలంకు నడిపిన సీప్లేన్(ఫైల్)


**రాజంపేట అర్బన్, మార్చి11 ప్రభాతవార్త :** రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని కొత్త పుంతలు తొక్కించే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు యోచిస్తున్నారు. పర్యాటక రంగంలో కొత్త విధానాలను రాష్ట్రంలో అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వ విధానాలను అందిపుచ్చుకునే దిశగా ఆయన అడుగులు వేస్తున్నారు. అందులో భాగంగానే రాష్ట్రంలో నీటి విమా నాశ్రయాలు (వాటర్ ఏరో డ్రమ్స్) ఏర్పాటు చేసి దిశగా కసరత్తు చేస్తున్నారు. ఈ మేరకు రాష్ట్రంలో 8 నీటి విమానాశ్రయాలు ఏర్పాటు చేసేందుకు అవసరమైన ప్రాజెక్టు నివేదిక (డిపిఆర్) సిద్ధం చేసేందుకు రాష్ట్ర డెవలప్మెంట్ కార్పొ రేషన్ (ఏపీఎడిసిఎల్) మంగళవారం టెండర్లు ఆహ్వానించింది. ఇటీవలే విజయవాడ నుంచి కృష్ణా జలాల్లో శ్రీశైలం ప్రాజెక్టు వరకు సీ ప్లేన్ విజయవంతంగా నడిపిన విషయం తెలిసింది. దేశంలో నీటి విమానాశ్రయాలు ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం గత ఎడాది నిర్ణయం తీసుకోంది. ఈ ఆర్థిక సంవత్స రంలో వీటిని అమలు చేసేదిశగా కేంద్రం అడుగులు వేస్తోంది. ఈ విషయాన్ని కేంద్ర విమానాయన శాఖ సహాయమంత్రి కె.రామ్మోహన్ నాయుడు అధికారికంగా కూడా ప్రకటించారు. అందులో భాగంగా దేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తో పాటు అండమాన్ అండ్ నికోబార్ ,లక్షద్వీప్, గోవా, అస్సాం, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలలో 18 వాటర్ ఏరో డ్రమ్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే గుజరాత్ రాష్ట్రంలోనూ అన్నమాన్ నికోబార్లో సిప్లేన్లు నడుస్తున్నాయి. వీటిని అధ్యయనం చేసిన తర్వాతే రాష్ట్రంలో కూడా నడపాలని నిర్ణయం తీసుకున్నారు. అందులో భాగంగా ఎయిర్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఏఏఐ) వాటర్ ఏరోడ్రమ్స్ కు ప్రాథమికంగా విజయవాడ ప్రకాశం బ్యారేజీని గుర్తించింది. అలాగే ప్రస్తుతం అరకు లంబసింగి, రుషికొండ, కాకినాడ, కోనసీమ ,శ్రీశైలం, తిరుపతి కేంద్రాలను నిర్ణయించి వాటర్ ఏరో డ్రమ్స్ ఏర్పాటుకు సమగ్ర ప్రాజెక్టు నివేదిక సిద్ధం చేసేందుకు ఏపీఎడిసిఎల్ టెండర్లు పిలిచింది. ప్రయోగాత్మకంగా చేపడుతున్న నీటి విమానాశ్రయాల విధానం రీజినల్ >>2

## దేశంలో 30 వేల మంది పైలట్లు అవసరం

### కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

**విజయవాడ మార్చి 11 ప్రభాతవార్త ప్రతినిధి:** భారత్‌లో పౌర విమానయాన రంగం వేగంగా విస్తరిస్తోందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. ప్రయాణికుల సంఖ్య ఏటికేడు పెరుగుతుండడంతో అందుకు అనుగుణంగా విమానాలను సైతం ఆయా సంస్థలు సిద్ధం చేసుకుంటున్నాయి. ఈక్రమంలో రాబోయే రోజుల్లో పైలట్లు కూడా పెద్ద సంఖ్యలో అవసరమవుతారని. రాబోయే 15-20 ఏళ్లలో సుమారు 30 వేల మంది పైలట్లు అవసరం పడతారని పేర్కొన్నారు. 200 శిక్షణ విమానాల కొనుగోలుకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ మేరకు ఆయన మాట్లాడారు. దేశీయంగా 800కు పైగా విమానాలు సేవలం >>2

## ఘోర ప్రమాదం బస్సు-స్కూటర్ ఢీ ఐదుగురు దుర్మరణం



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్

**ఆదోని, మార్చి11 ప్రభాతవార్త :** బస్సు స్కూటర్ ఢీ కొని ఘోర రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే నలుగురు మృతి మరొకరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. పాండవగల్లు గ్రామం జలమంచి క్రాస్ దగ్గర కర్ణాటక ఆర్టీసీ కెఎ 37 ఎఫ్ 0711 నంబర్ గల బస్సు కుప్పగల్ గ్రామానికి చెందిన ఈరన్న (25)ఆదిలక్ష్మి (20) దంపతులు ద్విచక్ర వాహనంపై వస్తుండగా. మరో ద్విచక్ర వాహనంపై ద్విచక్ర వాహనంపై కర్ణాటక రాష్ట్రం మన్వికి చెందిన మహేంద్ర (40) నాగరత్న (35) దంపతులు కుమారుడు దేవరాజు(22) వాహనంపై >>2

## వంశీ కస్టడీ పిటిషన్ తిరస్కృతి

**విజయవాడ మార్చి 11 ప్రభాతవార్త ప్రతినిధి:** కిడ్నాప్, దాడికేసులో వైకాపా నేత వల్లభనేని వంశీని మరోసారి కస్టడీకి ఇవ్వాలని పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌ను విజయవాడలోని ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు కొట్టివేసింది. ఈ మేరకు న్యాయాదికారి హిమబిందు సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు. కేసును మరింత లోతుగా విచా రించాల్సి ఉందనీ, తొలి విడత కస్టడీలో నిందితుడు నోరు విప్పలేదని మరో 10 రోజులు కస్టడీకి ఇవ్వాలని పోలీసులు గతవారం పిటిషన్ వేసిన సంగతి తెలిసిందే. దీనిపై ఇరుపక్షాల వాదనలు పూర్తయిన నేపథ్యంలో ఆదేశాలు వెలువడ్డాయి. వంశీ బెయిల్ పిటిషన్‌పై సోమవారం వాదనలు ప్రారంభం కావాల్సి ఉంది. తమ అభ్యంతరాలను తెలిపేందుకు సత్య >>2

## మహిళల జోలికి వస్తే ఊరుకోం

### రౌడీరాజకీయాలను కఠినంగా అణచివేస్తాం: హోంమంత్రి అనిత



**విజయవాడ,మార్చి11,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో మహిళల జోలి వస్తే ఎంత మాత్రం సహించమని ఏపీ అంగరంగిక శాఖా మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేసారు. రౌడీ రాజకీయాలను, అరాచకాలను అణిచేస్తామన్నారు . ప్రభుత్వంపై అనవసరపు బురద జల్లేందుకు సామాజిక మాధ్యమాలో అనుచిత కథనాలను ప్రసారం చేస్తే సహించమన్నారు. హోంమంత్రి అనిత హోంశాఖకు సంబంధించిరూ.8570 కోట్ల బడ్జెట్ ను శాసనసభ ఆమోదించింది. ఈ బడ్జెట్‌పై ఆమోదానికి ముందు జరిగిన చర్చలో మాచర్ల ఎంఎల్ఏ బ్రహ్మారెడ్డి, సర్వేపల్లి ఎంఎల్ఏ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తదితరులు గత ప్రభుత్వంలో చోటు చేసుకున్న అనుచిత పరిస్థితులను వివరించారు. బ్రహరెడ్డి ఉద్వేగంతో మాట్లాడుతూ తమ నాయకుడు చంద్రబాబు కక్షసాధింపుకు అంగీకరించడంలేదన్నారు. గతంలో జరిగిన దుశ్చర్యలకు బదులు చెబితే ఎటువంటి పరిస్థితులుంటాయో ఆలోచించాలన్నారు. తనపై హిజ్రాలతో దాడి చేయించిన విషయాన్ని ఈ సందర్భంగా సోమిరెడ్డి సభలో ఛాయాచిత్రాలతో ప్రదర్శించారు. గత ప్రభుత్వంలో మహిళాధ్యక్షురాలిగా ఒక బుక్ లెట్ తో డీజీపీ ఆఫీస్ వెళ్లే కేసు పెట్టారు: హోంమంత్రి అనినా పైన మొత్తం గత ప్రభుత్వం 23 కేసులు పెట్టిందిగత వైసీపీ పాలనలో ప్రతి 8 నిమిషాలకి ఒక అఘా యిత్యం టీడీపీ, నాయకులే టార్గెట్‌గా గత పోలీస్ యంత్రాంగం పని చేసిందిచిన్నారులు, మహిళలకు రక్షణగా రూ.17కోట్లతో ప్రత్యేక రక్షణ విభాగం మహిళలపై అఘాయిత్యాల >>2

## పోసానికి ఆయా కోర్టుల్లో బెయిలు మంజూరు

**విజయవాడ,మార్చి11,ప్రభాతవార్తప్రతినిధి:** పోసాని కృష్ణమురళికి ఆయా కోర్టులో బెయిల్ మంజూరైంది. రాష్ట్రముఖ్య మంత్రి, డిప్యూటీ సీఎంలను పోసాని వారు విపక్షంలో ఉండగా అనుచిత పదజాలంతో దూషించారని వివిధ ప్రాంతాల్లో కేసులు నమోదయ్యాయి. ఈ క్రమంలో ఆయనను పీటీ వారెంట్‌పై కోర్టులు చుట్టూ తిప్పుతున్నారు. ఈ నేపథ్యంలో ఆదోని, విజయవాడ కోర్టుల్లో పోసానికి మంగళవారం బెయిల్ మంజూరయింది. ఇప్పటికే పోసానికి రాజంపేట, నరసరావుపేటలో బెయిల్ >>2



మంగళవారం శాసనసభలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబునాయుడు

# శాంతి భద్రతల సమస్యలు సృష్టిస్తే ఉపేక్షించం

## ఈగల్ వ్యవస్థతో గంజాయి, డ్రగ్స్ పై ఉక్కుపాదం మోపాం

## నా రాజకీయ జీవితంలో హత్యా రాజకీయాలకు తావులేదు

## ఇప్పుడు ప్రజా సమస్యలపై చర్చిస్తున్నాం: సిఎం చంద్రబాబు

**విజయవాడ,మార్చి11,ప్రభాతవార్తప్రతినిధి:** శాంతి భద్రతల సమస్యలు సృష్టిస్తే ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని సీఎం అన్నారు. ఈ విషయంలో డ్రోన్ల ద్వారా పెట్రోలింగ్ చేయిస్తున్నామని, నిందితులకు రెండుమూడు నెలల్లోనే శిక్షలు పడేలా కార్యాచరణ చేశామన్నారు. మహిళలపై అఘాయిత్యానికి పాల్పడే ప్రయత్నం చేస్తే వారికి అదే చివరి రోజు అవుతుందని హెచ్చరించారు. సైబర్ సెక్యూరిటీ విషయంలో కట్టుదిట్టమైన చర్యలను ప్రభుత్వం చేపట్టిందని సీఎం స్పష్టం చేశారు. 26 జిల్లాల్లో సైబర్ పోలీసుస్టేషన్లు ఏర్పాటు చేసి భద్రత కల్పించే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. గంజాయి, డ్రగ్స్‌పై ప్రభుత్వం నిరంతరం యుద్ధం చేస్తుందని సీఎం అన్నారు. గత ప్రభుత్వం ఒక్కసారి కూడా దీనిపై సమీక్ష చేయలేదని అందుకే పరిస్థితులు విచ్చలవిడిగా మారిపోయాయని అభిప్రాయపడ్డారు. గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపామని అందుకోసం ఈగల్ అనే ప్రత్యేక వ్యవస్థ తీసుకొచ్చామని తెలిపారు. గంజాయి పండించి ప్రజల జీవితాలతో చెలగాటమాడొద్దని సూచించారు. సరిహద్దుల నుంచి గంజాయి రాకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. గంజాయి పండించే వారికి ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించి గంజాయిని అంతం చేస్తామని సీఎం చంద్రబాబు అన్నారు. ఎవరైనా తప్పుచేస్తే అస్సలు వదిలిపెట్టము వారి తాటతీస్తాము. అప్రమత్తంగా లేకుంటే పోలీసులపైనా చర్యలుంటాయి. నేరస్థులు ఎలా ట్రాప్‌లో పెడతారో వివేకా హత్యే ఒక ఉదాహరణ. ఆనాడు వివేకా కుమార్తె సునీత పోస్టుమార్టం అడగకపోయి ఉంటే అంత్యక్రియలు చేసేవారు. భూ కబ్జాలకు పాల్పడితే సహించబోను. ల్యాండ్ గ్రాబింగ్ బిల్లు తెచ్చి ఉక్కుపాదంతో అణచివేస్తాము. దాన్ని రాష్ట్రం నుంచి పూర్తిగా నిర్మూలించేంత వరకు విశ్రమించేది లేదు గత పాలకుల నిర్లక్ష్యం వల్ల రాష్ట్రంలో డ్రగ్స్ , గంజాయి వాడకం విపరీతంగా పెరిగింది. బాధ్యతకలిగిన ప్రతిపక్షంగా దీనిపై తెలుగుదేశం పార్టీ ఆందోళన చేస్తే తిరిగి మా కార్యలయంపైనే దాడులు చేశారు. ఏ రాజకీయ పార్టీకైనా పార్టీ కార్యాలయమంటే దేవాలయం. గతంలో ఎక్కడా పార్టీ ఆఫీస్ లపై దాడులు జరిగిన ఘటనలు నా 45 ఏళ్ల రాజకీయ జీవితంలో నేను చూడలేదు. సోషల్ మీడియా ముసుగులో రోత పుట్టించే రాతలు రాశారు. మహిళలపై వ్యక్తిగత దూషణలు చేశారు. ల్యాండ్ గ్రాబింగ్ నిషేధం కింద కొత్త చట్టం తీసుకొస్తున్నాము. గత పాలకులు చేసిన భూ మాఫియా అంతా ఇంతా కాదు. 22 ఏ ఉపయోగించి భూ దందాలు చేశారు. సంచలనం కలిగించిన వివేకానంద హత్య ఉదంతం తలుచుకుంటే ఆందోళన కలుగుతుంది. ఆ కేసుకు సంబంధించి 6 మంది సాక్షియులు చనిపోవడంపై ఆలోచించాల్సిన అవసరం ఉంది.ప్రేమ పేరుతో అమ్మాయిలను ట్రాప్ చేసేవారి తాట తీస్తాం. గత టీడీపీ ప్రభుత్వంలో గుంటూరు జిల్లా దాచేపల్లిలో చిన్నారిపై అత్యాచారం జరిగింది. 18 టాస్క్ ఫోర్స్ లు నియమించి ప్రభుత్వ యంత్రాంగాన్ని అక్కడ మోహరించాను. ప్రభుత్వం శిక్షిస్తుందనే భయంతో నిందితుడు ఉరేసుకుని చనిపోయాడు. ఆడబిడ్డల జోలికొస్తే చూస్తూ ఊరుకోమని ఆనాడు విజయవాడలో ర్యాలీ నిర్వహించాం. మహిళల రక్షణ కోసమే శక్తి యాప్ తెచ్చాం. ఆడబిడ్డలపై అత్యాచారాలకు ఒడిగడితే అదే వారికి చివరిరోజు. అత్యవసర పరిస్థితులు లేక ఆపదలో చిక్కుకున్నప్పుడు మహిళలు శక్తి యాప్ లో ఫిర్యాదు చేస్తేచాలు...నిమిషాల వ్యవధిలో పోలీసులు వచ్చిరక్షిస్తారు. గత ప్రభుత్వంలో దిశా యాప్ అని ప్రచారం చేశారు. ఏమైంది..దిక్కుమాలిన యాప్‌గా మిగిలింది. మహిళల రక్షణ కోసం ప్రభుత్వం తీసుకుంటున్నచర్యలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన బాధ్యత పోలీసులదే. మహిళల భద్రత విషయంలో అప్రమత్తంగా లేకపోతే పోలీసులపైనా చర్యలు తీసుకుంటామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

# అత్యున్నత పురస్కారం

>> ప్రధాని మోడీ గౌరవ అతిథిగా హాజరవుతునానరు. ఈనేపథ్యంలో కవాతులో గౌరవ వందనం స్వీకరించారు. హిందూమహాసముద్రంలో ఉన్న మారిషస్‌తో భారత్‌కు లోతైన మైత్రీ బంధం ఉంది. ఆఫ్రికా ఖండానికి వెళ్లేందుకు మారిషస్‌ను గేట్‌వేగా భావిస్తారు. చరిత్ర, భౌగోళికం, సంస్కృతిద్వారా రెండుదేశాలు కనెక్ట్ అయ్యాయని మోడీ ఈసందర్భంగా పేర్కొన్నారు. భారతనౌకాదళం, మారిషస్‌లమధ్యసాంకేతిక ఒప్పందం జరుగనున్నది. వాణిజ్యం, సీమాంతర ఆర్థికనేరాలు, చిన్న మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి వంటి అంశాలపై రెండుదేశాలు ఒప్పందాలుచేసుకుంటున్నాయి.

# ఎగువసభలో దుమారం

>> కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వ్యాఖ్యలకుగాను ఆయన క్షమాపణ చెప్పాలని డిఎంకె ఎంపిలు డిమాండ్‌చేసారు. ఈ గందరగోళం మధ్య జోక్యంచేసుకున్న ఖర్గే ఉదయం తాను మాట్లాడేటప్పుడు విద్యాశాఖ మంత్రి సభలో లేరని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందని, ప్రభుత్వాన్ని ఇరుకునపెట్టేందుకు విపక్షాలు సిద్ధంగా ఉన్నాయన్న అర్థం వచ్చేలా ఒక హిందీపదం వాడారు.

దీనిపై అధికారపక్షం తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసింది. ప్రతిపక్ష నేత వాడిన పదజాలం ఖండించదగినదని దుయ్యబట్టింది. చైర్‌ను ఉద్దేశిస్తూ అటువంటి వ్యాఖ్యలు క్షమించరానిదని రాజ్యసభా పక్షనేత జెపినడ్డా మండిపడ్డారు. స్పందించిన ఖర్గే ఆపదజాలం వాడినందుకు క్షమాపణలు చెపుతున్నానని అయితే అవి చైర్‌ను ఉద్దేశించి చేసినవి కాదని ప్రభుత్వ విధానాలగురించి అలా మాట్లాడానని క్లారిటీ ఇచ్చారు. తన వ్యాఖ్యలు బాధపెట్టి ఉంటే క్షమించాలంటూ చైర్‌కు కాంగ్రెస్ అధ్యక్షుడు విజ్ఞప్తిచేసారు.

# కేజ్రీవాల్, మరో ఇద్దరిపై కేసు

>> విమర్శలు వెల్లువెత్తాయి. గులాబ్‌సింగ్, నితికా శర్మలపైనా కేజ్రీవాల్‌తోపాటు కేసులు నమోదుచేసి దర్యాప్తుప్రగతినివేదిక తమకు అందచేయాలని ఆదేశించారు. ఆప్ తన పబ్లిసిటీకోసం పదేళ్లుగా ప్రభుత్వ నిధులనున దుర్వినియోగంచేస్తోందని బిజెపి ఆరోపిస్తూ వస్తోంది. గత ఏడాది జనవరిలో కూడా డిఐపి కూడా ఆప్‌ను 163.62 కోట్ల నిధులను వడ్డీతో కలిపి రీయింబర్స్‌చేయాలనికోరింది. ప్రభుత్వ నిధులను రాజకీయ ప్రకటనలకోసం వినియోగించడం నిబంధనలకు విరుద్ధమని తేల్చింది. ఒకపథకానికి 50 కోట్లుకేటాయిస్తే ఆప్‌ప్రభుత్వం 80 కోట్లు ఖర్చుచేసిందన్నారు.

దేశ్‌కే మెంటార్‌స్కీంలో కేవలం 1.9 కోట్లు కేటాయిస్తే 27.9 కోట్లు ఖర్చుచేసిందని పబ్లిసిటీ హంగామాకోసం భారీగా నిధులు ఖర్చుచేసిందని బిజెపి ఆరోపించింది. అలాగే వరిదుబ్బులు నియంత్రణ పథకంకోసం 77 లక్షలు పబ్లిసిటీ నిధులుకేటాయిస్తే 28 కోట్లు వ్యయంచేసారని ఆరోపించారు. అయితే ఆమ్ ఆద్మీపార్టీ ఈఆరోపణలన్నింటినీ కొట్టివేసింది.

# కాలుష్య దేశాల్లో

>> గంగానగర్, గ్రేటర్‌నోయిడా, భివాండి, ముజఫర్‌నగర్, హనుమాన్‌గఢ్, నోయిడాలు ఉన్నాయి.ఇక ప్రపంచంలోనే అత్యంత కాలుష్యపూరిత రాజధానిగా ఢిల్లీ తొలిస్థానంలో కొనసాగుతోంది. 2023లో ఈసంస్థ విడుదలచేసిన జాబితాలో ప్రపంచంలోని మూడో అత్యంత కలుషిత వాతావరణ దేశంగా భారత్ నిలిచింది. ఇపుడు ఐదో అత్యంత కలుషిత దేశంగా ఇండియా నిలిచింది. ఈ కాలుష్యం వల్ల ప్రజల ఆయుష్షు సుమారు 5.2 సంవత్సరాలు తగ్గినట్లు నివేదికలు అంచనావేసాయి. 2009 నుంచి 2019వరకూ భారత్‌లోప్రతిఏటా కాలుష్య సంబంధిత వ్యాధులవల్ల సుమారు 1.5 మిలియన్లమంది అంటే 15 లక్షలమంది ప్రాణాలు పోతున్నట్లు గత ఏడాది విడుదలయిన లాన్సెట్ ప్లానెటరీ హెల్త్ అధ్యయనం వెల్లడించింది. ఈ నివేదికలపై ప్రపంచ ఆరోగ్యసంస్థ మాజీ ప్రధాన శాస్త్రవేత్త ఆరోగ్యమంత్రిత్వశాఖ సలహాదారు సౌమ్య స్వామినాథన్ స్పందించారు. కాలుష్యనివారణకు తగిన చర్యలు తీసుకోవాల్సిన వసరం ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనిఇళ్లల్లోవంటచెరకు ఉపయోగించడం వల్ల అక్కడిప్రజలు అధికంగా కాలుష్యకారక వ్యాధులకు గురవుతున్నారని అన్నారు. వాటినినివారించడానికి బయోమాస్‌ను ఎల్పీజీ సిలిండర్లతోభర్తీచేయడం వంటి అంశాలను ప్రజల్లో విస్తృత ప్రచారంచేయాలన్నారు. భారత ప్రభుత్వం ఇప్పటికే సంక్షేమపథకాన్ని అమలుచేస్తోందని,దీన్ని పూర్తిగా నియంత్రించాలంటే అదనపు గ్యాస్ సిలిండర్లపై రాయితీలు ఇవ్వాలని సూచించారు. ప్రజల ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండాకాలుష్యస్థాయి తగ్గే అవకాశం ఉందన్నారు. నగరాల్లోప్రజారవాణాను విస్తరించడం, కొన్నిరకాల వాహనాలపైజరిమానాలు, ఆపై నిషేధించడం, పరిశ్రమలు నిర్మాణ సంస్థలు తగిన నిబంధనలు పాటించడం వంటి చర్యలతో కాలుష్యాన్ని అరికట్టవచ్చన్నారు.

# రూ.40వేల కోట్లతో అమరావతి అభివృద్ధి

>> తెలుపుతూ ముంబైలోని హడ్కో కార్యాలయానికి లేఖ పంపారు. జర్మనీకి చెందిన ఆర్థిక సంస్థ నుంచి మరో రూ.5వేల కోట్లు రుణాలు తీసుకోవడంతో పాటు రూ.1500 కోట్లు కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రాంట్‌గా తీసుకోనున్నారు. మొత్తం రూ.31వేల కోట్ల నిధులు ప్రభుత్వం వద్ద అమరావతి నిర్మాణానికి సంబంధించి సిద్ధంగా ఉన్నాయి.రాజధాని అమరావతి స్వయంచోదక ప్రాజెక్టు అని గతంలోనే సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.ఈ మొత్తం 59 పనుల్లో సీఆర్డీఏకు చెందిన 22 పనుల విలువ దాదాపు రూ.22,607.11 కోట్ల అని, ఏడిసి కి చెందిన 37 పనుల విలువ దాదాపు రూ.15,095.04 కోట్లని ఆయన తెలిపారు. సీఆర్డీఏకు చెందినవి 24 పనులుకాగా ప్రస్తుతానికి 22 పనులకు సంబందించిన టెండర్లను మాత్రమే ఓపెన్ చేయడం జరిగిందని, మిగిలిన 2 పనులకు సంబందించిన టెండర్లను ఈ నెల 17 వ తేదీన ఓపెన్ చేయడం జరుగుతుందన్నారు. ఇవి కాక ఎన్టీఆర్ విగ్రహం, ఐకానిక్ బ్రిడ్జి, జాతీయ రహదారికి అనుసందానం చేసే రహదారులు, కరకట్ట రహదారి నిర్మాణం తదితర పనులకు సంబందించి దాదాపు రూ.16,871.52 కోట్ల విలువైన మరో 19 పనులకు ఈ నెలాఖరు లోపు టెండర్లు పిలిచి పనులను చేపట్టడం జరుగుతుందన్నారు. అమరావతి అభివృద్ధి పనులకు సంబందించి 2014-19 మద్యకాలంలో దాదాపు రూ.43 వేల కోట్ల విలువైన టెండర్లను పిలిచి, రూ.9 వేల కోట్ల వరకూ వెచ్చించడం జరిగిందన్నారు. 2014-19 మద్య కాలంలో పలు సంస్థలకు భూములు కేటాయించడం జరిగిందని, ఈ అంశంపై నిన్న జరిగిన మంత్రుల బృందం సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు 31 సంస్థలకు కేటాయించిన భూములకు నేడు జరిగిన సీఆర్డీఏ సమావేశంలో ఆమోదం తెల్పడం జరిగిందన్నారు. రెండు సంస్థలకు స్థలం మార్పుకు, మరో 11 సంస్థలకు స్థలం మార్పుతో పాటు కాల పరిధిని కూడా పొడిగించడం జరిగిందన్నారు. అమరావతి క్యాపిటల్ సిటీ అభివృద్ధికి దాదాపు రూ.64 వేల కోట్లు ఖర్చువుతుందని, అందుకు రాష్ట్ర ప్రజల నుండి వసూలు చేసే పన్నుల నుండి ఏమాత్రము ఖర్చు పెట్టే ప్రసక్తే లేదని రాష్ట్ర ముఖ్యమంత్రి చెప్పిన విధంగా జరుగుతుందన్నారు. రైతుల నుండి సేకరించిన భూముల్లో దాదాపు 6,203 ఎకరాలు సీఆర్డీఏకు మిగిలిందని, అందులో దాదాపు 1900 ఎకరాలను పలు సంస్థలకు కేటాయించడం జరుగుచున్నదన్నారు. ఇవి అన్నీ పోగా ఇంకా సీఆర్డీఏ వద్ద అభివృద్ధి చేయబడిన స్థలం దాదాపు 4,000 ఎకరాలు ఉంటుందన్నారు. ఆ భూమి తనకా పెట్టడం ద్వారా మరియు వేలం పాట వేసి అమ్మడం ద్వారా వచ్చే ఆదాయంతో క్యాపిటల్ సిటీని నిర్మించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే ప్రపంచ బ్యాంకు నుండి రూ.15 వేల కోట్లు మేర ఋణాన్ని తీసుకోవడం జరిగిందని, ప్రస్తుతం హడ్కో ద్వారా రూ.11 వేల కోట్లు, వివిధ బ్యాంకుల ద్వారా రూ.5 వేల కోట్ల మేర రుణాన్ని తీసుకోనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ విధంగా దాదాపు రూ.31 వేల కోట్ల ను సమీకరించడం జరిగిందని, ఆ నిధులతో పనులను ప్రారంభిస్తున్నామన్నారు. ఈ అభివృద్ధి పనుల వల్ల భూమి రేట్లు కూడా పెరుగుతాయని, అప్పుడు ఆ భూములను వేలం ద్వారా అమ్మి వచ్చిన సొమ్ముతో అసలు, వడ్డీలను కూడా తీర్చేయడం జరుగుతుందన్నారు. వివిధ బ్యాంకుల నుండి సమీకరిస్తు రుణాల నుండే వెచ్చించేందుకు బడ్జెట్‌లో రూ.6 వేల కోట్లను అమరావతి అభివృద్ధి పనులకు చూపడం జరిగిం దన్నారు. అమరావతి రాజధాని ప్రాంతంలో అన్ని రకాల భూములు కలుపుకుని దాదాపు 53,500 ఎకరాలు ఉందని,అందులో 30 శాతం వరకూ గ్రీన్ అండ్ బ్లూని అభివృద్ధి పర్చడం జరుగుతుందని రాజధాని నగరంతన నిర్మాణానికి కావాల్సిన నిధుల్ని తానే సమకూర్చుకుంటోంది అని వెల్లడించారు. ఎక్సటర్నల్ ఎయిడెడ్ రుణాలను ఆ సంస్థే తీర్చుకునేలా కార్యాచరణ చేశారని అన్నారు. నగరం అభివృద్ధి చెందిన తర్వాత తనకు తానే రుణాలు తీర్చుకునేందుకు అనుగుణంగా ప్రణాళికలు ఉన్నాయని తెలిపారు. రాజధాని నిర్మాణానికి రూ.లక్ష కోట్లు కావాలని జగన్ ప్రజల్ని మభ్యపెట్టారని మంత్రి మండిపడ్డారు. పోలవరం, అమరావతి లాంటి ప్రధాన ప్రాజెక్టులు పూర్తి అయితే ఇప్పుడు జిల్లాల అభివృద్ధిపై దృష్టి పెట్టేందుకు అస్కారం ఉండేదని వ్యాఖ్యానించారు. రాజధానిలో నిర్మాణాలు చేపట్టేందుకు ఆసక్తి ఉన్న వారందరికీ స్థలాలు కేటాయిస్తున్నామని స్పష్టం చేసారు. భూములు తీసుకున్న అనంతరం ప్రాజెక్టు ఎన్నిరోజుల్లో పూర్తి కావాలన్న అంశంపై షరతు విధిస్తున్నామని వివరించారు. భూమి తీసుకుని ఆయా సంస్థలు కాలయాపన చేసి తర్వాత వ్యాపారం చేసుకుంటామంటే అనుమతించేది లేదని తెలిపారు.లాండ్ పూలింగ్ స్కీమ్ కింద రైతులకు ఇచ్చిన ఫ్లాట్స్‌లో రోడ్లు, ఇతర పనులను మూడేళ్లలో పూర్తి చేస్తామని తెలిపారు. ఇక రెండేళ్లలో పెద్ద రోడ్లను పూర్తి చేస్తామని.. సెక్రటేరియట్, అసెంబ్లీ వంటి ఐకానిక్ టవర్స్‌ను కూడా మూడేళ్లలో పూర్తి చేస్తామని చెప్పారు. వీటిన్నింటికి సంబంధించి టెండర్ల ప్రక్రియ ఇప్పటికే పూర్తి అయిన నేపథ్యంలో రూ.40 వేల కోట్ల పనులకు సంబంధించి అనుమతించే పత్రాలను ఆయా కంపెనీలకు అందజేయడం, సీఆర్డీఏ ఒప్పందాలకు సీఆర్డీఏ సమావేశం కీలకంగా నిర్ణయం తీసుకున్నామన్నారు. ఈ భేటీలో మంత్రులు నారాయణ, పయ్యావుల కేశవ్, సీఎస్ విజయానంద్, సీఆర్‌డీఏ కమిషనర్ కూనపరెడ్డి కన్నబాబు, ఏడీసీ, సీఎండీలు పాల్గొన్నారు.

# మహిళల జోలికి వస్తే ఊరుకోం

>> విచారణలో ప్రత్యేక దృష్టిమహిళా దినోత్సవంనాడు శక్తి యాప్ ను సీఎం చేతులమీదుగా ఆవిష్కరశక్తి యాప్ పై అవగాహన కలిగించడంలో ప్రతి ఒక్కరూ చొరవ చూపాలి112కు ఫోన్ చేస్తే అర్ధరాత్రులు సైతం ఆడపిల్లలకి పోలీసుల అండ మహిళల కోసం ప్రత్యేక నైట్ షెల్టర్లను అందుబాటులోకి తెచ్చాంఅనకాపల్లిలోని నా నియోజకవర్గంలో శక్తి టీమ్స్ సేవలు ప్రారంభించాం పులుల్లా పని చేస్తున్న మహిళా కానిస్టేబుళ్లుఅమ్మాయిలపై దాడులకు సంబంధించి సమాచారం వస్తే 15 నిమిషాలలో పోలీసులు వచ్చేస్తారు. పట్టణాల్లో అయితే 5 నుంచి 10 నిమిషాల్లో వచ్చి కాపాడుతారు. కొత్త జిల్లాలకు ఎస్పీ కార్యాలయాలు లేవు.పోలీస్ స్టేషన్లు, కార్యాలయ భవనాలకు రూ.50కోట్ల పైన బడ్జెట్ లో కేటాయించాం. చిత్తూరు. రాజమండ్రి, ప్రకాశం, శ్రీకాకుళం జిల్లాలలో రిజర్వ్ బెటాలియన్ల ఏర్పాటుప్రతి పోలీస్ స్టేషన్ కి 2 డ్రోన్ల ద్వారా రద్దీ ప్రాంతాలలో పటిష్ట నిఘాడ్రోన్ ద్వారా ట్రాఫిక్ నియంత్రణ దిశగా అడుగులుగత ఐదేళ్లలో ఒక్క వాహనం కొనలేదు..కొన్నవాటికి కూడా బిల్లులు ఇవ్వలేదు..ఓ బ్యాంకు బ్లాక్ లిస్ట్ లో పెట్టిందిరూ.300 కోట్లతో 2812 పోలీస్ వాహనాల ఏర్పాటుకు కేటాయింపులుపోలీసులకు 150 లీటర్ల నుంచి 300 లీటర్ల ఇంధనం ఇచ్చేందుకు బడ్జెట్ లో కేటాయించాం. పోలీస్ ద్విచక్ర వాహనాలకు పెట్రోల్ 25 లీటర్ల నుంచి 50 లీటర్లకు పెంపు ఇన్వెస్టిగేషన్ ఛార్జీల కింద వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లు పైసా కేటయించలేదు. ఎస్ఎల్ఎస్‌సీ, ఏఎస్ఎల్ఎస్‌సీ, జీపీఎఫ్, ఏపీ జీఎల్ఐ, మెడికల్ రీఎంబర్స్ మెంట్ దశలవారీగా చెల్లిస్తాంపోలీస్ సంక్షేమంలో భాగంగా గత రెండేళ్లు నిలిచిపోయిన జీపీఏని పునరుద్ధరించాం. రూ.20కోట్లు పోలీస్ వెల్ఫేర్ కోసం కేటాయించాం. ఫోరెన్సిక్ ల్యాబ్ కోసం రూ.152 కోట్లు కేంద్రమిచ్చినా కావాలనే కక్షకట్టి నిర్మాణం ఆపారు. కేవలం అమరావతిలో ఏర్పాటు చేస్తున్నారనే అక్కసే కారణం. 21 రోజుల్లో ఉరితీసే దిశ చట్టం తీసుకురావడం విడ్డూరం. ఫోరెన్సిక్ వ్యవస్థ లేదు, పామ్ , ఫింగర్ ప్రింట్ గుర్తించే వ్యవస్థ, సీసీ కెమెరా, డ్రోన్‌లు లేకుండా ఉరి శిక్ష వేస్తారా?అన్ని సదుపాయాలిస్తే పోలీసులు 90 రోజుల్లో శిక్ష అమలు చేయగలరు. విజయనగరం జిల్లాలో మూడేళ్ల చిన్నారిపై అత్యాచారం జరిగితే ఫోక్సో కోర్టు ద్వారా 3 నెలల్లో శిక్ష విధించాం. బెయిల్ రాకముందే నిన్ననే నిందితుడికి 25 సంవత్సరాల శిక్ష పడేలా చేశాం. ఏ అఘాయిత్యం జరిగినా 24గంటల్లో పట్టుకుంటున్నాం. రూ.24 కోట్లు ఫోరెన్సిక్ ల్యాబొరేటరీ పూర్తి కోసం కేంద్ర హోంశాఖ నిధులిచ్చింది. ఏపీ పునర్విభజన కింద చేయాల్సిన గ్రేహౌండ్స్, అప్పాలను ఏర్పాటు చేస్తాం. 201718లో కేంద్రప్రభుత్వం రూ.295 కోట్లు మంజూరు చేసింది. యూసీ సర్టిఫికెట్లు సమర్పించకపోవడం వల్ల రావల్సిన రూ.9కోట్లు కూడా రాలేదు. విజయనగరం జిల్లా రెల్లి గ్రామంలో 500 ఎకరాల విస్తీర్ణంలో గ్రేహౌండ్స్ ను ఏర్పాటు చేస్తాం. ఆంధ్రప్రదేశ్ పోలీస్ అకాడమీ (అప్పా) లేని రాష్ట్రం మనదేఏలూరు జిల్లా నిగుండపల్లిలో 165 ఎకరాలలో అప్పాను ఏర్పాటు చేస్తాంపోలీసులకు పర్సనల్ ట్రావెల్ అలవెన్స్‌ను రూ.100 కోట్ల నుంచి రూ.125 కోట్లకు పెంచాంగతంలో ఒక్కసారి కూడా అడిషనల్ సరెండర్ లీవ్స్ ఇవ్వలేదుసరెండర్ లీవ్స్ కింద రూ.10 కోట్లు కేటాయించాంపోలీసు కుటుంబాల ఆరోగ్య భద్రత కోసం గతంలోని రూ.2 లక్షల నుంచి ఇపుడు రూ.15 లక్షలు హైబ్రిడ్ మోడల్ మొత్తం కుటుంబానికి తీసుకువస్తున్నాంహోంశాఖలో 18 మంది విభాగాధిపతులు, 15వేల మంది హోంగార్డులు, 75,600 మంది సిబ్బంది ఉన్నారుడైరెక్టర్ ప్రాసిక్యూషన్ కూడా హోంశాఖ నియంత్రణలో భాగం24 జిల్లాల పోలీస్ యూనిట్లు, 2 పోలీస్ కమిషనరేట్లు, 114 పోలీస్ సబ్‌డివిజన్లు, 216 పోలీస్ సర్కిళ్లు, 1026 పోలీస్ స్టేషన్లు హోంశాఖలో భాగంమహిళల మీద జరిగే నేరాలు 10.76 శాతం తగ్గుదఎస్సీ, ఎస్టీలపై దాడులు 10.56 శాతం తగ్గుదగత ప్రభుత్వంలో ఎస్సీ,ఎస్టీలే లక్ష్యంగా దాడులుతోటచంద్రయ్యను రాక్షసంగా చంపినందుకు సీఐడీ ద్వారా వేగంగా విచారవైఎస్ వివేకానందరెడ్డి హత్య గురించి కూడా చెప్పాలిసీబీఐ విచారణ వేగంగా పూర్తి చేయించి వివేకా కుమార్తెకు న్యాయం చేస్తాంవీఆర్ జీతాల గురించి ముఖ్యమంత్రి సూచనలతో ముందుకెళతాంజీతాలివ్వకుండా వీఆర్ లో పెట్టి గత ప్రభుత్వం అన్ని పనులు చేయించుకుందిన్యాయ సలహా తీసుకుని సూపర్‌న్యూమరీ ప్రమోషన్లు పూర్తి చేస్తాంశాంతిభద్రతలు, మహిళల భద్రతకు చిత్తశుద్ధిగా ముందుకెళుతున్నామన్నారు.

# మారిషస్ అధ్యక్షుడికి గంగాజలాన్ని అందజేసిన ప్రధాని నరేంద్రమోడీ

**పోర్టులూయిస్, మార్చి 11:** ప్రధానమంత్రి నరేంద్రమోడీ మారిషస్ పర్యటనకు వెళ్లిన విషయం తెలిసిందే. తన పర్యటనలో భాగంగా మారిషస్ అధ్యక్షుడు ధరమ్ గోకేల్‌తో ప్రధాని భేటీ అయ్యారు. ఈ సందర్భంగా గోకుల్‌కు అపురూప కానుక ఇచ్చారు. మహాకుంభమేళా నుంచి తీసుకెళ్లిన పవిత్ర గంగాజలాన్ని బహుమతిగా అందజేశారు. గంగాజలంతోపాటు ఇతర బహుమతులు కూడా ఇచ్చారు. అంతకుముందు మారిషస్ ప్రధాని డాక్టర్ నవీన్‌చంద్ర రామ్‌గులామ్‌తో మోడీ భేటీ అయ్యారు. కాగా, రెండు రోజుల పర్యటనలో భాగంగా మంగళవారం ప్రధాని మోడీ మారిషస్ చేరుకున్న విషయం తెలిసిందే. బుధవారం జరిగే మారిషస్ 57వ జాతీయ దినోత్సవానికి ప్రధాని గౌరవ అతిథిగా హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో కవాతు ఏర్పాటు చేస్తున్నారు. దాంట్లో భారతీయ సైనిక దళాలు పాల్గొంటున్నాయి. భారతీయ నౌకాదళ యుద్ధ విమానంతోపాటు వైమానిక దళానికి చెందిన ఆకాశ గంగా స్కైడైవింగ్ బృందం పాల్గొననుంది. హిందూ మహాసముద్రంలో ఉన్న మారిషస్‌తో భారత్‌కు గాఢమైన బంధం ఉన్నది. ఆఫ్రికా ఖండానికి వెళ్లేందుకు మారిషస్‌ను గేట్‌వేగా భావిస్తారు. హిస్టరీ, జియోగ్రఫీ, కల్చర్ ద్వారా రెండు దేశాలు కనెక్ట్ అయినట్లు మోడీ తెలిపారు. భారతీయ నేవీ, మారిషస్ అధికారుల మధ్య సాంకేతిక ఒప్పందం జరగనున్నంది. వాణిజ్యం, సీమాంతర ఆర్థిక నేరాలు, చిన్న, మధ్య తరహా పరిశ్రముల అభివృద్ధి వంటి అంశాలపై రెండు దేశాలు ఒప్పందాలు కుదుర్చుకోనున్నాయి.



మంగళవారం పంజాబ్‌లోని భటిండాలో ఎఐఐఎంఎస్ స్నాతకోత్సవంలో పాల్గొన్న రాష్ట్రపతి ముర్ము

# జిల్లాలకు ఇన్‌ఛార్జిలుగా ఐఏఎస్ అధికారులు

>> చర్యలు చేపట్టాలి. నెలవారీ పురోగతి నివేదికను జోనల్ ఇన్‌చార్జి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సమర్పించడం వంటి బాధ్యతలను జిల్లా ఇన్‌చార్జులుగా నియమించిన అధికారుల బాధ్యతలు. ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాలకు వ్యూహాత్మక మార్గదర్శకత్వం అందించాలి. నెలవారీ సమీక్షలు నిర్వహించాలి ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాల్లో పాల్గొనాలి. నెలకోసారి గ్రామాలను సందర్శించి అక్కడ రాత్రి బస చేయాలి. పారిశ్రామికవేత్తలు, రైతులు లబ్దిదారులు, ప్రజాప్రతినిధులు, పన్ను చెల్లింపు దారులతో చర్చలునిర్వహించాలి. జిల్లా కలెక్టర్లు కీలక అధికారులకు పరిపాలనా సంబంధిత శిక్షణ అందించాలి.ప్రజా ఫిర్యాదుల పరిష్కార స్థితిని సమీక్షించాలి .ప్రభుత్వ కార్యక్రమాల అమల్లో అవాంతరాలను గుర్తించి జాప్యానికి కారణాలను విశ్లేషించాలి. ముఖ్యమైన ప్రాజెక్టులకు నిదుల కేటాయింపు వ్యయాన్ని సమీక్షించాలి. జిల్లా పురోగతి , సమస్యలు, సిఫారసులను ముఖ్య కార్యదర్శికి నివేదించాలి. ఇవన్నీ కూడా జోనల్ ఇన్‌చార్జులు యొక్క బాధ్యతలు ప్రభుత్వం సూచించింది.

# లిఫ్టులు, ఎస్కలేటర్ల బిల్లు

>> సోలార్ విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రకటించారు. శాసనసభలో గౌరవ సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి గొట్టిపాటి మంగళవారం సమాధానం చెప్పారు. దీనికి సంబంధించి ఆయన సభలో మాట్లాడుతూ రాష్ట్రంలో పునరుత్పాదక విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు రాయలసీమ తరువాత ప్రకాశం జిల్లానే అత్యంత అనువైన ప్రాంతమని పేర్కొన్నారు. ప్రకాశం జిల్లా దొనకొండ, చంద్రశేఖరపురం ప్రాంతాల్లో మెగా సోలార్ విద్యుత్ ప్లాంట్ల నిర్మాణానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఒక్కో ప్లాంట్ నిర్మాణానికి సుమారు 5,500 ఎకరాల భూమి అవసరమని తెలిపారు. ప్లాంట్ల నిర్మాణానికి భూ కేటాయింపులకు సంబంధించి ఇప్పటికే ప్రకాశం జిల్లా కలెక్టర్ నుంచి నివేదిక కోరామన్నారు. కలెక్టర్ నివేదిక తరువాత సోలార్ ప్లాంట్ల నిర్మాణాన్ని చేపడుతామని మంత్రి చెప్పారు. ఒక్కో సోలార్ విద్యుత్ ప్లాంట్ ద్వారా సుమారు 1,000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందని వెల్లడించారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ 2024 (ఐసీఈ) ద్వారా పునరుత్పాదక విద్యుత్ రంగంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశంలోనే ప్రథమ స్థానంలో నిలుస్తుందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆశాభవం వ్యక్తం చేశారు. ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ ద్వారా 7.5 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఐసీఈ పాలసీ ద్వారా 100 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా ముందుకెళ్తున్నామని మంత్రి గొట్టిపాటి సభాముఖంగా సభ్యులకు వివరించారు.

# ఇక నీటి విమానాశ్రయాలు

>> కనెక్టివిటీ స్కీమ్( ఆర్సిఎస్) కింద మరింత విస్తరించే దిశగాఏఐ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఒక విమానంలో 19 మంది ప్రయాణించేలా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. దేశవ్యాప్తంగా నీటి విమానాశ్రయాలు విస్తరణ చేసేందుకు సరళమైన విధానాన్ని ప్రవేశపెట్టేందుకు కూడా కసరత్తు చేస్తోంది. తద్వారా పర్యాటక రంగాన్ని రాష్ట్రంలో కొత్త పుంతలు తొక్కించేలా మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర మౌలిక సదుపాయాల, పెట్టుబడుల సెక్రటరీ ఎస్ సురేష్, రాష్ట్ర ఎయిర్ పోర్ట్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఎండి ప్రవీణ్ ఆదిత్యలతో ఇప్పటికే సీఎం చర్చించినట్టు తెలుస్తోంది.

## దేశంలో 30 వేల మంది

# పైలట్లు అవసరం

>> దిస్తున్నాయని రామ్మోహన్ నాయుడు తెలిపారు. ప్రస్తుతం 6,7 వేల మంది పైలట్లు పనిచేస్తున్నారని చెప్పారు. ఇప్పటికే వివిధ కంపెనీలు 1700 కు పైగా విమానాలకు ఆర్డర్ పెట్టాయని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో అవి సేవలందించబోతున్నాయన్నారు. దీంతో రాబోయే 15-20 ఏళ్లలో 30 వేల మంది పైలట్లు అవసరమని చెప్పారు. భారత్‌ను ట్రైనింగ్ హబ్‌గా కూడా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. విమానయాన పరిశ్రమ కోసం మంత్రిత్వ శాఖ ఒక సమష్టి విధానంతో పనిచేస్తోందని చెప్పారు. 38 ఫ్లయింగ్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్స్‌ను తనిఖీ చేసి అధికారులు రేటింగ్ ఇవ్వబోతున్నట్లు చెప్పారు.

# కస్టడీ పిటిషన్ తిరస్కృతి

>>వర్ధన్ తరపు న్యాయవాది మరో రెండు రోజులు గడువు కోరారు. కౌంటరు దాఖలు ,తదుపరి వాదనల నిమిత్తం కేసును బుధవారానికి వాయిదా వేశారు. విజయవాడ కారాగారంలో తనను ఒంటరిగా కాకుండా తోటి ఖైదీలతో కలిపి ఉంచాలని వంశీ దాఖలు చేసిన పిటిషన్‌పై జైలు అధికారులు అఫిడవిట్ వేశారు.జైలు సూపరింటెండెంట్ హంసా పాల్ కోర్టుకు హాజరై న్యాయాధికారి వివరణ ఇచ్చారు. నిందితుడిని ఉంచిన సెల్‌కు రెండు వైపులా తోటి ఖైదీలబ్యారక్ ఉన్నాయన్నారు. నిబంధనల ప్రకారం వంశీని ఇతరులతో కలపలేమన్నారు. దీనివల్ల భద్రతా సమస్యలు తలెత్తుతాయన్నారు. కేసులపై చర్చించేందుకు వంశీని ఎక్కువసార్లు కలవాలని అదనంగా 10 నిమిసాల సమయం కేటాయించాలని వేసిన పిటిషన్‌పైనా జైలు అదికారులు వివరణ ఇచ్చారు. పరిస్థితులను బట్టి అనుమతిస్తామన్నారు.

# ఐదుగురు దుర్మరణం

>> వస్తుండగా బస్సు ఢీకొట్టడంతో అక్కడికక్కడే నలుగురు మృతిచెందగా మహేంద్ర అనే వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందు మృతి చెందాడు. ప్రమాదం జరిగిన సంఘటనని తెలుసుకున్న జిల్లా ఎస్పీ విక్రాంత్ పటేల్. డీఎస్పీ హేమలత. సిఐ నల్లప్ప. సంఘటన స్థలానికి చేరుకున్నారు. ప్రమాద కారణాలపై ఎస్పీ ఆరా తీశారు ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. వాహనదారులు రహదారి భద్రత పాటించాలన్నారు. వాహనాలు నడిపే సమయంలో సురక్షితంగా క్షేమంగాగమ్యాలనుచేరుకోవాలన్నారు. పెద్ద తుంబలం పోలీస్ స్టేషన్లో ఎస్ఐ మహేష్ కేసునమోదు చేసుకొనిదర్యాప్తు చేస్తున్నారు.

# బెయిలు మంజూరు

>> మొత్తం నాలుగు కేసుల్లో పోసానికి బెయిల్ మంజూరు ఇతర కేసుల్లో బిఎన్‌సి చట్టం కింద.. పోసానికి నోటీసులు ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. పోసాని కృష్ణమురళికి మంగళవారం కర్నూలు జేఎఫ్ సీఎం కోర్టు మేజిస్ట్రేట్ బెయిల్ మంజూరు చేశారు,మొత్తం 17 కేసులు పోసాని మీద నమోదు చేసారు.ఈ కేసులు అన్నింటిలో ఆయనకు బెయిల్ మంజూరైనట్లు కీలక సమాచారం.ప్రస్తుతం కర్నూలు జైలులో ఉన్న పోసాని కృష్ణమురళి బుధవారం జైలు నుంచి పోసాని విడుదలయ్యే అవకాశం ఉంది.

## వారం - వర్జ్యం

తేది : 12-03-2025, బుధవారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
ఫాల్గుణమాసం, ఉత్తరాయణం,
శిశిర ఋతువు, శుక్లపక్షం,
శుక్ల త్రయోదశి ఉ.9.12
మఖ తె.4.04
వర్జ్యం మ.3.09-4.53
దు.మ.12.02-12.50
శుభసమయం : ఉ.9.30-10.30,
సా.5.40-6.30
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం :** బంధువుల నుండి విలువైన సమాచారం అందుకుంటారు. ఆరోగ్యం పట్ల మెలకువ అవసరం.

**వృషభం:** ముఖ్యమైన పనులలో ఆటంకాలు ఎదురైన అధిగమిస్తారు. ఔషధ సేవనం అవసరం.

**మిథునం:** దూరప్రయాణాలలో తొందరపాటు వద్దు. బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించు కుంటారు.

**కర్కాటకం :** పనులలో జాప్యం జరిగినా నిదానంగా పూర్తి చేస్తారు. ఖర్చులు పెరుగుతాయి. ప్రయాణాలు.

**సింహం:** బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకొంటారు. ఉద్యోగాలలో స్థానమార్పులు వుంటాయి.

**కన్య :** ఆర్థిక పరిస్థితి మెరుగు పడుతుంది. విలువైన వస్తువులు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు.

**తుల :** వృత్తి, వ్యాపారాలలో లాభాలు పొందుతారు. సేవారంగాలలో చురుకుగా పాల్గొంటారు.

**వృశ్చికం:** సోదరులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకొంటారు. ఋణ వత్తిడులు ఎదురై చికాకులు పెడతాయి.

**ధనుస్సు:** వృత్తి, వ్యాపారాలలో ఆటుపోట్లు ఎదురైన పట్టుదలతో ముందుకు సాగుతారు.

**మకరం:** పనులలో ఆటంకాలు ఎదురై అధిగమిస్తారు. ఆరోగ్యం పట్ల మెలకువ అవసరం.

**కుంభం:** భూవివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి. విందు, వినోదాలలో చురుకుగా పాల్గొంటారు.

**మీనం :** బంధువుల నుండి శుభవార్తలు అందుకుంటారు. నూతన వస్తువులు, వస్త్రాలు కొనుగోలు చేస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# రైల్వే గ్యాంగ్‌మెన్ క్యాడర్‌లో ఉన్నత శ్రేణి గ్రేడ్ ఖాళీల భర్తీ

**గుంతకల్లు రైల్వే,మార్చి 11,ప్రభాతవార్త** రైల్వే భద్రతా కేటగిరిలో అత్యంత కీలకమైన ట్రాక్ మెయింటైనర్ కేటగిరీలో పనిచేస్తున్న సిబ్బందికి ఉన్నత శ్రేణి గ్రేడ్‌లను కల్పించేందుకు రైల్వే శాఖ చర్యలు చేపట్టింది. దీంతో తెలుగు రాష్ట్రాల దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలోని వివిధ డివిజన్‌లలో అర్హులైన మొత్తం 1,971మంది రైల్వే ట్రాక్‌మెన్‌లకు (గ్యాంగ్ మెన్‌లకు) ఉన్నత శ్రేణి ట్రాక్ మెన్‌లుగా ప్రయోజనం పొందనున్నారు. రైల్వే జోన్ పరిధిలోని సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంతకల్లు, గుంటూరు, నాందేడ్ డివిజన్‌లలో ట్రాక్ మెయింటెనర్-4 వేతన లెవెల్-1లో పనిచేస్తున్న వారికి, ట్రాక్ మెయింటెనర్-3 వేతన లెవెల్-2 గ్రేడ్‌లో సీనియారిటీ(నాన్-సెలెక్షన్) ప్రాతిపదికన, ట్రాక్ మెయింటెనర్-3, లెవెల్-2లో పనిచేస్తున్న వారికి ట్రాక్ మెయింటేనర్-2 వేతన లెవెల్-4 గ్రేడ్ సీనియారిటీ, స్యూటిబ్యూలిటీ ఆధారంగా ట్రాక్ మెయింటెనర్-2లో లెవెల్-4లో పనిచేస్తున్న వారికి ట్రాక్ మెయింటెనర్-1 వేతన లెవెల్-5లో సీనియారిటీ ప్రాతిపదికన, మౌఖీక పరీక్ష ద్వారా ఉన్నత శ్రేణి గ్రేడ్‌లలో భర్తీ చేసేందుకు జోనల్ అధికారులు చర్యలు చేపట్టారు.



సచివాలయంలో అధికారులతో సమావేశమైన ఏపి సిఎస్ కె.విజయానంద్

# సులభతర వాణిజ్యం అంశాల్లో రాష్ట్రాన్ని ఉత్తమంగా నిలపాలి

## సిఎస్ కె.విజయానంద్

**సచివాలయం,మార్చి 11,ప్రభాతవార్త :** రాష్ట్రంలో సులభతర వాణిజ్యం, కంప్లైయన్స్ రిడక్షన్ అంశాల్లో ఆంధ్ర ప్రదేశ్‌ను ఉత్తమ రాష్ట్రంగా తీరిదిద్దేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వెల్లడించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయ ంలో సులభతర వాణిజ్య విధానం మరియు కంప్లెయిన్స్ రిడక్షన్ అంశాలకు సంబంధించి సిఎస్ మరియు కేంద్ర కెబినెట్ సెక్రటేరియట్ కు చెందిన రాష్ట్రానికి నోడలు అధికారిగా ఉన్న సెక్రటరీ కోఆర్డినేషన్ వందన గుర్నాని ఆధ్వర్యంలో సంబంధిత శాఖల కార్యదర్శులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో రాష్ట్రంలో సులభతర వాణిజ్యానికి సంబంధించి వివిధ శాఖల్లో పెద్ద ఎత్తున సంస్కరణలు ప్రవేశపెట్టడం జరిగిందని తెలిపారు. కేంద్ర కేబినెట్ సెక్రటేరియట్ సెక్రటరీ కోఆర్డినేషన్ మరియు రాష్ట్రానికి నోడలు అధికారిగా ఉన్న వందన గుర్నాని పవన్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సులభతర వాణిజ్యం మరియు కంప్లైయన్స్ రిడక్షన్ అంశాలకు సంబంధించిన అంశాలను వివరిస్తూ కేబినెట్ కార్యదర్శి నేతృత్వంలో 18మంది కేంద్ర ప్రభుత్వ కార్యదర్శులతో ప్రత్యేక టాస్క్‌ఫోర్సు కమిటీ జాతీయస్థాయిలో పనిచేస్తుందని తెలిపారు. అలాగే రాష్ట్రాల్లో చీఫ్ సెక్రటరీ నేతృత్వంలో ఉన్నతస్థాయి కమిటీ పనిచేస్తుందని అన్నారు. ఏపిలో సుమారు 23రంగాల్లో మొదటి దశలో పలు కీలక అంశాల్లో ఇప్పటికే చేపట్టిన సంస్కరణలు తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై వివరించారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ కార్యదర్శి డాక్టర్ ఎన్.యవరాజ్ మాట్లాడుతూ వికసిత్ ఏపి 2047లోభాగంగా ఏడాదికి 15శాతం వృద్ధి రేటుసాధన లక్ష్యంగాప్రభుత్వం తగిన ప్రణాళికలు సిద్ధం చేసి అమలుచేస్తుందని తెలిపారు. 5ఏళ్ళలో 20లక్షల ఉద్యోగావకాశాలు కల్పించాలనే లక్ష్యంతో పెద్దఎత్తున కృషి చేస్తున్నట్లు చెప్పారు. మున్సిపల్ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్‌కుమార్ మాట్లాడుతూ పలు సంస్కరణలు తీసుకురావడంలో ఏపి దేశంలో ముందంజలో ఉందని పేర్కొన్నారు. రాష్ట్రంలో 123 పట్టణ స్థానిక సంస్థలుండగా వాటి పరిధిలో 21 అర్బన్ డెవలప్‌మెంట్ ఆథార్టీల ద్వారా భవన నిర్మాణ అనుమతులను జారీ చేయడం జరుగుతోందని అన్నారు. కార్మికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణీ ప్రసాద్ మాట్లాడుతూ వివిధ లైసెన్సులు ట్రేడ్ లైసెన్సులను ఆన్‌లైన్ విధానంలోనే జారీ చేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు ఆర్పి సిసోడియా, ఎంటి కృష్ణబాబు, జి.సాయిప్రసాద్, ముఖ్యకార్యదర్శులు కుమార్ విశ్వజిత్, కాంతిలాల్ దండే, కార్యదర్శులు ప్రతిబా దేవి, చీఫ్ కమిషనర్ స్టేట్ టాక్సెస్ బాబు.ఏ, సౌరవ్ గౌర్, ఎండి ఎపిఐఐసి అభిషిక్త్ కిషోర్, కేంద్ర కెబినెట్ సెక్రటేరియట్ డైరెక్టర్ శ్వాతి మహంతి, డిపిఐఐటి డిప్యూటీ సెక్రటరీ యశస్వీ ముడ్ తదితర అధికారులు

# తిరుమల సమాచారం

## మలయప్పగా మూడోరోజు తెప్పపై అభయం

**తిరుమల,మార్చి 11ప్రభాత వార్తప్రతినిధి:** ఫాల్గుణ మాసం పౌర్ణమికి ముగిసేలా జరిగే సాల కట్ల తెప్పోత్సవాలు మంగళవారం మూడోరోజు మలయప్పస్వామి శ్రీదేవిభూదేవిసమేతుడై తెప్పపై విహరించాడు. ఆలయం నుండి ఊరేగింపుగా పుష్కరిణి వద్దకు చేరుకున్న ఉత్సవ మూర్తులను ఇక్కడ మంగళ వాయిద్యాల నడుమ తెప్పపై కొలువుదీర్చారు. పెద్దజీయంగారు, చిన్నజీయంగారు, టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, విజిలెన్స్ వింగ్ విఎస్ఒ ఎన్టీవిరామ్‌కుమార్, ఇఇలు సుబ్రమణ్యం, సుధాకర్, డిఇ చంద్రశేఖర్, ఆలయ ఏవిఎస్ఒ రాజశేఖర్ కర్పూర హారతులిచ్చి తెప్పను కదిలించారు. పుష్కరిణిలో నిరీక్షిస్తున్న భక్తులు, టిటిడి ఉద్యోగులు, గృహస్థభక్తులు గోవిందనామస్మరణలు చేయగా దేవదేవుడు అధిరోహించిన తెప్ప పుష్కరిణిలో పవిత్రమైన తీర్థంలో కదిలింది. అన్నమయ్య ప్రాజెక్టు కళాకారులు సంకీర్తనలు ఆలపించగా భక్తులు స్వరం కలిపారు.



## కొండంతా కూల్.. కూల్ ఆలయం ముందు తెల్లని పెయింట్

**తిరుమల,మార్చి 11ప్రభాత వార్తప్రతినిధి:** మార్చి మొదటి వారంలోనే సూర్యుని ప్రతాపం తీవ్రంగా ఉండటం, మండే ఎండలకు తిరుమలకొండపై భక్తులు పాదరక్షలు లేకుండా నడవలేకపోతున్నారు. ఆలయం పరిసరాల్లో, మాఢవీధుల్లో భక్తులకు చల్లదనాన్నిచ్చేలా కూల్ పెయింట్ వేస్తున్నారు. చలువపందిళ్ళు ఏర్పాటు చేశారు. రానున్న మూడునెలలు వేసవితీవ్రవను దృష్టిలో ఉంచుకుని తిరుమలకు వచ్చే భక్తుల రద్దీకూడా ఎక్కువగానే ఉంటుంది. భక్తులకు ఎండనుండి ఉపశమనం కలిగించేలా కూల్‌పెయింట్ వేస్తున్నారు. పాదరక్షలు లేకున్నా చల్లదనం ఉంటుంది.



## విదేశీ కానుకలను నొక్కేసిన టిటిడి ఉద్యోగి

### - చెన్నై ఆలయంలో పరకామణి ఉద్యోగి కృష్ణకుమార్ సస్పెన్షన్

**తిరుమల,మార్చి 11ప్రభాతవార్తప్రతినిధి:** భక్తితో, నిజాయితీగా సేవచేయాల్సిన ఓ ఉద్యోగి తనచేతావాటం చూపించి భక్తులు స్వామివారికి కానుకలుగా సమర్పించిన విదేశీకరెన్సీని నేక్కొశాడు. ఇలా సుమారు 8లక్షలు రూపాయలు విలువైన విదేశీ కరెన్సీని పరకామణి నుండి చోరీచేయడంతో గుర్తించిన టిటిడి విజిలెన్స్ వింగ్ అధికారులు అతనిపై నివేదిక సమర్పించారు. మంగళవారం అతనిని ఉద్యోగం నుండి సస్పెన్షన్ చేస్తూ టిటిడి ఇఒ శ్యామలరావు ఆదేశాలిచ్చారు. టిటిడి చెన్నైలోని శ్రీవారి ఆలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా కృష్ణకుమార్ పనిచేస్తున్నాడు. అక్కడ స్వామివారికి భక్తులు సమర్పించిన విదేశీ కరెన్సీని చోరీ చేశాడు. పరకామణిలో వచ్చిన కరెన్సీని ఆయన నొక్కేయడంతో సమాచారం అందిన టిటిడి ఉన్నతాధికారులు విచారణ చేశారు. విచారణలో సీనియట్ అసిస్టెంట్ కృష్ణకుమార్ అవకతవలకు అవినీతికి పాల్పడటంతో అతనిని సస్పెన్షన్ చేశారు. ఇప్పటికే తిరుమల పరకామణిలోనూ ఓ ఉద్యోగి ఇలాగే చేతివాటం చూపించి దేవుని సొమ్మును స్వాహాచేసిన మోసగాడు ఉన్నాడు. స్వామివారి సేవలో ఉంటూ దేవునికే గండికొట్టిన ఉద్యోగులను శాశ్వతంగా తొలగించాలని భక్తులు ఆగ్రహం చెందుతున్నారు.

## 14న మొగలిచెర్ల దత్తమందిరంలో రుద్రహోమం

**తిరుపతి,మార్చి 11ప్రభాతవార్తప్రతినిధి:** ఫాల్గుణమాసం పౌర్ణమి సందర్భంగా ఈనెల 14వతేదీ శుక్రవారం నెల్లూరు జిల్లా లింగసముద్రంమండలం మొగలిచెర్లగ్రామంలో దత్తాత్రేయ స్వామి మందిరంలో రుద్రహోమం నిర్వహిస్తున్నారు.
పౌర్ణమి సందర్భంగా లోకక్షేమం కాంక్షిస్తూ మందిరంలో ఈ హోమం నిర్వహించడం జరుగుతుందని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పవని నాగేంద్రప్రసాద్ తెలిపారు. అలయప్రాంగణంలో జరిగే ఈ హోమంలో పాల్గొనదలచిన భక్తులు ప్రత్యక్షంగాగానీ, పరోక్షంగాగానీ 9908 973699, 9182882632, 630 2616897 నంబర్లకు సంప్రదించాలని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కోరారు.

## నకిలీ మెయిల్‌తో భక్తులకు బురిడీ

### - దర్శనాల మోసగాడు అరెస్టు

**తిరుమల,మార్చి 11ప్రభాత వార్తప్రతినిధి:** టిటిడి అధికారుల మెయిల్ ఐడిలతో నకిలీవి సృష్టించి భక్తులను మోసగిస్తున్న దర్శనాల మోసగాడిని తిరుమల 2టౌన్ పోలీసులు అరెస్టుచేశారు. అతని వద్ద నుండి సెల్‌ఫోన్, 5బ్యాంకు అకౌంట్‌లను సీజ్ చేశారు. తిరుమల 2టౌన్ సిఐ రాముడు తెలిపిన వివరాలు.... సత్యసాయిజిల్లా కొత్తచెరువు పట్టణానికి చెందిన బోయ పవన్‌కల్యాణ్‌అనే పవన్(24) తనకున్న తెలివితో సులభంగా డబ్బుసంపాదించాలని పథకం పన్నాడు. ఇందుకు సులభంగా టిటిడి అధికారుల పేరుతో ఉన్న మెయిల్ ఐడిలకు ఇంచుమించు కొంత తేడాతో మెయిల్ ఐడిలను సృష్టించాడు. ఆ మెయిల్ ఐడిలకు టిటిడి మెయిల్ ఐడిలను అనుసంధానం చేశాడు. ఇలా ఎవరైనా దర్శనాల కోసం టిటిడి మెయిల్ పంపితే పవన్ మెయిల్‌కు కూడా సమాచారం అందుతుంది. దాన్ని గమనించి తిరుమల జెఇఒ కార్యాలయం నుండి మాట్లాడుతున్నామని, మీకు దర్శనాల కావాలని అప్లయి చేశారని నమ్మిస్తాడు. ఇందుకు కొంత డబ్బు పంపాలని కోరితే నమ్మిన భక్తులు నగదు



లావాదేవీలు జరిపారు. ఇలా 90వేల వరకు నగదును తీసుకున్నాడు.
భక్తుల నుండి అందిన సమాచారంతో టిటిడి విజిలెన్స్ వింగ్ విఎస్ఒ ఎన్టీవిరామ్‌కుమార్ తమ సిబ్బందితో నకిలీ మెయిల్ ఐడిలను క్రియేట్ చేసి భక్తులను మోసంచేసిన పవన్‌ను అదుపులోకి తీసుకున్నారు. తదుపరి 2టౌన్ పోలీసులకు అప్పగించారు.
సిఐ రాముడు అతనిని విచారణ చేసి నేరం చేసినట్లు తేల్చారు. దీంతో భక్తులు ఎవరూ కూడా టిటిడి అధికారిక వెబ్‌సైట్లు, టోల్‌ఫ్రీనంబర్ 18004254141కు సమాచారం అందించాలని, వాటితోనే దర్శనాలు బుక్‌చేసుకోవాలని కోరారు. అరెస్టుచేసిన పవన్‌ను రిమాండ్‌కు తరలించారు.

# తిరుపతిలో పోలీసుకమిషనరేట్‌కు అడుగులుపడేనా?

## ప్రతిపాదనలు ఆచరణలోకి ఎన్నడో..

**తిరుపతి,మార్చి 11ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచ పుణ్యక్షేత్రంగా, యాత్రాస్థలంగా విరాజిల్లుతున్న తిరుపతి నగరం ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని ,కలియుగప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ భద్రత ఇటు లక్షమంది ప్రజల రక్షణకు తిరుపతిని పోలీసుకమిషనరేట్ చేయాలనే ప్రతిపాదనలు ఆచరణకు నోచుకోవడం లేదు. పైగా ఈ ఏడాది రాష్ట్రప్రభుత్వం బడ్జెట్‌లోనూ దీనికి సంబంధించి నిధులు కేటాయింపు విషయంకూడా ప్రస్తావన లేదు. తిరుపతి, తిరుమలకు ప్రతిరోజూ ప్రముఖుల సందర్శనతో బాటు ఆరులక్షలకుపైగా చేరిన తిరుపతి నగరజనాభాతో యాత్రికుల రక్షణ దిశగా పోలీసుశాఖ నూతన మార్పులు తీసుకోవాల్సి ఉంది. పుష్కరకాలం క్రిందట చిత్తూరుజిల్లా పోలీసువిభాగాన్ని వేరుచేసి తిరుపతి అర్బన్ పోలీసుజిల్లాగా ఏర్పాటుచేశారు. ఐపిఎస్ అధికారి ఎస్పిగా ఒకరు, ఆయనకు చేదోడువాదోడుగా ముగ్గురు అదనపు ఎస్పీల క్రింద తిరుపతి, తిరుమలతోబాటు శ్రీకాళహస్తి, రేణిగుంట, చంద్రగిరి ప్రాంతాలను అర్బన్ పోలీసు జిల్లాక్రిందకు తీసుకువచ్చారు. మొత్తం ఎనిమిది సబ్‌డివిజన్లతో తిరుపతి తూర్పు, తిరుపతి పడమర, తిరుపతి నేరవిభాగం, ట్రాఫిక్, దిశ, రేణిగుంట, శ్రీకాళహస్తి, తిరుమలతో బాటు 20వరకు సర్కిళ్ళతో ప్రతి పోలీసుస్టేషన్‌కు ముగ్గురు, నలుగురు ఎస్‌ఐలతో 2,500మంది వరకు పోలీసు సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ప్రత్యేకంగా తిరుమలను ఒక అదనపు ఎస్పీ క్రిందకుతీసుకువచ్చి పాలన సాగిస్తున్నారు. చిత్తూరు పోలీసుజిల్లాకు సంబంధించి ఐపిఎస్ అధికారి ఎస్పీతోబాటు ఇద్దరు అదనపు ఎస్పీలు, ఐదుమంది డిఎస్పీలు చిత్తూరు. చిత్తూరు ట్రాఫిక్, పలమనేరు, పుత్తూరు, మదనపల్లి సబ్‌డివిజన్‌లు 25వరకు సర్కిళ్ళు, 70మంది వరకు ఎస్‌ఐలు, 3వేలమంది వరకు పోలీసు సిబ్బంది ప్రత్యేకంగా శాంతి భద్రతల పరిరక్షణతోబాటు నేరాల నియంత్రణ, ప్రముఖుల భద్రత ,పుణ్యక్షేత్రాల రక్షణకు నిరంతరం విధులు నిర్వహిస్తున్నారు. ఆ రెండు పోలీసు జిల్లాలు ప్రస్తుతం అనంతపురం రేంజి క్రింద పాలనసాగిస్తున్నాయి. డిఐజి స్థాయి అధికారి పోలీసువిభాగాన్ని పర్యవేక్షిస్తుంటారు. తిరుపతిలో పోలీసు కమిషనరేట్ ఏర్పాటు ప్రతిపాదనలు కూడా ప్రభుత్వానికి చేరాయి. 2009-10లో తిరుపతి అర్బన్ పోలీసు జిల్లాగా రూపాంతరం చెందింది. తిరుపతి పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నీయోజకవర్గాలను కలుపుకుని చిత్తూరుజిల్లాలో కార్వేటినగరం వరకు పోలీసుకమిషనరేట్ పరిధిలోకి తీసుకువచ్చే అవకాశం ఉంది.

**-పెరగనున్న సర్కిళ్ళు, మారనున్న కేడర్‌లు:** తిరుపతి కమిషనరేట్ అయితే ఐజి హోదా ఐపిఎస్ అధికారిని కమిషనర్‌గా నియమించి పోలీసుశాఖ పాలన సాగించే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో తిరుపతి కమిషనరేట్ దిశగా జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు కూడా చర్చ చేయాలనేది అభిప్రాయం వ్యక్తమవుతోంది. కమిషనరేట్ పరిధిగా విస్తరిస్తే తిరుపతి నగరంలోని శాంతిభద్రతలు, నేరవిభాగం, ట్రాఫిక్ విభాగాలకు ఒక్కో ఐపిఎస్ స్థాయి అధికారి ఎస్‌పిగా నియమితులవుతారు. నగరంలోకూడా ప్రజలకు సేవలందించే దిశగా ఉన్న పోలీసుస్టేషన్ల పరిధిని కుదించి మరిన్ని పోలీసుస్టేషన్లు ఏర్పాటుకు అవకాశం వుంది. ఇక చిత్తూరుపోలీసుజిల్లాకు చెందిన పాకాల సర్కిల్, పూతలపట్టుసర్కిల్ కార్యాలయాలు కమిషనరేట్ పరిధికి చేరే అవకాశం ఉంది.

# తిరుపతిలో ఓ హోటల్ గదిలో ఊడిన సీలింగ్.. తప్పిన ప్రమాదం



**తిరుపతి,మార్చి 11ప్రభాతవార్తప్రతినిధి:** యాత్రా స్థలం తిరుపతిలో యాత్రికుల వసతిఅవసరాల కోసం నడుస్తున్న స్టార్‌హోటళ్ళలో రైల్వే ఓవర్‌బ్రిడ్జిన మీపంలోని ఓ స్టార్ హోటల్ గది సీలింగ్ విరిగిపడింది. ఉన్నఫళంగా మంగళవారం ఉదయం 6గంటల సమయంలో ఈ సంఘటన జరిగింది. ఆ హటల్‌లోని మూడవ అంతస్థులోని 314గదిలో ఓ న్యాయమూర్తి కుటుంబం బసచేసింది. గదిలోని యాత్రికులు ఉదయం సిద్దమై హోటల్‌లోని రెస్టారెంట్‌కు వెళ్ళేందుకు ఉండగా ఒక్కసారిగా ఆ గదిలోని సీలింగ్ ఊడిపడింది. పెద్ద శబ్ధం రావడంతో గదిలో ఉన్న యాత్రికులు భయంతో పరుగులు తీశారు. హోటల్ సెక్యూరిటీ సిబ్బంది ,అగ్నిమాపక శాఖ సిబ్బంది, తిరుపతి పోలీసులు హోటల్‌కు చేరుకున్నారు. హోటల్‌లోని అన్ని గదుల్లో ఉన్న యాత్రికులను సురక్షితంగా బయటకు పంపారు. కాగా హోటల్ గది సీలింగ్ పడిపోవడానికి కారణాలను ఆరా తీస్తున్నారు. భద్రత కారణాలతో తాత్కాలికంగా ఆ హోటల్‌ను మూసివేయించారు. తిరుపతి పోలీసులు హోటల్ వద్ద భద్రత ఉంచారు. కాగా న్యాయమూర్తి కుటుంబం ఆ గదిలో బసచేయడంతోనే జరిగిన సంఘటనపై హోటల్ యాజమాన్యం కూడా నోరుమెదపలేదు.

# ముఖ్యమంత్రిని కలిసిన నంద్యాల ప్రజాప్రతినిధులు



**విజయవాడ,మార్చి11,ప్రభాతవార్తప్రతినిధి:** నంద్యాల జిల్లాలో వరి, జొన్న పంటలకు మద్దతు ధర కల్పించాలని కోరుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును మంత్రులు ఎన్ ఎండీ ఫరూఖ్, బీసీ జనార్థన్ రెడ్డికలిసారు. నంద్యాల జిల్లాలో ప్రస్తుతం క్వింటా జొన్నలు ధర రూ. 2400 వరి మద్దతు ధరను రూ. 3400 కు పెంచి రైతులను ఆదుకోవాలని కోరిన ప్రజాప్రతినిధులు నంద్యాల జిల్లాలో ప్రస్తుతం క్వింటా వరి ధర రూ. 1800 మద్దతు ధరను రూ. 1800 కు పెంచి రైతులను ఆదుకోవాలని ప్రజాప్రతినిధులు కోరారు. తప్పకుండా నంద్యాల జిల్లా రైతులను ఆదుకుంటామని సీఎం చంద్రబాబు తెలిపారు. అంతకు ముందు వీరంతా వ్యవసాయశాఖా మంత్రి అచ్చెన్ననాయుడిని కలిసారు.



మంగళవారం తిరుపతిలో అధికార లాంఛనాలతో గరిమెళ్ల అంత్యక్రియల దృశ్యం

# ప్రభుత్వ లాంఛనాలతో గరిమెళ్ల అంత్యక్రియలు

## - వేలాది అభిమానుల అశ్రుతర్పణం

**తిరుమల,మార్చి 11ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఆస్థానవిద్వాంసుడు, ప్రముఖ సంగీత విద్వాంసుడు గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్(76) అంత్యక్రియలు ప్రభుత్వ లాంఛనాలతో మంగళవారం ఉదయం తిరుపతిలో నిర్వహించారు. గరిమెళ్ళ 9వతేదీ ఆదివారం సాయంత్రం తిరుపతి భవానీనగర్‌లోని ఆయన స్వగృహంలో గుండెపోటుతో తుదిశ్వాస విడిచిన విషయం తెలిసిందే. ఆద్యాత్మికభావంతో 1978నుండి 2006వరకు టిటిడిలో తనదైన శైలిలో ఆస్థాన విద్వాంసుడుగా అలరారారు. ఆయన ఇద్దరు కుమారులు అమెరికా నుండి మంగళవారం ఉదయం తిరుపతికి చేరుకుని అంత్యక్రియలు పూర్తిచేశారు. తిరుపతిలోని హరిశ్చంద్ర శ్మశానవాటికలో ఆయనకు అంతిమసంస్కారాలు జరిపించారు. సంప్రదాయ సంగీత ప్రపంచానికి గరిమెళ్ళ సుపరిచితులే.

వెయ్యికిపైగా అన్నమాచార్య సంకీర్తనలకు స్వరకల్పనచేసిన ఘనత గరిమెళ్ల సొంతం చేసుకున్నాడు. వినరోభాగ్యము విష్ణు కథ...జగడపు చనువుల జాజర...పిడికెట తలంబ్రాల పెండ్లి కూతురు వంటి సుప్రసిద్ధి కీర్తనలకు ఆయన స్వరాలు సమకూర్చాడు.

# అర్హులైన వైద్యులు ప్రొఫెసర్లుగా చేరేలా చర్యలు తీసుకోవాలి

## వైద్య, ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్

**అమరావతి, మార్చి11.ప్రభాతవార్తప్రతినిధి:** ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 33 శాతం ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ, తాజా ప్రమోషన్ల ప్రక్రియలో అర్హులైన అభ్యర్థుల్లో 32 శాతం మంది ప్రొఫెసర్లుగా పదోన్నతులు పొందడానికి నిరాకరించారు. ఈ వ్యవహారాన్ని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సీరియస్‌గా తీసుకున్నారు. అర్హులైన వైద్యులు ప్రొఫెసర్లుగా బాధ్యతల్ని చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 12 క్లినికల్, నాన్ క్లినికల్ విభాగాల్లో వివిధ ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఖాళీలను గుర్తించి ప్రొఫెసర్లుగా పదోన్నతి కల్పించేందుకు అర్హులైన 28 మంది అసోసియేట్ ప్రొఫెసర్లను కౌన్సెలింగ్ కు పిలిచారు. పదోన్నతికి సంబంధించి అభ్యర్థులు కౌన్సెలింగ్ లో సంసిద్ధతను వ్యక్తం చేయాల్సి ఉండగా, అర్హులైన 28 మందిలో 19 మంది మాత్రమే ప్రమోషన్ పొందేందుకు అంగీకరించారు. మిగతా 9 మంది తమకు కేటాయించిన కాలేజీలు నచ్చకపోవడంతో ప్రమోషన్ తీసుకునేందుకు వారు నిరాకరించారు. అంటే అర్హులైన అభ్యర్థుల్లో 32 శాతం మంది ప్రొఫెసర్లుగా పదోన్నతిని తిరస్కరించారు. మిగిలిన 9 మందికి కూడా ఖాళీల ఆధారంగా పదోన్నతి కల్పించినప్పటికీ వారు ప్రొఫెసర్లుగా చేరలేదు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో (జీఎంసీ) 841 ప్రొఫెసర్ పోస్టులుండగా, 33 శాతం పోస్టులు ఖాళీగా ఉండడంపై వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆందోళన వ్యక్తం చేశారు. అర్హులైన అసోసియేట్ ప్రొఫెసర్లు పదోన్నతులు స్వీకరించేలా చర్యలు తీసుకోవాలని వైద్య, రోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిని మంత్రి ఆదేశించారు. తాజాగా ప్రొఫెసర్లుగా పదోన్నతి పొందిన వారిలో జనరల్ సర్జరీ, సైకియాట్రీ విభాగంలో నలుగురు చొప్పున, జనరల్ మెడిసిన్, పీడియాట్రిక్స్, అనస్థీషియాలో ముగ్గురు చొప్పున ఉన్నారు. ఆర్థోపెడిక్స్, పల్మనరీ మెడిసిన్, రేడియాలజీ, కమ్యూనిటీ మెడిసిన్లో ఇద్దరు చొప్పున, ఈఎన్టీ, అనాటమీ, ఫార్మకాలజీలో ఒక్కొక్కరు చొప్పున పదోన్నతులు పొందారు. మూడేళ్ల బోధనానుభవం, ప్రసిద్ధ జర్నల్స్ లో 2 ప్రచురణలున్న అసోసియేట్ ప్రొఫెసర్లు.

# ఎమ్మెల్యేలకు క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు



క్రీడాపోటీలకు సిద్ధం చేసిన బహుమతులను పరిశీలిస్తున్న స్పీకరు అయ్యన్నపాత్రుడు

**విజయవాడ,మార్చి11,ప్రభాతవార్తప్రతినిధి:** ఎమ్మెల్యేలకు క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలకు సర్వం సిద్ధమయింది. ఈ పోటీలకు బహుమతులు , క్రీడా సామాగ్రిని సిద్ధం చేసారు. వీటిని తన ఛాంబర్‌లో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పరిశీలించారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా శాసనసభ్యులకు మార్చి 18, 19, 20 తేదీల్లో మూడు రోజుల పాటు క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ ఏర్పాట్లపై క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ అనూరాధ, మంత్రులు, ఎమ్మెల్యేలతో గౌరవ స్పీకర్ అయ్యన్న పాత్రుడు గారు అసెంబ్లీలో సమావేశం నిర్వహించారు. 18వ తేదీ మంగళవారం మధ్యాహ్నం మూడు గంటలకు ఇందిరా గాంధీ మునిసిపల్ స్టేడియంలో ఈ కార్యక్రమం అట్టహాసంగా ప్రారంభం కానుంది. విజేతలకు ప్రైజులు, మెమెంటోలు అందజేయడం, క్రీడల్లో పాల్గొనే వారికి గాను ప్రత్యేక డ్రెస్సు శాప్ చైర్మన్ రవి నాయుడుకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమాలు రాజకీయ నాయకులకు రిలీఫ్ కలిగించేలా నిర్వహించాలని, ఇంకా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలపై సమావేశంలో చర్చించారు. శాసనసభ్యులు, మండలి సభ్యులు అందరూ ఉత్సాహంగా పాల్గొనాలని కోరారు.



# అట్టహాసంగా ప్రారంభమైన యుజిసి సెమినార్

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,మార్చి 11,ప్రభాతవార్త : వర్సిటీలోని ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో "రీసెంట్ అడ్వాన్స్‌మెంట్ ఇన్ సాఫ్ట్‌వేర్ బేస్డ్ అప్రోచెస్ ఇన్ ఫార్మాస్యూటికల్ రీసెర్చ్"అనే అంశంపై జరుగుతున్న సదస్సు మంగళవారం అట్టహాసంగా ప్రారంభమైంది. సదస్సుకు ముఖ్యఅతిధిగా వర్సిటీ ఇన్‌చార్జీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ కె.గంగాధరరావు మాట్లాడుతూ ఫార్మసీ రంగంలో ఆర్టిఫికేట్ ఇంటెలిజన్స్ యొక్క ప్రాముఖ్యతను మరియు ఆవశ్యకతను వివరించారు. విశిష్ట అతిధి డాక్టర్ సుశీల్ శర్మ (డీన్ ఫర్ ఎగ్జామినేషన్ ఆలిండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ మంగళగిరి) మాట్లాడుతూ ఫార్మసీ, వైద్యరంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. సదస్సు సమన్వయకర్త డాక్టర్ కె.విజయ్‌కిషోర్ మాట్లాడుతూ ఈ సదస్సుకు సుమారు 500కు పైగా రిజిస్ట్రేషన్లు వివిధ యూనివర్సిటీలు, కళాశాలల నుండి వచ్చాయన్నారు. సదస్సుకు
గౌరవాతిధులుగా విశ్వవిద్యాలయ రెక్టార్ ప్రొఫెసర్ కె.రత్నషీలామణి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏ.ప్రమీలరాణి, రిసోర్స్ పర్సన్స్ ప్రొఫెసర్ షేక్ అబ్దుల్ రెహమాన్, ప్రొఫెసర్ గణనాధం, ప్రొఫెసర్ కటకం ప్రకాష్ లు పాల్గొన్నారు. ముఖ్యఅతిధి ప్రొఫెసర్ గంగాధరరావు సదస్సు సావనీర్‌ను విడుదల చేసి ఆవిష్కరించారు.

వార్త

అత్యధిక శాతం జనాభా నిరుపేదలు, దౌర్భాగ్యులుగా ఉన్న సమాజం వర్ధిల్లదు. అటువంటి సమాజంలో సుఖశాంతులు పరిఢవిల్లవు.

-ఆడమ్ స్మిత్

# ప్రకృతితో పరాచకాలొద్దు!

మానవ తప్పిదాల వల్ల విపత్తులు ఒకదానివెంట ఒకటి తోసుకువస్తున్నాయి. అపార ప్రాణ, ఆస్తి నష్టాలకు కారణమవుతున్నాయి. వాతావరణంలో తలెత్తుతున్న అనేక మార్పులు ప్రకృతి వైపరీత్యాలకు దారితీస్తున్నాయి. ఒక్క భారత దేశంలోనే కాదు ప్రపంచవ్యాప్తంగా కూడా ఈప్రకృతి వైపరీత్యాలు అంతకంతకు పెరుగుతున్నాయి. ఆధునిక విజ్ఞానం ఎంతో ఆర్జించామని విర్రవీగే అమెరికా లాంటి దేశాలు కూడా ఈ వైపరీత్యాల నుంచి బయటపడలేకపోతున్నాయి. ముఖ్యంగా కారుచిచ్చులు ఆ దేశాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. నగరాలకు నాగరాలకే చిచ్చుపెడుతున్నాయి. ఇందుకు ముందుగా నిందించాల్సింది, తప్పుపట్టాల్సింది మానవుడినే. మానవుడి పర్యావరణ విధ్వంస చర్యలే ఈ బీభత్సానికి, విపత్తులకు కారణమవుతున్నాయని ఎన్నో అధ్యయనాలే స్పష్టం చేస్తున్నాయి. పర్యావరణాన్ని కాపాడడం అటుంచి తూట్లుపొడవడం అత్యంత దురదృష్టకరం. చివరకు అభివృద్ధిపేరుతో ప్రభుత్వాలు చేపడుతున్న కొన్ని కార్యక్రమాలు పర్యావరణానికి చేటు తెస్తున్నాయి. ఇష్టానుసారంగా ఇసుక తవ్వకాల నుంచి మొదలు పెడితే కొండలనుతొలచి ప్రాజెక్టులు, రహదారుల నిర్మాణం, నగరీకరణ పేరుతో ప్రపంచవ్యాప్తంగా కోట్లాది ఎకరాల పంట పొలాలను జనావాసాలుగా మార్చడం ఒకటేమిటి ఎన్ని విధాలుగా పర్యావరణానికి నష్టం చేయగలుగుతారో అన్ని మార్గాల్లో నిత్యం అన్వేషణ, విధ్వంసం కొనసాగుతూనే ఉన్నాయి. ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం మరో యేడెనిమిదేళ్లలో భారత్ జనాభా నూటనలభైఐదు కోట్లకు చేరుకుంటుందని అందుకు తగినట్టుగా దేశంలోని సహజ వనరులపై ఒత్తిడి పెరుగుతుందని ముఖ్యంగా అటవీ సంపద హరించుకుపో తుందని స్పష్టంచేసింది. ఇప్పటికేభారత్‌లో దాదాపు ప్రతిరోజూ మూడువందల ముప్పైఎకరాలకుపైగా అటవీ భూమి అదృశ్యమైపోతుందని ఐక్యరాజ్యసమితి నివేదిక వెల్లడిస్తున్నది. బొగ్గగనులు, థర్మల్ విద్యుత్ కేంద్రాలు, పరిశ్రమలు, నదీలోయ ప్రాజెక్టులకోసం అడవులను నరికివేస్తున్నారు. ఇలాంటి కారణాలు ఎన్నో పర్యావరణానికి విఘాతం కలిగిస్తున్నాయి. మానవుడికే కాదు పశుపక్ష్యాదుల అన్నింటికి హానిచేసే ప్లాస్టిక్‌వాడకం అంతకంతకు పెరిగిపోతున్నది. కొన్ని ప్లాస్టిక్ వస్తువులు నిషేధించినా అవి కాగితాలకే పరిమితమవుతున్నాయి. యధేచ్ఛగా వాడుతున్నారు. ప్లాస్టిక్‌సంచి మట్టిలో కలిసి పోవడానికి కొన్ని వందల సంవత్సరాలు పడుతుంది. ప్లాస్టిక్ వినియోగం పర్యావరణానికి ఎంతటి నష్టం చేకూరుస్తుందో ప్రజల్లో అవగాహన కల్పించడంలో అధికారవర్గాలు విఫలమవుతున్నాయనే చెప్పొచ్చు. ఇక పెట్రో, డీజిల్ వంటి ఇంధనాల వాడకం గురించి చెప్పక్కర్లేదు. వాహన కాలుష్యం నియంత్రణ మాటలకే పరిమితమవుతుంది.

ఇక పరిశ్రమలు వదులుతున్న పొగ ధూళికణాలు తదితరవన్నీ కలిసి వాయుకాలుష్యాన్ని తారాస్థాయికి తీసుకుపోతున్నాయి. ముఖ్యంగా వాయుకాలుష్యంతో దేశంలో లక్షలాదిమంది ప్రాణాలు కోల్పోతున్నారు. దీనిని నియంత్రించేందుకు అటు కేంద్ర, ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలు సఫలీకృతం కావడంలేదు. ఇలాంటి రకరకాల కారణాలతో భూమి ఉష్ణోగ్రత పెరిగిపోక తప్పదు. ఈసారి వేసవిలో అత్యధికంగా ఉష్ణోగ్రత ఉంటుందని, నలభైయేడు డిగ్రీల వరకు వెళ్లినా ఆశ్చర్యంలేదని శాస్త్రవేత్తలే అంచనా వేస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే ఉష్ణోగ్రత పెరిగి ప్రపంచంలోని తీరప్రాంతాలు, దీవులతో సహా అనేక దేశాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని గతంలోనే పర్యావరణ శాస్త్రవేత్తలు హెచ్చరించారు. ఇక ఇలా ప్రకృతి మనిషితో ఆటలాడుకుంటుంటే అందుకు ప్రతికగా ప్రకృతి తీవ్రంగా స్పందిస్తున్నది. పర్యావరణ సమతుల్యం దెబ్బతిన్న కారణంగా సకాలంలో వర్షాలు కురవకపోవడం, కురిస్తే ఒకే ప్రాంతంలోకుంభవృష్టి కురవడం ఇటీవలకాలంలో పెరిగిపోతున్నది. వరదలు, తుఫాన్‌లు, భూకంపాలు లాంటి ఉపద్రవాలు చోటు చేసుకుంటున్నాయి. యేటా ప్రపంచవ్యాప్తంగా మూడువందల ఎనభైకిపైగా ఉపద్రవాలు సంభవిస్తున్నట్లు అధికార రికార్డులే వెల్లడిస్తున్నాయి. ఈ ఉపద్రవాల కారణంగా యేటా లక్షలాది మంది ప్రాణాలు పోగొట్టుకుంటుంటే కోట్ల సంఖ్యలో రోగపీడితులు అవుతున్నారు. పాకిస్థాన్, ఇరాన్, హైతి, న్యూజిలాండ్, నేపాల్ లాంటి ఎన్నోదేశాలలో గతయేడాది అంతకుముందు వచ్చిన భూకంపాలు ప్రళయమే సృష్టించాయని చెప్పొచ్చు. మొన్న ఆ మధ్య సిరియాలో వచ్చిన భూకంపం కారణంగా యాభైతొమ్మిదివేల మందిఅసువులు బాశారు. ఆ తర్వాత మొరోకాలో వచ్చిన ప్రకంపనాలతో దాదాపు నాలుగువేల మంది జీవితాలు సమాధి అయ్యాయి. ప్రపంచవ్యాప్తంగా ఈ భూ ప్రకంపనాలు సృష్టించిన విలయాల నుండి బాధితులు కోలుకోలేకపోతున్నారు. భారత్‌కు సంబంధించి కూడా అనేకప్రాంతాలో భూప్రకంపనాలు తరుచుగా వస్తూనేఉన్నాయి. చెన్నై, పూణె, ముంబాయి, కోల్‌కతా, ఢిల్లీ లాంటి దాదాపు డెబ్బైనగరాల్లో భూకంపాలు పొంచిఉన్నట్లు శాస్త్రజ్ఞులు హెచ్చరిస్తున్నారు. పాలకులు తీసుకుంటున్న ముందుజాగ్రత్తల వల్ల ఉపద్రవాలకు సంబంధించి ప్రాణ, ఆస్తుల నష్టం కొంతవరకు నియంత్రించగలుగుతున్నారు. కానీ పర్యావరణం సమతుల్యం దెబ్బతిన్నకారణంగా ఏర్పడుతున్న ప్రకృతి విజృంభణకు అడ్డుకట్టవేయలేకపోతున్నారు. ఏదిఏమైనా ఉపద్రవాల నియంత్రణకు పర్యావరణాన్నికాపాడేందుకు త్రికరణ శుద్ధిగా కృషిజరగాలి. ప్రజల్లో అవగాహన పెంచాలి. ఇందులో ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా మరెన్నో ప్రళయాలు తప్పవు. భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుంది.

జీవితానికి విశ్వాసం పునాదిలో ఉండాలి. విశ్వాసం లేకుండా ఏ పని చేసినా వ్యర్థమే.



షేక్స్పియర్

జ్ఞానం ఉపదేశాల వల్ల, ఉపన్యాసాలు వినటంవల్ల రాదు. అనుభవపూర్వకంగా మాత్రమే వస్తుంది.



స్వామి వివేకానంద

# వాస్తవానికి దూరంగా మద్దతు ధరలు!

'స్వతంత్ర ' పాలన ప్రారంభం నుండి నేటివరకు పాలక ప్రభుత్వాలన్నీ రైతాంగ వ్యతిరేక విధానాలనే అనుసరించాయి. రైతాంగ ప్రయోజనాలను హరించి, బడావ్యాపారుల ప్రయోజనాలకు అనుకూలంగా పంటల మద్దతు ప్రకటిస్తున్నాయి. గిట్టుబాటుగాని ధరల వల్ల అప్పుల ఊబిలో కూరుకుపోయారు. నాలుగు లక్షల మంది రైతులు అప్పులు తీర్చేమార్గం కనపడక బలవన్మరణాల పాలయ్యారు. రైతాంగం, రైతు, రైతు కూలీ సంఘాలు పంటలకు న్యాయబద్ధమైన మద్దతు ధరలు ప్రకటించి, వాటికి చట్టబద్ధత కల్పించి, ప్రభుత్వమే కొనుగోళ్లు చేయాలనే డిమాండ్ చేస్తున్నాయి. ఆ ఉద్యమాలను చేసి కేంద్రప్రభుత్వం దిగివచ్చేలా చేయాలి. అప్పుడే న్యాయమైన మద్దతు ధర లభిస్తుంది.

బొల్లిముంత సాంబశివరావు

దేశానికి రైతే వెన్నెముక అంటూనే, ఆ వెన్నెముకను విరిచే విధానాలను కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అనుసరిస్తున్నాయి. అధికార మార్పిడి జరిగిన నాటి నుండి నేటి వరకు రైతాంగ ప్రయోజనాలు కాపాడే వ్యవసాయ విధానాలను పాలక పార్టీలు, ప్రభుత్వాలు అమలు జరపకపోగా హరిస్తున్నాయి. పండించే పంటలకు న్యాయమైన ధర లభించకపోతే రైతుకు నష్టదాయకంగా మారి సేద్యమే సంక్షోభంలో పడుతుంది. నేడు భారత రైతాంగం ఈ సమస్యనే ఎదుర్కొంటున్నారు. నెహ్రూ పాలనలో వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేసే విధానాలు అమలు చేయని ఫలితంగా దేశంలో తీవ్ర ఆహార సంక్షోభం ఏర్పడింది. అవమానకరమైన పిఎల్480 ఒప్పందం ద్వారా అమెరికా నుండి పెద్దఎత్తున గోధుమలు దిగుమతి చేసుకున్నాం. ఆహారధాన్యాల ఉత్పత్తిని పెంచేవిధంగా రైతాంగానికి మేలురకమైన విత్తనాలు, పంటకు కావాల్సిన పెట్టుబడి, నాణ్యమైన ఎరువులు, మంచి ధర లభించే మార్కెట్ సౌకర్యం కల్పించి ఉంటే ఆహారసంక్షోభం వచ్చేదికాదు. భారత వ్యవసాయ రంగాన్ని తనకు అనుకూలంగా మార్చుకోవటానికి అనుగుణమైన విధానాలను అమెరికా అమలు జరిపింది. మొదట ముక్కిపోయిన గోధుమలను భారతదేశానికి ఎగుమతి చేసి సొమ్ము చేసుకుంది. తమ దేశ ఎరువుల రంగానికి భారత దేశాన్ని పెద్దమార్కెట్‌గా మార్చే వ్యూహాత్మక విధానాలకు సిద్ధమైంది. అందుకుఫోర్డు ఫౌండేషన్ను ఉపయోగించింది. 1959లో భారతదేశానికి వచ్చిన ఈ ఫౌండేషన్నాట్లు వేయటానికి ముందే పంటలకు కనీస మద్దతుధర ప్రకటించాలని భారత ప్రభుత్వానికి సూచించింది. దానికి అనుగుణంగానే వ్యవసాయ ధరల కమిషన్ ఏర్పాటుకోసం 1964లో ఎల్కే ఝా అధ్యక్షతన కమిషన్ ఏర్పాటు చేసింది. దాని సిఫార్సుల ఆధారంగా 1965లో వ్యవసాయ ధరల కమిషన్ (ఏపీసీ)ఏర్పడింది. ఇది ప్రతి సంవత్సరం మద్దతుధర సేకరణ గురించి ప్రకటిస్తుంది. ఏపీసీని 1985లో వ్యవసాయ వ్యయ, ధరల కమిషన్‌గా కేంద్రప్రభుత్వం మార్చింది. ముందుగానే మద్దతు ధర ప్రకటించమని ఫోర్డు ఫౌండేషన్ చెబితే, పంటల దిగుబడి పెంచటానికి సస్యవిప్లవం ప్రకటించమని ప్రపంచబ్యాంకు భారత ప్రభుత్వానికి చెప్పింది. సస్యవిప్లవం పేరుతోఅమెరికా కంపెనీల ఎరువుల, పురుగుమందుల వ్యాపారానికి భారతదేశాన్ని ముఖ్యకేంద్రంగా మార్చటమే ప్రపంచ బ్యాంకు ఎత్తుగడ. ప్రపంచబ్యాంకు సూచనలకు అనుగుణంగా 1966లో దేశంలో సస్యవిప్లవాన్ని ప్రభుత్వం ప్రకటించింది. అమెరికానుంచి హైబ్రీడ్ విత్తనాలు, రసాయన ఎరువులు, పురుగుమందులు దేశంలోకి దిగుమతి అయ్యాయి. సస్యవిప్లవ ఫలితంగా రైతాంగానికి పంట ఖర్చులు పెరిగాయి. అందుకు తగ్గ ఆదాయం మాత్రం రైతాంగానికి లభించలేదు. ఇలాంటి పరిస్థితుల్లో పంటలకు మద్దతు ధర అంశం ముందుకు వచ్చింది. ఈసందర్భంగా జరుగుతున్న చర్చలో విధాననిర్ణేతలు, పరిశోధకులు, ఆలోచనపరులు ప్రభుత్వపెట్టుబడులు లేదా ఇన్పుట్ సబ్సిడీల ద్వారా ఉత్పత్తి వ్యయానికి మద్దతు మార్గాలను సూచించారు. 1964లో ఎల్కే ఝా కమిషన్ సిఫార్సుల మేరకు రైతాంగానికి మద్దతు ఇచ్చే విధానాన్ని ప్రభుత్వం స్వీకరించింది. ఒకనిర్దిష్ట పంట ఉత్పత్తి వ్యయాన్ని అంచనా వేయటానికి అనుసరించే విధానాలను వ్యవసాయ ఖర్చుల ధరల కమిషన్( సీఏసీపీ) ప్రచురించిన వార్షిక ధరల విధాన నివేదికలో పేర్కొన్నారు. ఈనివేదిక ప్రకారం సీఏసీపీ భారత దేశంలో ప్రధాన పంటలసాగు ఖర్చును అధ్యయనం చేయటానికి 'సమగ్రపథకాన్ని' 1971 నుండి అమలు చేసింది. ఈ పథకం ద్వారా మూడు సంవత్సరాల ఖర్చులను కలిపి పంటల ఉత్పత్తి ఖర్చును వ్యవసాయ ధరల కమిషన్ నిర్ణయిస్తుంది. ఈవిధానం రైతాంగ ప్రయోజనాలను దెబ్బతీస్తుంది. రెండు సంవత్సరాల పంట ఖర్చులు తక్కువ ఉంటే, ఆ ఖర్చును మూడవ సంవత్సరం పంట ఖర్చులతో కలిపి నిర్ణయించటం వలన పంట ఖర్చు తక్కువగా నమోదు అవుతుంది. దాన్ని ఆధారం చేసుకుని



కేంద్రప్రభుత్వం ప్రకటించే మద్దతు ధర తక్కువ ప్రకటిస్తుంది. అంతేకాకుండా పంటల ఉత్పత్తి ఖర్చును రాష్ట్రాల వారీగా సేకరించి దానిని దేశసగటుగా నిర్ణయించటం జరుగుతున్నది. ఒక పంటకు సాగు ఖర్చులో రాష్ట్రాల మధ్య వ్యత్యాసం ఉంది. దీనివల్ల ఎక్కువ ఖర్చు ఉన్న రాష్ట్రాలకు నష్టం జరుగుతున్నది. ప్రతి సంవత్సరం రాష్ట్రాలవారీగా పంటఖర్చును లెక్కించి ఆయారాష్ట్రాలకు విడిగా మద్దతు ధరను ప్రకటిస్తే రైతాంగానికి ప్రయోజనంగా ఉంటుంది. కేంద్రప్రభుత్వం అలా చేయకపోవటం రైతాంగ వ్యతిరేక విధానాలకు నిదర్శనం. ఒకపంటకు ఉత్పత్తి వ్యయం అనేది పంటకోసం పెట్టినఖర్చు. భూమి అద్దె, కుటుంబ శ్రమ, అప్పులకు వడ్డీ, మూలధనంపై వడ్డీ తదితరాలు లెక్కించి నిర్ణయించాలి. అది సమగ్ర ఖర్చుగా ఉంటుంది. కేంద్రప్రభుత్వాలు, వ్యవసాయ వ్యయ ధరల కమీషన్ ఆవిధంగా పంట వ్యయాన్ని లెక్కించటం లేదు. బ్యాంకులు ఇచ్చే పంటరుణం ప్రామాణికంగా తీసుకుని పంటకు మద్దతు ధరను ప్రకటిస్తున్నాయి. ఫలితంగా రైతాంగానికి సేద్యం గిట్టుబాటుకాక అప్పుల్లో కూరుకుపోతున్నారు. ఎంఎస్ స్వామినాథన్ నేతృత్వంలోని జాతీయ రైతు కమిషన్ కనీస మద్దతుధర సగటు ఉత్పత్తి వ్యయం కంటే కనీసం 50శాతం ఎక్కువగా ఉండాలని సిఫార్సు చేసింది. 1979-80లో ఉత్పత్తి వ్యయం అంచనాలపై ప్రత్యేక నిపుణుల(యస్ ఆర్సేన్) కమిటీ, 1990లో ఏర్పాటు చేయబడిన పంటల ఉత్పత్తి వ్యయ పద్ధతి సమీక్ష కోసం నిపుణుల కమిటీ, పంటల వ్యయం గురించి సీఏసీపీ ఉపయోగించిన పద్ధతికి సంబంధించిన అనేక సమస్యలు లేవనెత్తాయి. సేన్మరియు భాటియా కమిటీలు కూడా యాజమాన్యంలోని భూమి అద్దెవిలువను కూడా ఉత్పత్తి వ్యయంలో లెక్కించబడుతుందని ఎత్తిచూపారు. భూయజమాని మూలధనంపై వడ్డీఖర్చు 10శాతంగా అంచనా వేసింది. ఈ సిఫార్సులను ప్రభుత్వాలు, సీఏసీపీ పరిగణలోకి తీసుకోలేదు. 2014లో కేంద్ర నాయకత్వాన మొదటిసారి ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడినప్పుడు 2022నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని చెప్పింది. ఇంతవరకు ఆచరణలో అమలు జరగకపోగా నేడు దాని ఊసే ఎత్తటంలేదు. రైతుల ఆదాయం పెరగకపోవటంపైన, మద్దతు ధరలపైన కేంద్రప్రభుత్వంపై వివిధ రూపాల్లో వ్యతిరేకత పెరుగుతూ ఉండటంతో, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులకు అనుగుణంగా పంట ఉత్పత్తివ్యయంపై అదనంగా 50శాతం పెంచి మద్దతు ధరను ప్రకటిస్తామని కేంద్రప్రభుత్వం ప్రకటించింది. ఇక్కడే కేంద్రప్రభుత్వ వంచన బయటపడింది. స్వామినాథన్ కమిషన్ చెప్పినట్లు అన్నిరకాల ఖర్చులను లెక్కించకుండా, ఒక్కపంట ఖర్చునే తీసుకుని దానిపై 50శాతం పెంచి మద్దతు ధరను ప్రకటిస్తున్నది. 2024-25 సంవత్సరానికి ఎకరా సేద్యపుపంట ఖర్చు 28వేలుగా నిర్ధారించి, సగటు దిగుబడి 20క్వింటాళ్లు నిర్ణయించి, క్వింటాల్ ఉత్పత్తి ఖర్చు 14వందలు పేర్కొని దానిపై 50శాతం పెంచి 2100 రూపాయలుగా ప్రకటించి దాన్ని 2300రూపాయలకు పెంచింది. పంట ఖర్చు, కౌలు ఖర్చు, కుటుంబ శ్రమ, అప్పుల వడ్డీలతో వాస్తవ వ్యయం 64వేలు. క్వింటాల్ ఉత్పత్తిఖర్చు రూ.3200. దానిపై 50శాతం కలిపితే రూ.4,800గా మద్దతుధర ప్రకటించాలి. దీన్ని గమనించినప్పుడు స్వామినాథన్ సిఫార్సులను కేంద్ర ప్రభుత్వం వక్రీకరించి విధానం తెలుస్తుంది. మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించటానికి నిరాకరిస్తున్నది. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానని, మద్దతు ధర 50శాతం పెంచుతానని మోసపుచ్చుతూ వచ్చిన కేంద్ర ప్రభుత్వం మూడు వ్యవసాయచట్టాల ద్వారా మద్దతు ధరలకే మంగళం పాడి పంటల సేకరణ నుంచితప్పుకుంటే, ఆ చట్టాలకు వ్యతిరేకంగా రైతాంగ ఉద్యమం ఉవ్వెత్తున సాగటంతో, చట్టాలను ఉపసంహరించుకోక తప్పలేదు. 'స్వతంత్ర ' పాలన ప్రారంభం నుండి నేటివరకు పాలక ప్రభుత్వాలన్నీ రైతాంగ వ్యతిరేక విధానాలనే అనుసరించాయి. రైతాంగ ప్రయోజనాలను హరించి, బడావ్యాపారుల ప్రయోజనాలకు అనుకూలంగా పంటల మద్దతు ప్రకటిస్తున్నాయి. గిట్టుబాటుగాని ధరల వల్ల అప్పుల ఊబిలో కూరుకుపోయారు. నాలుగు లక్షల మంది రైతులు అప్పులు తీర్చేమార్గం కనపడక బలవన్మరణాల పాలయ్యారు. రైతాంగం, రైతు, రైతు కూలీ సంఘాలు పంటలకు న్యాయబద్ధమైన మద్దతు ధరలు ప్రకటించి, వాటికి చట్టబద్ధత కల్పించి, ప్రభుత్వమే కొనుగోళ్ల చేయాలనే డిమాండ్ చేస్తున్నాయి. ఆ ఉద్యమాలను చేసి కేంద్రప్రభుత్వం దిగివచ్చేలా చేయాలి. అప్పుడే న్యాయమైన మద్దతు ధర లభిస్తుంది. •

# ధూమపాన నిర్మూలనకు చర్యలేవి?

డా: బుర్ర మధుసూదన్ రెడ్డి

అత్యధిక మరణాలకు కారణంగా నిలుస్తున్న పొగ తాగడమనే దురలవాటు పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలనే సదుద్దేశంతో ప్రతి యేటా 12 మార్చిన నేషనల్ నో స్మోకింగ్ డే నిర్వహించడం ఆనవాయితీగా మారింది. ఊపిరితిత్తులకు సంబంధించిన ప్రాణాంతక వ్యాధులు, శరీరంలో ప్రాణ వాయువు మోతాదులు తగ్గడం, బిపీ/స్ట్రోక్ లాంటి హృద్రోగాలకు దారి తీస్తున్న పొగ తాగడమనే దురలవాటు బారిన పడిన మిలియన్ల ప్రజలు మరణం అంచున తమ జీవితాలను బుగ్గిపాలు చేసుకోవడం, కుటుంబాలు ఆర్థిక సమస్యలను ఎదుర్కోవడం, కుటుంబ సభ్యులు అనాథలుగా మారడం లాంటి ప్రతికూలతలు పొగరాయుళ్లను వెంటాడుతున్నాయి. పొగ తాగడాన్ని క్రమంగా తగ్గించడంతో ఫలితంగా సత్వరమే బిపీ, ఊపిరితిత్తులు, గుండె స్పందనలు మెరుగవుతాయి. పొగమానేస్తే శరీరంలో ప్రమాదకర కార్బన్ మోనాక్సైడ్ పరిమాణం తగ్గుతూ ఆరోగ్య పునరుద్ధరణకు బాటలు పడతాయి. సిగరెట్లు కాల్చడంతో వేల సంఖ్యలో రసాయనాలు విడుదల అయినప్పటికీ అందులో 70 వరకు ప్రమాదకర రసాయనాలు (కర్బన రసాయనాలు, క్యాన్సర్ కారకాలు, లోహాలు, వాయువులు, నికోటిన్, తార్‌లాంటివి) ప్రాణాంతకమైనవి ఉన్నట్లు గుర్తించారు. పొగ తాగడమనే దురలవాటు తీవ్ర ప్రభావాలను దృష్టిలో పెట్టుకొన్న ప్రపంచ పౌర సమాజం 1984 నుంచి ప్రతి ఏటా 2వ బుధవారం రోజున విశ్వవ్యాప్తంగా నేషనల్ నో స్మోకింగ్ డే" పాటించడం కొనసాగుతున్నది. పొగను వదిలితే ఆరోగ్యం మెరుగవుతుందనే నినాదాన్ని క్రిందటి స్థాయివరకు ప్రచారం చేయడం నేటి అవసరంగా భావించాలి. ప్రత్యక్షంగా పొగ తాగడంతో పాటు పొగరాయుళ్లతో పాటు వారు వదిలే





పొగను పీల్చే సెకండ్ హాండ్ స్మోకర్స్ కూడా పొగ తాగినట్లుగా, అనారోగ్యం పాలు అవుతారని భావించాలి. పొగ తాగడం ప్రాణాంతకం కావడంతో బహిరంగ ప్రదేశాల్లో స్మోకింగ్ నిషేధం విధించబడడం సముచిత నిర్ణయంగా కొనియాడాలి. పొగ తాగడంవల్ల ఊపిరితిత్తులు, నోటి క్యాన్సర్ సంభావ్యత పెరుగుతుందని పొగరాయుళ్లు గమనించాలి. పొగతాగడం వల్ల జీర్ణనాళం, మూత్రపిండాలు, కాలేయం, యూరినరీ బ్లాడర్ లాంటి ప్రధాన అవయవాలు కూడా దెబ్బతినడం ఖాయమని తేలింది. 2025 నేషనల్ నో స్మోకింగ్ డే ఇతివృత్తంగా అన్‌మాస్కింగ్ ది అప్పీల్" లేదా విజ్ఞప్తులను విందాం" అనే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం జరుగుతున్నది. పొగ తాగడమనే దురలవాటు వల్ల వ్యక్తి జీవితకాలం కనీసం 10ఏండ్లు తగ్గుతుందని తెలడం ప్రమాద హెచ్చరికగా భావించాలి. స్టైల్‌గా పొగ పీల్చడం వల్ల అనారోగ్యాలు, ఆర్థికభారం, ఆసుపత్రి బిల్లులు, సమాజంలో చెడ్డ పేరు, కుటుంబాల్లో చీకట్లతో పాటు చివరికి అకాలమరణం లాంటివి ఉచితంగా వస్తాయని పొగరాయుళ్లు బుద్ధి తెచ్చుకోవాలి. పొగ తాగడం వల్ల చికాకు లేదా ఇర్రిటేషన్, పొగపట్ల తీవ్రమైన కోరిక, చంచలత్వం, నిద్రలేమి లాంటి రోగ లక్షణాలు బయటపడడం, తర్వాత తీవ్రమైన ఊపిరితిత్తులు, హృద్రోగాలు, శ్వాసక్రియ రోగాలకు దారి తీస్తుంది. పొగకు స్వస్తిపలుకుదాం కొత్త జీవితాలను ప్రారంభిద్దాం" అంటూ శారీరక మానసిక ఆరోగ్యాలను ఆహ్వానిస్తూ, తన కోసమే కాదు తనను నమ్మిన వారి కోసం ఆరోగ్యకర జీవనశైలిని అలవర్చుకుందాం. మన ప్రాణాలు తీయక ముందే మనమే పొగకు విడాకులిద్దాం. పొగకు లొంగకుండా మన జీవితాలను సుసంపన్నం చేసుకుందాం. పొగ దురలవాటు డబ్బుతో ముడిపడింది కాదని, కుటుంబ జీవితాలతో సంబంధాన్ని పెనవేసుకుందని తెలుసుకోవాలి. పొగను వదిలితే నీ ఆరోగ్యంతో పాటు పర్యావరణ ఆరోగ్యం కూడా దెబ్బతింటుందని మరువరాదు. తమ బతుకుల్లో పొగసూరక ముందే బుద్ధి తెచ్చుకొని పొగకు 'నో' చెబుదాం, ఆరోగ్యకర జీవితానికి 'ఎస్' చెబుదాం. •

# బడ్జెట్లో విద్యారంగ కేటాయింపులు పెంచాలి

పాకాల శంకర్ గౌడ్

స్వాతంత్రం సిద్ధించి 78 సంవత్సరాలు గడిచినా, పాలకులు మారినా, స్వరాష్ట్రం సిద్ధించాక రాష్ట్రంలో నాణ్యమైన విద్య, వైద్యం ప్రజలకు ఉచితంగా అందించలేకపోతున్నాం. ఎన్నికలవేళ రాజకీయ పార్టీలు ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్యం ఉచితంగా అందిస్తామని ఏళ్లుగాహామీలు ఇస్తూనే ఉన్నారు. మాటలకు చేతలకు పొంతన ఉండడం లేదు. నేటికీ నాణ్యమైన విద్య, వైద్యం ప్రజలకు ఉచితంగా అందడం లేదు. రాష్ట్రంలోని సాధారణ పౌరులు వారి సంపాదనలో దాదాపుగా 80శాతం విద్య, వైద్యానికే ఖర్చు చేస్తున్నారనీ ఒక అంచనా. భారతదేశంలో అత్యధికంగా విద్య, వైద్య రంగాల్లో దోపిడీ జరుగుతుంది మన తెలుగు రాష్ట్రాల్లోనే. ప్రైవేటురంగంలో ఫీజులను నియంత్రించలేకపోవడం, ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణపై పాలకులకు చిత్తశుద్ధి లోపించడమే ఈ దుస్థితికి కారణం. తెలంగాణ రాష్ట్రం సిద్ధించాక సామాజిక బాధ్యతగా, విద్యావంతులు, మేధావులు, ఉపాధ్యాయ సంఘాలు తెలంగాణ రాష్ట్రంలో విద్యావ్యవస్థ ఎలా ఉండాలో సూచిస్తూ ప్రతిపాదనలను నాటి ప్రభుత్వానికి సమర్పించారు. వాటిని ఆనాటి ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. కేవలం గురుకుల విద్యావ్యవస్థను మాత్రమే ప్రోత్సహిస్తూ వచ్చింది. ఫలితంగా అప్పటికే కొనసాగుతున్న పాఠశాల విద్య నిర్లక్ష్యానికి గురైంది. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత రాష్ట్రంలో కేజీ నుండి పీజీ వరకు ఉచితవిద్య అందిస్తామని, కార్పొరేట్ విద్యకు దీటుగా ప్రభుత్వ బడుల్లో అందరికీ నాణ్యమైన విద్యను అందిస్తామని, పది సంవత్సరాలు అధికారంలో ఉన్నకాలంలో గత ప్రభుత్వం పాఠశాల విద్యకు కేటాయించిన బడ్జెట్ రాష్ట్రబడ్జెట్లో సగటుగా 6.6శాతం మాత్రమే. ఫలితంగా రాష్ట్రంలోని పాఠశాలల్లో 5895 పాఠశాలలో ఏకోపాధ్యాయ పాఠశాలలుగా నడుస్తున్నాయి. 2097 పాఠశాలల్లో అసలు పిల్లలే లేరు(జీరో స్కూల్స్). విద్యా హక్కు చట్టం అమల్లోకి వచ్చి 15 సంవత్సరాలు కావస్తున్న రాష్ట్రబడుల్లో మూత్రశాలలు బాలురకు 74.1 శాతం, బాలికలకి 85.14శాతం మాత్రమే ఉపయోగించే స్థితిలో ఉన్నాయి. రాష్ట్రంలో ప్రతిఏటా జీరోబడులు(పిల్లలు లేని బడులు )పెరుగుతున్నాయి. ప్రభుత్వ బడులకుఆదరణ తగ్గుతుందనే విషయం మనకు అర్థం అవుతుంది. కర్ణుడి చావుకు సవాలక్ష కారణాలు అన్నట్టుగా తెలంగాణ రాష్ట్రంలో పాఠశాల విద్యారంగం గాడి తప్పడానికి గత దశాబ్ద కాలంలో కేవలం గురుకులాలను ప్రోత్సహిస్తూ మిగతా బడులను నిర్లక్ష్యం చేయడం, మౌలిక సదుపాయాల కొరత, టీచర్ల కొరత, పర్యవేక్షణ లోపం, సత్ఫలితాలను ఇవ్వని పథకాల అమలు, ప్రభుత్వబడులపై తల్లిదండ్రులకు



ఏర్పడిన అభిప్రాయం, విద్యారంగానికి సరిపోయే బడ్జెట్ కేటాయించ కపోవడం వంటివి ఉన్నాయి. తెలంగాణ బడ్జెట్‌లో విద్యా రంగానికి గత సంవత్సరంలో 21,292(7.75శాతం) కోట్లు కేటాయించారు. దేశంలోని టాప్ 20 రాష్ట్రాలలో తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి అత్యల్పంగా 7.75శాతం నిధులను కేటాయించింది. ఢిల్లీ21.1శాతం, కర్ణాటక11శాతం, ఆంధ్రప్రదేశ్ (12.6శాతం), కేరళ(14శాతం), తమిళనాడు (14.1శాతం) రాష్ట్రాలు విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకి మనకన్నా అత్యధిక నిధులు కేటాయించాయి. ఆ రాష్ట్రాలతో పోల్చుకుంటే తెలంగాణ రాష్ట్ర విద్యారంగా కేటాయింపులు చాలా తక్కువ. నాటితో పోల్చుకుంటే నేటితరం ఉపాధ్యాయుల్లో సామాజికస్పృహ తగ్గిందని చెప్పవచ్చు. ప్రజా ఉద్యమాల్లో వీరి భాగస్వామ్యం కూడా తగ్గింది. ప్రగతిశీల చైతన్యపూరిత భావజాలానికి బదులుగా కార్పొరేటీకరణ, వ్యాపారీకరణ, ప్రైవేటీకరణ, స్వచింతన విద్యారంగంతో పాటు ఉపాధ్యాయుల్లో కూడా నెలకొన్నాయి. ప్రజలకు ఉపాధ్యాయులకు మధ్య అవినాభావ సంబంధం తగ్గింది. గతంతో పోలిస్తే నేటితరం ఉపాధ్యాయులపై ప్రజల్లో ప్రేమ అభిమానాలు, గౌరవం కూడా తగ్గాయి. వాటిని పునరుద్ధరించుకోవాల్సిన బాధ్యత నేటి తరం ఉపాధ్యాయుల పైన ఉంది. ఉపాధ్యాయులకు బోధనా నైపుణ్యాల పెంపుకోసం ప్రతి సంవత్సరం వృత్యంతర శిక్షణలను ఇస్తూ, పర్యవేక్షణ అధికారులతో నిరంతరం పర్యవేక్షిస్తే సత్ఫలితాలు సాధించవచ్చు. పర్యవేక్షణ అధికారులుగా బోధనా అనుభవం లేనివారిని నియమిస్తే అసలుకే మోసం వచ్చే ప్రమాదం ఉంటుంది. జిల్లా, మండలస్థాయి పర్యవేక్షణ అధికారులుగా బోధనాఅనుభవం గల వారిని మాత్రమే నియమించాలి. క్షేత్రస్థాయి పరిస్థితుల్ని విద్యార్థుల ఉపాధ్యాయుల సమస్యలను అర్థంచేసుకోవాలంటే బోధనాఅనుభవం ఉన్న అధికారులతో మాత్రమే సాధ్యమవుతుంది. విద్యకు 15శాతం నిధులు బడ్జెట్‌లో కేటాయించి, ప్రభుత్వబడులను పటిష్టంచేసి రాష్ట్రంలోని బడుగు బలహీనవర్గాల విద్యార్థుల కు నాణ్యమైన ఉచిత విద్యను అందిస్తామని వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యకు కేవలం 7.75శాతం మాత్రమే గతబడ్జెట్‌లో కేటాయింపులు చేసింది. దేశంలోని అన్నిరాష్ట్రాల్లో విద్యకుకేటాయించిన సగటుబడ్జెట్ 14.7శాతంలో ఈకేటాయింపులు సగంమాత్రమే అని గమనించాలి. విద్యారంగాన్ని సంక్షోభం నుండి బయట పడేయాలంటే రాష్ట్రంలో వివిధ మంత్రిత్వశాఖల ఆధ్వర్యంలో నడుస్తున్న 30306 పాఠశాలలో చదువుతున్న 28,95,456 మంది విద్యార్థులు 2020 సంక్షేమహాస్టల్లో ఉండి చదువుకుంటున్న 3,30,000 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు 35000 అంగన్వాడీ సెంటర్లో ఉన్న మూడు లక్షల పూర్వ ప్రాథమిక విద్యార్థుల అవసరాలను పరిగణలోకి తీసుకోవా

# ప్రజావాక్కు



## పరీక్షలంటే విద్యార్థులకు కారాదు అగ్ని పరీక్ష!

మార్చినెలలో పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. అలాగే ఈ పరీక్షల అనంతరం ఫలితాలు విడుదలైనప్పుడు ఫెయిల్ అయినవిద్యార్థులు వెంటనే విపరీత నిర్ణయాలు తీసుకుంటుండటం తీవ్రబాధ కలిగిస్తుంది. జీవితమంటే కేవలం పరీక్షలేకాదు ఆశించిన స్థాయిలో ఫలితాలు రాలేదని నిరుత్సాహపడకుండా విద్యార్థి ప్రయత్నాన్ని కొనసాగించాలి. ప్రతీ విద్యార్థికి అంతర్గతంగా ఒక ప్రతిభ దాగి ఉంటుంది. దాన్ని గుర్తించి తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రోత్సహించాలి. చదువుల పేరుతో వారిని విపరీతమైన ఒత్తిడికి లోనుకాకుండా చేయవలసిన బాధ్యత కూడా తల్లిదండ్రులదే. పిల్లల అభిరుచులు ముందుగా తెలుసుకుంటే విద్యార్థుల విపరీత నిర్ణయాలు కొంత వరకూ అరికట్టవచ్చు.

-దాసం వెంకటరెడ్డి, పశ్చిమ గోదావరి జిల్లా

## అర్థశాస్త్రం సబ్జెక్టును అభివృద్ధి చేయాలి

తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ అనుమతి ఉన్న జూనియర్ కళాశాలలకు తప్పనిసరిగా సామాజిక శాస్త్రాలలో భాగమైన అర్థశాస్త్రంసబ్జెక్టునుతప్పకుండా 2025-2026 విద్యా సంవత్సరం నుండి ప్రవేశపెట్టాలి. అర్థశాస్త్రం జూనియర్ కళాశాలలో గురుకుల కళాశాలలో పోస్టులు సాంక్షన్ అయ్యి కూడా కొన్ని కళాశాలలో అర్థశాస్త్రం బోధించడం లేదు. అర్థశాస్త్రం సబ్జెక్టులను నిర్లక్ష్యం చేయడం జరుగు తుంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలలో ఆర్థిక శాఖమంత్రినీ నియమిస్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలో ఇంటర్మీడియట్‌లో అర్థశాస్త్రాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు. వార్షిక బడ్జెట్లను ప్రవేశపెడుతున్నారు. ఎక్కడ సాంక్షన్‌అయిన సబ్జెక్టులను అక్కడనే ఉంచాలి. ఆకళాశాలల్లోనే అర్థశాస్త్రం సబ్జెక్టులను బోధించాలి. ఇతరప్రాంతాలకు ఈసబ్జెక్టులను తరలించవద్దు.

-రాపాక రవీందర్, జనగాం

## రైళ్లలో మిడిల్ బెర్త్‌లను తొలగించాలి

భారతీయ రైల్వేశాఖ ప్రయాణికుల కోసం సౌకర్యవంతమైన అందమైన అత్యాధునిక భోగీలను ఏర్పరుస్తున్నది. కాలానుగుణముగా అవసరాలకు తగ్గట్టుగా ప్రస్తుతం జనరల్ స్లీపర్ థర్డ్ సెకండ్ ఫస్ట్ ఏసీక్లాస్ భోగీలను నడుపుతున్నారు. ప్రయాణికులు పడుతున్న కష్టనష్టాలను దృష్టిలో ఉంచుకొని వాటిని కూషన్ సీట్లుగా మార్చారు.

## ప్రమాదాలను నివారించాలి

గత రోజుల్లో కన్న ప్రస్తుతం వాహనాలు అన్ని రకాలూ విపరీతంగా పెరిగినవి. ప్రయాణాలు కూడా పురుషులతో పాటు స్త్రీలుకూడా అత్యవసర ప్రయాణాలు చేస్తున్నారు. రోడ్ల పరిస్థితి బాగున్నా నడుపుతున్న వారు ట్రాఫిక్ నియమాలను పాటించడంలోభద్రత, నియమిత వేగం, ఎదుటిచూపూ లేకపోతే క్షణాల్లోప్రమాదం తప్పదు. ప్రమాదాల నియంత్రణ కోసం ట్రాఫిక్‌లో ఉల్లంఘనకు మోటార్ వెహికల్ చట్టం ప్రకారం మార్చిన జరిమానాలుకాస్త ఎక్కువగానే ఉన్నవి. కానీ జరిమానాలు దృష్టిలో పెట్టుకొని, ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ ముందు జాగ్రత్తగా అన్ని చూసి వాహనాన్ని నడపడం మన ప్రాణ రక్షణ కోసమే అని నమ్మి ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలి. రహదారిపై పోలీసులేకపోయినా సిగ్నల్ ప్రకారం వెళ్లి ఎదుటి ప్రయాణికుని గమనిస్తూ నిదానంగా పోవాలి. వేగం కన్నా ప్రాణం మిన్న అన్న భావన బోర్డు కన్న మన ఆచరణ ,భయంలోనే ఉంది.

-బొల్లోజు మేఘనాథమ్, విశాఖపట్నం

## ఇంకా పురుషాధిక్య సమాజమే

ప్రతిఏటా మార్చి ఎనిమిదవ తారీఖున నారీ దినోత్సవం పేరిట మహిళా మణులను తలచుకోవడం, వారి శక్తిని కీర్తించడం ఆతరువాత మరవడం ఇవన్నీ ఏటా వచ్చే ఉత్సవం లాంటివి. చట్టసభలలో ముప్పై మూడు శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ముప్ఫైఏళ్ళపై నుండి వాగ్దానాలను చేయడమే కాని వాస్తవరూపం దాల్చడం లేదు. దేశంలో ఉండే మహిళల్లో ఎంత శాతం ఉద్యోగాల్లో గాని ఇతర రంగాల్లో గాని రాణిస్తున్నారు. అంటే బహు తక్కువ అని తెలుస్తుంది. దేశం ఎంతో పురోభివృద్ధి చెందుతోందన్న వార్తలొస్తున్నా, మహిళలు అనేకరకాలుగా ఇప్పటికి చిత్రహింసలకు గురవుతున్నారు. మహిళా సాధికారికత అనేది పేపర్లలో ప్రచురించ దగ్గ అందమైన పదం మాత్రమే.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## పెన్షన్ ఫండ్ చెల్లించాలి

కోల్ ఇండియా, సింగరేణి బొగ్గు గని అధికారులకు కార్మికులకు కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ ద్వారా దాదాపు ఐదు లక్షల మందికి పింఛన్ చెల్లిస్తున్నారు. అధికారులు, కార్మికుల వద్ద బేసిక్ నుంచి ఏడు శాతం వసూలు చేసి యాజమాన్యాలు ఏడుశాతం కలిపి పెన్షన్ ఫండ్‌కు జమ చేస్తున్నారు. పెన్షన్ ఫండ్‌కు వచ్చిన మొత్తం కంటే 316.23కోట్లు తక్కువ జమ కావడంతో చెల్లింపుల మధ్య ఆంతర్యం పెరుగుతుంది.

-కె.రామారావు, నల్గొండ జిల్లా

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# పాకిస్థాన్‌లో ఎక్స్‌ప్రెస్ రైలు హైజాక్

## బెలూచిస్థాన్ ప్రావిన్స్‌లో దాడిచేసిన వేర్పాటు వాదులు, బందీలుగా వందలమంది ప్రయాణీకులు

**ఇస్లామాబాద్, మార్చి 11:** పాకిస్థాన్‌లో రైలు హైజాక్‌కు గురైన ఘటన కలకలం సృష్టిస్తోంది. బలోచిస్థాన్ ప్రావిన్స్‌లోని వేర్పాటువాదులు ప్రయాణికుల రైలుపై దాడి చేశారు. వందల మందికిపైగా ప్రయాణికులను బందీలుగా తీసుకున్నామని ప్రకటించుకున్నారు. బెలూచిస్థాన్‌లోని క్వెట్టా నుంచి ఖైబర్ పఖ్తుంఖ్వాలోని పెషావర్‌కు రైలు వెళుతుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. పెషావర్ వెళుతున్న జాఫర్ ఎక్స్‌ప్రెస్‌పై వేర్పాటువాదులు భారీస్థాయిలో కాల్పులు జరిపారని బలోచిస్థాన్ ప్రభుత్వ ప్రతినిధి షాహిద్ రిండ్ వెల్లడించారు. ఈ ఘటన గురించి తెలియగానే అత్యవసర చర్యలు తీసుకోవాలని స్థానిక యంత్రాంగాన్ని ప్రభుత్వం ఆదేశించింది. వేర్పాటువాద మిలిటెంట్ గ్రూప్ బలోచ్ ఆర్మీ (బిఎల్ఎ) ఈ దాడికి బాధ్యత ప్రకటించుకుంది. తాము బందీలుగా తీసుకున్న తీసుకున్న వారిలో భద్రతా సిబ్బంది కూడా ఉన్నారని తెలిపింది. పక్కా ప్రణాళికతో ఆ గ్రూప్ రైల్వే ట్రాక్‌ను పేల్చివేయడంతో జాఫర్ ఎక్స్‌ప్రెస్ నిలిచిపోయింది. దాంతో మిలిటెంట్లు వెంటనే రైలును తమ నియంత్రణలోకి తెచ్చుకున్నారు. ప్రయాణికులందరినీ బంధించారు. ఈ దాడిలో



ఆగురుగు మిలిటరీ సిబ్బంది మృతి చెందినట్లు బిఎల్ఎ వెల్లడించింది. తమపై ఏదైనా మిలిటరీ ఆపరేషన్‌కు ప్రయత్నిస్తే ప్రయాణికులందరినీ చంపేస్తామని బెదరించింది. ఈ ఘటనలో రైలు డ్రైవర్ గాయపడినట్లు తెలుస్తోంది.

ప్రస్తుతం ఘటనాస్థలానికి సహాయక, భద్రతా సిబ్బంది చేరుకున్నట్లు స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. బందీలను విడిపించేందుకు పాక్ భద్రతా బలగాలు యత్నిస్తున్నాయి. ఇదిలా ఉంటే బలోచిస్థాన్ వేర్పాటువాదులు పాక్‌లో వరుసగా దాడులకు పాల్పడుతున్నారు. పోలీసుస్టేషన్లు, రైల్వేలైన్లు, వాహనాలపై దాడులు చేస్తున్నారు. సాయుధులు ప్రధాన హైవేను స్తంభింపజేసి బస్సులో నుంచి ప్రయాణికులను కిందకు దించి వారి గుర్తింపుకార్డులను చూసి మరీ కాల్చిచంపిన ఘటనలు చోటుచేసుకున్నాయి. బలోచ్ ప్రజల స్వయం నిర్ణయాధికారం, పాకిస్థాన్ నుంచి ప్రత్యేక ప్రాంత ఆవిర్భావాన్ని కోరుతూ బిఎల్ఎ 2000 సంవత్సరం ప్రారంభం నుంచి పాక్ సైన్యంపై దాడులకు పాల్పడుతోంది. పాక్‌తోపాటు అమెరికా, యుకె దీన్ని ఉగ్ర సంస్థగా ప్రకటించాయి.

బలోచిస్థాన్ ప్రాంతం నైరుతి పాకిస్థాన్, ఆగ్నేయ ఇరాన్, దక్షిణ అఫ్గానిస్థాన్‌లలో వ్యాపించి ఉంది. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన చైనా–పాకిస్థాన్ ఆర్థిక నడవా (సిపెక్) బలోచిస్థాన్ ద్వారా వెళ్తుండటం ఈ దాడులకు ప్రధాన కారణం. ఆర్థిక వృద్ధికి సిపెక్ తోడ్పడుతుందని పాకిస్థాన్ ప్రభుత్వం ఆశిస్తుండగా తమ ప్రాంత వనరులను కొల్లగొట్టడానికి ఇదొక ఎత్తుగడ అని, దీని వల్ల తమకు ఎలాంటి ప్రయోజనం లేదని స్థానికులు భావిస్తున్నారు. సిపెక్‌కు సంబంధించిన ప్రాజెక్టులు, సిబ్బందిపై ముఖ్యంగా చైనీయులపై ఇటీవల దాడులు అధికమయ్యాయి.

బలోచ్ వేర్పాటువాదాన్ని పాకిస్థాన్ ఉక్కుపాదంతో అణచివేస్తుండటంతో పరిస్థితులు మరింత జటిలంగా మారుతున్నాయి. ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ లెక్కల ప్రకారం 2011 నుంచి దాదాపు పదివేల మంది బలోచ్ ప్రజలు అదృశ్యమయ్యారు.



# పునర్విభజన వల్ల పెరగనున్న సీట్లు

## రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

**న్యూఢిల్లీ, మార్చి 11:** లోక్‌సభ నియోజకవర్గ పునర్విభజన అమలుపై దక్షిణాది రాష్ట్రం తమిళనాడు కొంతకాలంగా అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని, పార్లమెంట్‌లో సీట్ల సంఖ్య తగ్గుతుందని డిఎంకె ప్రభుత్వం వాదిస్తోంది. ఈ నేపథ్యంలో కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ స్పందించారు. డీలిమిటేషన్ ప్రక్రియ ప్రణాళికాబద్ధంగా కొనసాగుతుందని భావిస్తున్నా. దీనిపై అభ్యంతరాలు ఉంటే తమిళనాడు సిఎం ఎంకె స్టాలిన్‌కు వాటిని లేవనెత్తే స్వేచ్ఛ ఉంటుంది. ఆ అంశాలపై సంబంధిత అధికారులు చర్చలు జరుపుతారు. నిర్ణయం న్యాయంగా ఉంటుంది. శాసనసభ, లోక్‌సభ అయినా ప్రతి రాష్ట్రంలోనూ నియోజకవర్గాల పునర్విభజన తర్వాత సీట్ల సంఖ్య సహజంగానే పెరుగుతుంది అని రాజ్‌నాథ్ సింగ్ హామీ ఇచ్చారు. తమిళనాడు సహా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళలో కూడా సీట్ల సంఖ్య పెరుగుతుంది. కేవలం ఉత్తరాది రాష్ట్రాలకే ప్రయోజనం చేకూరుతుందనేది సరైన వాదన కాదు అని పేర్కొన్నారు. కాగా లోక్‌సభ నియోజకవర్గ పునర్విభజన విషయంలో తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ గత కొంతకాలంగా కేంద్రంపై విమర్శలు గుప్పిస్తోన్న సంగతి తెలిసిందే. జనాభా ప్రాతిపదికన మాత్రమే నియోజకవర్గాలను నిర్ణయిస్తే రాష్ట్రంలో లోక్‌సభ స్థానాలు తగ్గుతాయని ఆయన ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే డీలిమిటేషన్ వ్యతిరేకించాలని కోరుతూ స్టాలిన్ ఏడుగురు ముఖ్యమంత్రులకు లేఖ రాశారు. తాజాగా దీనిపై స్పందించిన రాజ్‌నాథ్ సింగ్ ఈ వ్యాఖ్యలు చేశారు. పునర్విభజనపై వ్యక్తం అవుతున్న ఆందోళనలు సరైనవి కావని పేర్కొన్నారు.

# రన్యారావు కేసు విచారణ అధికారిగా గౌరవ్ గుప్తా

**బెంగళూరు, మార్చి 11:** కన్నడ నటి రన్యారావు దుబాయ్ నుంచి అక్రమంగా బంగారం తీసుకొస్తూ రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిపోయిన సంగతి తెలిసిందే. ఆమె బంగారం తరలించే సమయంలో విమానాశ్రయంలో విఐపి ప్రోటోకాల్‌ను దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ అంశంపై విచారణ జరపాలని కర్ణాటక ప్రభుత్వం ఆదేశించింది. బంగారాన్ని అక్రమంగా తరలించే సమయంలో భద్రతా తనిఖీలను తప్పించుకునేందుకు ఆమె సవతి తండ్రి, సీనియర్ ఐపిఎస్ అధికారి కె.రామచంద్రరావు పేరును ఉపయోగించుకున్నారనేది ప్రధాన ఆరోపణ. దీనిపై పూర్తిస్థాయి దర్యాప్తు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అంతేకాక ఇందులో రామచంద్రరావు పాత్ర ఏమైనా ఉందా అనే దానిపైనా దృష్టి సారించాలని కోరింది. ఇందులో భాగంగా ఈ కేసు విచారణ అధికారిగా అదనపు ప్రధాన కార్యదర్శి గౌరవ్ గుప్తాను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. తక్షణమే విచారణ ప్రారంభించి,



వారం రోజుల్లో తుది నివేదిక సమర్పించాలని ఆదేశించింది. ఇదిలా ఉండగా రన్యా బంగారం స్మగ్లింగ్ వ్యవహారంలో ఆమె స్నేహితుడు, అట్రియా హోటల్ యజమాని మనవడు తరుణ్ రాజును డిఆర్ఐ అధికారులు అరెస్టు చేసినట్లు తెలుస్తోంది. అతన్ని బెంగళూరులోని ప్రత్యేక ఆర్థికనేర కోర్టులో హాజరుపరచగా అయిదు రోజుల కస్టడీని విధించింది. బంగారం అక్రమ రవాణాలో తరుణ్ పాత్ర ఉన్నట్లు దర్యాప్తులో వెల్లడయింది.

# శాంతి ఒప్పందంలో ఉక్రెయిన్ భూమిని వదులుకోవాల్సిందే

## అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో



**జెద్దా, మార్చి 11:** శాంతి ఒప్పందం కోసం 2014 తర్వాత రష్యా ఆక్రమించుకొన్న భూమిపై ఉక్రెయిన్ ఆశలు వదులుకోవాల్సిందేనని అమెరికా విదేశాంగమంత్రి మార్కో రూబియో తేల్చి చెప్పారు. అప్పుడే సంధి జరిగి యుద్ధం ఆగుతుందన్నారు. శాంతి చర్చల కోసం ఉక్రెయిన్ అధికారులతో మాట్లాడేందుకు సౌదీ అరేబియా రాజధాని జెద్దాకు చేరుకున్న సందర్భంగా మార్కో రూబియో ఈ వ్యాఖ్యలు చేశారు. శ్వేతసౌధంలో ట్రంప్–జెలెన్‌స్కీల మధ్య వాగ్వాదం చోటు చేసుకొన్న 10 రోజుల తర్వాత ఈ పరిణామాలు సంభవించడం గమనార్హం.

ఇప్పటికే ట్రంప్ ప్రభుత్వం ఉక్రెయిన్‌కు సైనిక సాయం, ఇంటెలిజెన్స్ సమాచారం నిలిపివేసింది. రూబియో విలేకరులతో మాట్లాడుతూ 'ఉక్రెయిన్ శాంతి ఒప్పందం కొన్ని కఠినమైన నిర్ణయాలు తీసుకొంటుందన్న అంచనాలతోనే నేను ఇక్కడికి వచ్చాను. అదే సమయంలో యుద్ధం ముగించాలంటే రష్యా కూడా కొన్ని పనులు చేయాల్సి ఉంటుంది. ఇరుపక్షాలు ఓ అవగాహనకు రావాల్సిన అవసరం ఉంది. ప్రస్తుత పరిస్థితికి సైనిక పరిష్కారం లేదు. ఇక ఉక్రెయిన్ మొత్తాన్ని రష్యా ఆక్రమించలేదు. అదే సమయంలో 2014 నాటి స్థితికి రష్యాను ఉక్రెయిన్ చేర్చలేదు' అని పేర్కొన్నారు. అంతకుమించి ఒప్పందం వివరాలను మాత్రం ఆయన వెల్లడించేందుకు నిరాకరించారు.

ఇక ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ కూడా జెద్దా చేరుకొన్నారు. ఆయన సౌదీ యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా యుద్ధ ఖైదీల విడుదలకు ఆయన సంసిద్ధత వ్యక్తం చేశారు.

**కర్స్క్ ప్రాంతంలో రష్యా దూకుడు:** ఉక్రెయిన్ స్వాధీనం చేసుకొన్న కర్స్క్ ప్రాంతాన్ని రష్యా దళాలు స్వాధీనం చేసుకోవడం మొదలుపెట్టాయి. అమెరికా నుంచి సైనిక, ఇంటెలిజెన్స్ సాయం నిలిచిపోవడంతో మాస్కో సేనలు రెట్టించిన ఉత్సాహంతో దాడులు చేస్తున్నాయి. వీటికితోడు ఉత్తరకొరియా దళాలు కూడా గత కొన్ని రోజులుగా ఇక్కడ పలు ఉక్రెయిన్ స్థావరాలను స్వాధీనం చేసుకొన్నాయి. కీవ్ నుంచి ఈ ప్రాంతానికి వస్తున్న కీలక వస్తువుల సరఫరాను తరలించేందుకు ఉపయోగించే రోడ్డును స్వాధీనం చేసుకొనేందుకు రష్యా సేనలు యత్నిస్తున్నాయి. ఇప్పటికే ఆ ప్రాంతంలో ఉన్న ఉక్రెయిన్ సేనలను మాస్కో దళాలు చుట్టుముట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కాగా, ఈ ప్రచారాన్ని ఉక్రెయిన్ సైన్యం తిరస్కరిస్తోంది.

# చైనా బయటే నా వారసుడి జననం

## టిబెట్ ఆధ్యాత్మిక గురువు దలైలామా




**ధర్మశాల, మార్చి 11:** చైనా బయటనే తన వారసుడు జన్మిస్తాడని టిబెట్ బౌద్ధగురువు దలైలామా వ్యాఖ్యానించారు. కొత్తగా రాసిన ఆయన తన పుస్తకంలోనే ఈ అంశం ప్రకటించారు. దీనితో దాదాపు ఆరుదశాబ్దాలుగా టిబెట్ నియంత్రణపై చైనాతో ఆయనకు వివాదం ఉన్న సంగతి తెలిసిందే. తన తర్వాత దలైలామా వారసత్వం కొనసాగాలని ఆయన రాసిన వాయిస్ ఫర్‌ది వాయిస్‌లెస్‌లో కోరారు. నేడు విడుదలకానున్న ఈ పుస్తకాన్ని ఒక ఆంగ్ల వార్త పత్రిక సమీక్షించింది. గతంలో ఓసందర్భంలో దలైలామా మాట్లాడుతూ తన తర్వాత ఈ పరంపర ముగిసిపోవచ్చని ఆందోలన వ్యక్తం చేసారు. కానీ తన తాజా పుస్తకంలో మాత్రం చైనా బయటపుడతారని పేర్కొన్నారు. తన పునర్జన్మ టిబెట్‌బయట జరగొచ్చని అది భారత్‌లో కూడా కావచ్చని ఆయన పేర్కొన్నారు. పూర్వీకుల పనిని ముందుకు తీసుకెళ్లడానికి ఉద్దేశించిందే పునర్జన్మ. కొత్త దలైలామా చైనా బయట స్వేచ్ఛా ప్రపంచంలోజన్మిస్తాడు. అందుకే తన బాధ్యత అయిన విశ్వకరుణకు గొంతుకగా ఉంటారని ఆయన ఆ పుస్తకంలో పొందుపరిచారు. 14వ దలైలామాగా మారిన టెంజియన్ గ్యాట్సో 23వ ఏటే టిబెట్‌నుంచి భారత్‌కు వలసవచ్చారు. ఆనాడు తమ ప్రాంతాన్ని ఆక్రమించిన చైనాకు వ్యతిరేకంగా ఆయన గళం విప్పారు. టిబెట్‌వాదాన్ని జీవంగా ఉంచినందుకు ఆయనకు 1989లో నోబెల్‌శాంతి బహుమతివచ్చింది. తన వారసుడిగా చైనా ప్రకటించే వ్యక్తికి ఎటువంటి గౌరవం లభించదని వెల్లడించారు. దలైలామా ప్రస్తుతం భారత్‌లోని ధర్మశాలలో ఆశ్రయం పొందుతున్నారు. ఆయన అక్కడినుంచే తన వారసుడిని ఎంపికచేయనున్నారు. ఇదిచైనాకు గిట్టక తన గడ్డపైనే వారసుడిని గుర్తించాలని భావిస్తోంది. టిబెట్ బౌద్ధుల దృష్టిలో దలైలామా తర్వాత రెండో స్థానం పంచెన్‌లామాది. ఈ పదవికి దలైలామా ఎంపికచేసిన బాలుడిని కాదని చైనా తనే సొంతంగా ఒక బాలుడిని నియమించినా టిబెటన్ల ఆమోదం పొందడంలో ఆతడు విఫలం అయ్యాడు. ఈ క్రమంలో ఇపుడు కొత్తవారసుడి ఎంపికపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

# లోక్‌సభలోకి కొత్త ఇమ్మిగ్రేషన్ బిల్లు

## సభలో ప్రవేశపెట్టిన హోంశాఖ సహాయమంత్రి నిత్యానంద్‌రాయ్

**న్యూఢిల్లీ, మార్చి 11:** వలసవిధానాలు, విదేశీయులకు సంబంధించి వివిధ సేవలను హేతుబద్ధీకరించేందుకుగాను ఒక కొత్త సవరణ బిల్లును ఎన్డీయే సర్కారు లోక్‌సభలోప్రవేశపెట్టింది. వారు దేశంలోకి రావడం, వెళ్లడం, భారత్‌లో బసచేయడం వంటి పూర్తి వివరాలపై ఉన్న సేవల బిల్లును లోక్‌సభలో మంగళవారం ప్రవేశపెట్టింది. పార్లమెంటుకు ఈ బిల్లుసవరణకు అవకాశం లేదన్న విమర్శలపై హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్‌రాయ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వానికి ఈబిల్లుకు సంబంధించి సర్వహక్కులు ఉన్నాయని, కేంద్రజాబితాలో ఉన్న చట్టాల్లో సవరణలు తెచ్చే వెసులుబాటు కూడా ఉందని వివరించారు. ఈబిల్లు ఆమోదం పొందితే ప్రస్తుతం ఉన్న చట్టాలు పాస్‌పోర్టు, భారత్‌లోకి ప్రవేశం చట్టం 1920, రిజిస్ట్రేషన్ ఆఫ్ ఫారినర్స్ యాక్ట్ 1939, విదేశీయుల చట్టం 1946, వలసవిధానం క్యారియర్స్ లయబిలిటీ చట్టం 2000 చట్టాలు కూడా మారిపోతాయి. ఈ ముసాయిదాబిల్లు జాతీయ భద్రతను పెంపొందించి వలసవిధానాలపై పూర్తి నియంత్రణతోపాటు నిబంధనలు ఉల్లంఘించి బసచేసినవారు, గడువుమీరినా కొనసాగినవారిని



పరిశీలించి కఠిన శిక్షలు, జరిమానాలు విధించేందుకు కూడా ఈచట్టంలో పొందుపరిచారు. జాతీయభద్రత, దేశ సార్వభౌమత్వానికి, జాతి సమగ్రతకు ముప్పుగా పరిణమించిన విదేశీయులను ఎట్టిపరిస్థితుల్లోను అనుమతించే వీలులేకుండా ఈ చట్టంలో నిబంధనలున్నాయి. భారత్‌లోకి వచ్చినవెంటనే వారి రిజిస్ట్రేషన్, వారి కదలికలపై నియంత్రణ, పేరుమార్పు, రక్షిత, అనుమతిలేని ప్రదేశాల్లోకి రావడం విద్యాసంస్థలు, ఆసుపత్రులు, నర్సింగ్‌హోంలు వంటివాటిలోకి రావడంపై నియంత్రణ వంటివి ఉన్నాయి. భారత్‌కు ఎలాంటి చెల్లుబాటయ్యే పాస్‌పోర్టు వీసాలు లేకుండా వస్తే కనీసం ఐదేళ్లపాటు జైలుశిక్ష,ఐదులక్షల జరిమానా ఉన్నాయి. నకిలీపత్రాలతో వస్తే కనీసం రెండునుంచి ఏడేళ్లజైలు, లక్షనుంచి పదిక్షల రూపాయలవరకూ జరిమానా ఉంటుందని కొత్తబిల్లులో పొందుపరిచారు. వీసానిబంధనలు ఉల్లంఘించి మరింతకాలం బసచేసినవారు, అనుమతిలేని ప్రాంతాల్లోకి రావడం వంటివి చేస్తేమూడులక్షల జరిమానా, మూడేళ్లజైలు వంటివి ఉన్నాయి. అలాగే సరైన ధృవపత్రాలు లేకుండా విదేశీయులను తీసుకువచ్చే ట్రాన్స్‌పోర్టుసంస్థలు కూడా ఐదులక్షల జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. అలాగే జరిమానాలు చెల్లించకపోతే వారి సంస్థలు, వాహణాలు అన్నింటినీ సీజ్‌చేసే అధికారం ఉంది. ఒక విదేశీయుడికి అనుమతి నిరాకరిస్తే ఆ ట్రాన్స్‌పోర్టు సంస్థ అందుకు బాధ్యత వహించాలని ఆతడిని వెంటనే భారత్‌నుంచి పంపించివేయాలని సూచిస్తోంది. వారంట్‌లేకుండా కూడా ఇమ్మిగ్రేషన్ అధికారులను అవసరమైతే అరెస్టుచేసే అధికారాలు కూడా కల్పిస్తోంది. ఈబిల్లుపై కాంగ్రెస్‌నేత మనీష్‌తివారీ మాట్లాడుతూ రాజ్యాంగంలోని వివిధ నిబంధనలు, వివిధ చట్టాలను ఉల్లంఘిస్తోందని ఆరోపించారు. రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులను హరించివేస్తోందని, ప్రభుత్వం కొత్త చట్టంలోని నిబంధనలను అలుసుగా తీసుకుని అధికార పార్టీకి అనుకూలంగా లేని వారిని వ్యవహరించేవారిని కూడా వేధించే అవకాశాలున్నాయని ఆరోపించారు.

# మారిషస్ నేషనల్‌డేకు చీఫ్‌గెస్ట్‌గా ప్రధాని మోడీ

## 27 యేళ్ల క్రితమే మారిషస్‌తో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్న పిఎం



ప్రధాని మోడీ 27యేళ్లక్రితం మారిషస్‌ను సందర్శించిన చిత్రం(ఫైల్)

**న్యూఢిల్లీ, మార్చి 11:** మినీ ఇండియాగా పిలుచుకునే మారిషస్‌లో ప్రధాని నరేంద్రమోడీ పర్యటిస్తున్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా ప్రధాని హోదాలో రెండోసారి ఆ దేశం వెళ్లారు. అయితే 27 ఏళ్ల క్రితమే మారిషస్‌తో ఆయనకు అనుబంధం ఏర్పడింది. 1998లో గుజరాత్‌లో బిజెపి భారీ విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించిన మోడీ మారిషస్‌లోని మోకా ప్రాంతంలో జరిగిన అంతర్జాతీయ ఆరమాయణ సదస్సులో పాల్గొని ప్రసంగించారు. భారత సంతతి జనాభా అధిక సంఖ్యలో ఉండటం వల్ల అది మినీ ఇండియాగా పాపులరైంది. ఈ దేశానికి వచ్చినప్పుడల్లా మినీ ఇండియాకు వచ్చినట్లే ఉంటుందని తొలి పర్యటన ఫొటోలను షేర్ చేస్తూ తన అనుబంధాన్ని వెల్లడించారు. అప్పుడు ఆయన బిజెపి జాతీయ కార్యదర్శిగా అక్కడికి వెళ్లి శ్రీరాముడు తన జీవితంలో అనుసరించిన విలువలను వెల్లడించాడు. రామాయణం రెండు దేశాల సంబంధాల్లో ఎలా వారధిగా నిలుస్తుందో వివరించారు. అప్పుడు ఆయన పరనయటన అధికారిక సమావేశాలకే పరిమితం కాలేదు. ఆ దేశ భౌగోళిక స్వరూపం, చరిత్ర, ప్రజల అలవాట్లను అర్థం చేసుకునేందుకు ప్రయత్నించారు.అలాగే గంగా తలావో సరస్సును సందర్శించారు. భారత్ వెలుపల ఆ ప్రాంతంలో హిందూ సంప్రదాయాలను అనుసరిస్తోన్న తీరును వీక్షించారు. ఆ దేశ జాతిపితగా పేరుగాంచిన సర్ సివూసాగుర్ రామ్‌గులాంకు నివాళి అర్పించారు. తర్వాత ప్రధాని హోదాలో 17 ఏళ్లకు మళ్లీ ఆ దేశంలో పర్యటించారు. మళ్లీ గంగా తలావోను సందర్శించారు. 2015లో ఆ దేశ నేషనల్ డేలో పాల్గొన్నారు. ఇప్పుడు మరోసారి పదేళ్లకు 57వ నేషనల్‌డేకు చీఫ్‌గెస్ట్‌గా పాల్గొననున్నారు. 'మారిషస్ హిందూ మహాసముద్రంలో మన కీలక భాగస్వామి మాత్రమే కాదు, ఆఫ్రికా ఖండానికి ముఖద్వారం కూడా. చారిత్రకంగా, భౌగోళికంగా, సాంస్కృతికంగా మనకు ఆ దేశంతో అనుబంధం ఉంది అని ఈ పర్యటనకు ముందు మోడీ అన్నారు.



# హోలీ పండుగరోజు మసీదులవద్ద టార్పాలిన్లతో కవర్ చేసుకోండి

## యూపి మంత్రి రఘురాజ్‌సింగ్ వివాదాస్పద వ్యాఖ్యలు

**ఆలిఘుర్, మార్చి 11:** హోలి పండుగరోజు రంగుల నుంచి తప్పించుకునేందుకు ముస్లింలు టార్పాలిన్‌లతో కవర్ చేసుకోవాలని యుపి మంత్రి రఘురాజ్‌సింగ్ చేసిన సూచనలు వివాదాన్ని రేకెత్తించాయి. శుక్రవారం ఓపక్క మసీదుల్లో నమాజ్ ప్రార్థనలు, మరోపక్క హోలీ వేడుకలు జరగనున్నందున ముస్లింలు తగు జాగ్రత్తలు తీసుకోవాలంటూ వివాదాస్పద వ్యాఖ్యలుచేసారు. మసీదు ప్రార్థనలనుంచి వచ్చినవెంటనే వారిపై రంగులు చల్లేప్రమాదం ఉందని అందువల్ల జాగ్రత్తలుతీసుకోవాలని ఆయన సూచించారు. రంజాన్‌నెలలో వచ్చే రెండో శుక్రవారం మసీదు ప్రార్థనలు చేస్తుంటారు. సరిగ్గా అదేరోజు కూడా హిందువుల మరో పండుగ హోలీ వచ్చింది. సనాతన ధర్మను ఆచరించేవారు ఈ పండుగను అత్యం తపవిత్రంగా జరుపుకుం టారు. అయితే కొన్ని అనుమతిలేని ప్రాంతాలు, మసీదులవద్ద హోలీ రంగులు చల్లుకోవద్దని ఆంక్షలు కూడా ఉన్నాయి. ముస్లిం ప్రజలు మసీదులనుంచి బయటికువచ్చేటపుడు జాగ్రత్తలుతీసుకో వాలని, ముస్లిం మహిళలు అయితే పరదాలు ఉంటాయని, అందువల్ల మసీదులను టార్పాలిన్లతో కవర్‌చేసుకోవాలనిసూచించారు. ఇప్పటికే సంభాల్‌లోని ఒక సర్కిల్ అధికారి హోలిరంగులు చల్లే అవకాశం ఉన్నందున ముస్లింలు అందరూ ఆరోజు ఇళ్లలోనే ఉండాలని చేసిన వ్యాఖ్యలు వివాదాలను రేకెత్తించాయి. జుమా నమాజ్ ప్రార్థనలు ఏడాదిలో 52సార్లు వస్తాయని, అదే హోలీపండుగ ఒక్కసారే వస్తుందని అందువల్ల ముస్లింలు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. సంభాల్ పోలీస్ అధికారి వ్యాఖ్యలను యుపీ సీఎం ఆదిత్యనాథ్‌కూడా సమర్థించారు. పైగా ఆ అధికారిని పహల్‌వాన్ అని ప్రశంసించారు. అర్జున్ అవార్డుగ్రహీత అయిన అధికారి చెప్పింది వాస్తవమేనన్నారు. హోలి పండుగ కారణంగా అనేక మసీదుల్లో శుక్రవారం ప్రార్థన సమయాలను మార్చుకున్నారు. స్థానిక బిజెపినాయకుడు రూబీ ఆసిఫ్‌ఖాన్ మాట్లాడుతూ ఎఎంయు క్యాంపస్‌లో రామ్ మందిర్ నిర్మాణాన్ని సమర్థించారు. తాను ఈ ప్రతిపాదనకు మద్దతిస్తున్నానని, ఇందుకోసం భారీ విరాళం కూడా సేకరించిఅందచేస్తానని అన్నారు. అయితే జిల్లాల అధికారులు మాత్రం హోలీపండుగ ప్రశాంతవాతావరణంలో జరుపుకునే విధంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రకటించారు.

# అసెంబ్లీలో ప్లాస్టిక్ పాములతో కాంగ్రెస్ ఎమ్మెల్యేల నిరసన

**భోపాల్, మార్చి 11:** మధ్యప్రదేశ్ అసెంబ్లీ సమావేశాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వినూత్ననిరసన తెలిపారు. ప్లాస్టిక్ పాములను సభలోకి తెచ్చి ఉద్యోగ ఖాళీలపై బిజెపి ప్రభుత్వం విషసర్పంలా కమ్ముకుని ఉందని విమర్శలుచేసారు. ఇందుకు గుర్తుగా ప్లాస్టిక్ సర్పాలను బుట్టల్లో పెట్టుకుని మరీ వచ్చి అసెంబ్లీలోప్రదర్శించారు. రాష్ట్రమంత్రి కాంగ్రెస్ ఎమ్మెల్యే తీరును తీవ్రంగా వ్యతిరేకించారు. అసెంబ్లీ సత్సంప్రదాయాలను కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉల్లంఘించారని, కేవలం ఫోటో ప్రదర్శనకోసం అసెంబ్లీని వాడుకోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. రాష్ట్ర బడ్జెట్ సమావేశాలుప్రారంభం అయ్యేముందు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు విపక్షనేత ఉమంగ్ సింఘార్ ఆధ్వర్యంలో గుమికూడి మహాత్మాగాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. వారంతా కూడా బుట్టల్లో ప్లాస్టిక్‌పాములనుతెచ్చి ప్లకార్డులతోనిరసన ప్రదర్శననిర్వహించారు. వారంతా నినాదాలుచేస్తూ ప్రభుత్వం యువతకు ఉపాధి కల్పించడంలో ఘోరంగా విఫలం అయిందన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగిత పెరిగిపోతూవస్తోందన్నారు. క్షేత్రస్థాయినుంచి ఉన్నతస్థాయివరకూ ఉన్న ఖాళీలు భర్తీ చేయడంలేదని, యువత కాళ్లరిగేలా తిరుగుతున్నారని పోలీస్, విద్య, సాగునీటిపారుదల, ఆరోగ్యం వంటి శాఖల్లో ఖాళీలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని అన్నారు. కాంగ్రెస్ నేత మాట్లాడుతూ సుమారు 70వేల ఖాళీలు భర్తీ చేయాలని, అవి ఇప్పటికీ భర్తీకాలేదని కేవలం విద్యాశాఖలోనే 70వేల ఖాళీలున్నాయంటే వివిధ శాఖలన్నీ కలిపితే లక్షల్లోనే ఉంటాయన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేల నిరసనపై రాష్ట్ర మంత్రి విశ్వాస్ సారంగ్‌మాట్లాడుతూ అసెంబ్లీ ఆవరణను కాంగ్రెస్ ఎమ్మెల్యేలు దుర్వినియోగం చేస్తున్నారని, ఫోటో సెషన్‌గా మార్చివేసి మీడియా దృష్టిలోపడాలని తాపత్రయ పడుతున్నారన్నారు. ఇలాంటి డ్రామాలు, జిమ్మిక్కులను ప్రజలు ఎంతమాత్రం ఉపేక్షించరని, మీడియా హెడలైన్స్ కోసం తాపత్రయపడుతున్న కాంగ్రెస్ పరిస్థితిచూసి నవ్వుకుంటున్నారని అన్నారు.



# ఉత్తరప్రదేశ్‌లో జిఎస్టీ అధికారి ఆత్మహత్య

## పని ఒత్తిడే కారణమంటూ ఆరోపించిన భార్య

**లక్నో, మార్చి 11:** ఉత్తరప్రదేశ్‌లో జిఎస్టీ డిప్యూటీ కమిషనర్ ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చర్చనీయాంశంగా మారింది. తన భర్త మృతిపై తాజాగా అధికారి భార్య స్పందించారు. పని ఒత్తిడి కారణంగానే ఆయన ప్రాణాలు కోల్పోయారని ఈ వ్యవస్థ తన భర్తను బలి తీసుకుందని ఆరోపించారు. నోయిడాలో కుటుంబంతో కలిసి నివాసముంటున్న జిఎస్టీ డిప్యూటీ కమిషనర్ సంజయ్‌సింగ్ (59) ఘజియాబాద్‌లో పని చేస్తున్నారు. ఆయన ఆత్మహత్యకు పాల్పడ్డారు. తాను ఉంటున్న అపార్ట్‌మెంట్‌లో 14వ అంతస్తు నుంచి కిందకి దూకేశారు. దీంతో



ఆయన ప్రాణాలు కోల్పోయారు. ఆయన అయిదేళ్లుగా క్యాన్సర్‌తో పోరాడుతున్నారని ఈ క్రమంలోనే అధికారి మానసిక కుంగుబాటుకు లోనయ్యారని పోలీసులు తెలిపారు. ఆ బాధే ఆయనను ఆత్మహత్యకు పాల్పడేలా చేసిందని పేర్కొన్నారు. తాజాగా ఆయన సతీమణి మాట్లాడుతూ తన భర్త మరణానికి కారణం క్యాన్సర్ కారణంకాదని, అయితే నా భర్త ఎప్పుడూ పని ఒత్తిడికి గురయ్యేవారన్నారు.

# ఎపిలో కొబ్బరి సాగుకు మద్దతు అవసరం

- లోక్‌సభలో ఎంపి దగ్గుబాటి పురందేశ్వరి

## రాజమహేంద్రవరంలో ప్రత్యేక కొబ్బరి అభివృద్ధి మండలి కార్యాలయం ఏర్పాటుకి వినతి

**విజయవాడ,మార్చి 11,ప్రభాతవార్త ప్రతినిధి:** కొబ్బరిని ఉత్పత్తి చేసే కీలక రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఉన్న నేపథ్యంలో, తూర్పు గోదావరి జిల్లాలో ఒక ప్రత్యేక కొబ్బరి అభివృద్ధి మండలి కార్యాలయం ఏర్పాటు చేయడం అత్యంత అవసరమని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. రాజమండ్రిలో ఈ కార్యాలయాన్ని నెలకొల్పితే రైతులకు ప్రత్యక్ష సహాయం అందుబాటులోకి వస్తుంది కనుక వెంటనే చర్యలు తీసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేసారు. లోక్ సభలో రూల్ 377 కింద స్పీకర్ ప్రత్యేక అనుమతితో ఆమె కొబ్బరి రైతుల సమస్యలను ప్రస్తావించారు. కొబ్బరి ఉత్పత్తి పెంపునకు తోడ్పడడంతో పాటు, గ్రామీణ ప్రజల జీవనోపాధిని ఈ చర్య బలోపేతం చేస్తుందన్నారు. అదేవిధంగా ఎగుమతులను పెంచి రాష్ట్రంలోని వ్యవసాయ అవకాశాలను విస్తరించడానికి కూడా దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని రాజమండ్రిలో కొబ్బరి అభివృద్ధి మండలి కార్యాలయం ఏర్పాటుకు వెంటనే చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ప్రపంచంలో మూడవ అతిపెద్ద కొబ్బరి ఉత్పత్తిదారు భారత్ కాగా, ఆంధ్రప్రదేశ్ నాలుగవ అతిపెద్ద కొబ్బరి సాగు రాష్ట్రంగా ఉందన్నారు. ఏపీలో 1.23 లక్షల హెక్టార్లలో కొబ్బరి తోటలు విస్తరించి ఉన్నాయన్నారు. ముఖ్యంగా కృష్ణా, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో విస్తృతంగా కొబ్బరి సాగు జరుగుతోందని తెలిపారు. కేరళలో కొబ్బరి ఉత్పత్తి ఇప్పటికే సంతృప్త స్థాయికి చేరిన నేపథ్యంలో, ఆంధ్రప్రదేశ్ లోని సారవంతమైన నేల, అనుకూలమైన వాతావరణ పరిస్థితులు కొబ్బరి సాగు విస్తరణకు అద్భుత అవకాశాలను అందిస్తున్నాయని పురందేశ్వరి సభకు వివరించారు. ఇది గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు ఉద్యోగ అవకాశాలను పెంచుతుందన్నారు. 1981లో స్థాపించబడిన కొబ్బరి అభివృద్ధి మండలి రైతులకు సాంకేతిక పద్ధతులు, తెగుళ్ల నివారణ, నాణ్యమైన మొక్కల పెంపకం, ఎరువుల వినియోగంలో సూచనలు వంటి కీలక మార్గదర్శకాలను అందిస్తోంది. అయితే, కొబ్బరి అభివృద్ధి మండలి ప్రధాన కార్యాలయం కేరళలో ఉండటం, ఆంధ్రప్రదేశ్‌కు సమీప ప్రాంతాల్లో ప్రాంతీయ కార్యాలయాలు లేకపోవడంతో, రైతులు సకాల సహాయం పొందడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆమె ఆందోళన వ్యక్తం చేసారు. ఇటీవల తెల్ల నల్లిబూజుల వ్యాప్తితో పాటు, బడ్ రాట్, ఆకు కుళ్లు (లీఫ్ రాట్), తొడిమ రక్తస్రావం (స్టెమ్ బ్లీడింగ్), తాటిపాక వంటి వ్యాధులు కొబ్బరిపై దాడి చేయడంతో రైతులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని లీశి అన్నారు. వీటి నివారణకు అవసరమైన సహాయం, కొబ్బరి చెట్లు ఎక్కే కార్మికులకు బీమా సేవలు, సబ్సిడీలను పొందే అవకాశాలు భౌగోళిక దూరం వల్ల రైతులకు అందుబాటులో లేకుండా పోతున్నాయన్నారు.



క్వాంటమ్ కంప్యూటింగ్ రంగ నిపుణులు, వివిధ శాఖల అధికారులతో సమీక్షలో చంద్రబాబు

# రాష్ట్రంలో క్వాంటమ్ కంప్యూటింగ్ హబ్ : సిఎం చంద్రబాబు

**విజయవాడ మార్చి 11 ప్రభాతవార్త ప్రతినిధి:** నేషనల్ క్వాంటమ్ మిషన్‌కు అనుగుణంగా ఏపీలో అంతర్జాతీయ స్థాయిలో క్వాంటమ్ కంప్యూటింగ్ హబ్ క్వాంటమ్ వ్యాలీని రూపొందించేందుకు టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుచేసి ప్రణాళిక రూపొందిస్తున్నట్లు సీఎం చంద్రబాబు "ఎక్స్" వేదికగా వెల్లడించారు. పారిశ్రామిక దిగ్గజాలు, క్వాంటమ్ కంప్యూటింగ్ రంగ నిపుణులు, వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. ఐఐటీ మద్రాస్ టీసీఎస్, ఐబీఎం సహకారంతో క్వాంటమ్ కంప్యూటింగ్ పరిశోధనకు ఏపీ జాతీయ కేంద్రంగా మారడానికి ప్రతిభావంతులను, పెట్టుబడులను ఆకర్షించడానికి ఈ హబ్ సహాయపడుతుంది. టాటా సన్స్ ఛైర్మన్ నటరాజన్ చంద్రశేఖర్ ఎల్‌అండ్‌టీ ఛైర్మన్ ఎండీ సుబ్రమణ్యన్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం కార్యదర్శి ప్రొఫెసర్ అభయ్ కరండికరల్ డీఎస్‌టీ క్వాంటమ్ టెక్నాలజీ సెంటర్ హెడ్ డాక్టర్ జేబీవీ రెడ్డి ఐఐటీ తిరుపతి డైరెక్టర్ ప్రొఫెసర్ సత్యనారాయణ కలిదిండి, ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కామకోటి ఐబీఎం రీసెర్చ్ ఇండియాడైరెక్టర్ డాక్టర్ అమిత్ సింఘీ ఐబీఎం క్వాంటమ్ ఇండియా లీడర్ వెంకట్ సుబ్రమణియన్‌లతో కీలక సమావేశం నిర్వహించాం అని చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్రంలో వర్క్ ఫ్రం హోంను ప్రోత్సహించాలని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు,రాష్ట్రంలో వర్క్ ఫ్రం హోంతో పాటు నైబర్‌హుడ్ వర్కింగ్, కో-వర్కింగ్ విధానాలపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని "ఎక్స్"వేదికలోనే సీఎం తెలిపారు. వర్క్ ఫ్రం హోం విధానంపై గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది సర్వే చేస్తున్నారు. ఇప్పటికే 82.06 లక్షల మందిని సర్వే చేశారు. మొత్తం 2.68 కోట్ల మంది నుంచి అభిప్రాయాలు సేకరించాలని భావిస్తున్నాం.

వర్క్ ఫ్రం హోం విధానంలో పరిచేసేందుకు అవకాశాలు కల్పించాలని 20.43 లక్షల మంది కోరారు. ఆయా గ్రామాల్లో వర్క్ ఫ్రం హోం సెంటర్ల ఏర్పాటుకు అవకాశమున్న భవనాలపై సర్వే చేస్తున్నాం అని తెలిపారు. మనమిత్ర ద్వారా ప్రభుత్వ సేవలు వాట్సప్ ద్వారా అందుతాయన్న సమాచారం ప్రజలకు చేరాలన్నారు. రాత్రిగస్తీని డ్రోన్‌ల ద్వారా పర్యవేక్షించే పరిస్థితి రావాలని పారిశుద్ధ్య పనుల్లోనూ వాటి వినియోగాన్ని పెంచాలని అధికారులకు సీఎం సూచించారు.

# సివిల్ ప్రొసీజర్ కోడ్‌లో సవరణలపై పరిశీలన: మంత్రి ఫరూక్

**విజయవాడ మార్చి 11 ప్రభాతవార్త ప్రతినిధి:** అద్దెకు ఇంటిని తీసుకునేవారు, యజమాని ఇద్దరూ కలసి ఒప్పంద పత్రాలను న్యాయ స్థానంలో సమర్పించే విధానం అమల్లోకి తెచ్చేందుకు సివిల్ ప్రొసీజర్ కోడ్‌లో సవరణలు తేవడానికి ప్రయత్నిస్తామని రాష్ట్ర న్యాయ, మైనార్టీ శాఖల మంత్రి ఫరూక్ వెల్లడించారు. శాసనసభలో సోమవారం బడ్జెట్ కేటా యింపులపై జరిగిన చర్చలో భాజపా శాసనసభాపక్ష నేత విష్ణుకుమార్‌రాజు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. అద్దెకు తీసుకునే వారు ఇచ్చేవారు షరతులు నిర్ధారించుకుని దానికి అనుగుణంగా న్యాయస్థానంలో సమర్పిస్తే అక్కడ అడ్వాన్స్ డిక్రీని రెండు , మూడు రోజుల్లో ఇస్తారు. దీనికి అనుగుణంగా కాకుండా షరతులు ఉల్లంఘిస్తే ఇరువర్గాలు పోలీసులను ఆశ్రయించి న్యాయం పొందడానికి వీలుంటుంది. ఈ విధానం ప్రస్తుతానికి సివిల్ ప్రొసీజర్ కోడ్‌లో లేదు. దీనిని అమలుచేయాలి అని విష్ణుకుమార్ రాజు కోరారు. దీనిపై మంత్రి స్పందిస్తూ సభ్యుడు చేసిన సూచనను పరిగణలోనికి తీసుకుంటామని వెల్లడించారు. కర్నూలులో హైకోర్టు బెంచ్‌ను ఏర్పాటుచేస్తామని మంత్రి తెలిపారు. ఛాంపియన్స్ ట్రోఫీలో మూడోసారి విజేతగా నిలిచిన భారత క్రికెట్ జట్టుకు రాష్ట్ర ప్రభుత్వం అభినందనలు తెలిపింది. శాసనసభ సోమవారం కొలువుదీరిని వెంటనే సభాపతి అయ్యన్నపాత్రుడు దీనిపై ప్రత్యేక ప్రకటన చేశారు.

# రాజధాని నిర్మాణం 2028 నాటికి పూర్తి

పురపాలక శాఖ మంత్రి నారాయణ



రాజధాని నిర్మాణానికి అయ్యే ఖర్చు 64,721.48 కోట్లని అసెంబ్లీలో వెల్లడి

**విజయవాడ,మార్చి 11,ప్రభాతవార్త ప్రతినిధి:** రాజధాని అమరావతి నిర్మాణం 2028 నాటికి పూర్తి చేస్తామని పురపాలక శాఖ మంత్రి నారాయణ వెల్లడించారు.రాజధాని నిర్మాణానికి అయ్యే ఖర్చు 64,721.48 కోట్లని అసెంబ్లీలో మంత్రి నారాయణ స్పష్టంచేశారు. క్వశ్చన్ అవర్ లో ఎమ్మెల్యే సుజనా చౌదరి అడిగిన ప్రశ్నలకు మంత్రి నారాయణ సమాధానం చెప్పారు. అమరావతి గవర్నమెంట్ కాంప్లెక్స్(ఏజీసీ)లో ఇళ్లు, భవన నిర్మాణాలు, ట్రంక్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్, ఎల్పీఎస్ మౌళిక సదుపాయాల అభివృద్ధి కోసం 64,721.48 కోట్లు ఖర్చవుతుందన్నారు. ఈ నిధులను వివిధ రూపాల్లో సేకరించి అమరావతి నిర్మాణం చేపడుతున్నట్లు మంత్రి నారాయణ వివరించారు, కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రాంటులను పొందడం ద్వారా నిధుల సేకరించనున్నట్లు తెలిపారు. రైతులకు అభివృద్ధి చేసిన ప్లాట్లను దశల వారీగా మూడేళ్లలో అప్పగించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టంచేశారు. 201924 మధ్య విధానపరమైన అనిశ్చితుల కారణంగా ఈ ప్రక్రియలో జాప్యం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మీద నమ్మకంతో 58 రోజుల్లోనే 34 వేల ఎకరాలు రైతులు ప్రభుత్వానికి ఇచ్చారని గుర్తుచేశారు. ప్రపంచంలోని టాప్5లో ఒకటిగా ఉండాలని సీఎం చంద్రబాబు రాజధానిని డిజైన్ చేశారని నారాయణ స్పష్టంచేశారు. భూములు అమ్మడం ద్వారా, అలాగే జాతీయ, అంతర్జాతీయ మార్కెట్ లో తక్కువ వడ్డీకి లోన్ తీసుకోవడం ద్వారా మిగిలిన నిధులు సమీకరిస్తామని మంత్రి స్పష్టం చేశారు. అమరావతిలో 106 ప్రభుత్వ, ప్రభుత్వేతర రంగ సంస్థలు తమ కార్యాలయాలు ఏర్పాటుచేసేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. అమరావతిలో మెయిన్ రోడ్లు 165 అడుగులు, 185 అడుగులతో రెండేళ్లలో పూర్తి చేస్తామని, ఎల్పీఎస్ రోడ్లు మూడేళ్లలో పూర్తి చేస్తామని వెల్లడించారు. సగానికి పైగా నిర్మాణం జరిగిన అధికారుల భవనాలు ఏడాదిన్నరలో, మిగతావి రెండేళ్లు, అసెంబ్లీ, సెక్రటేరియట్, హైకోర్టు నిర్మాణాన్ని మూడేళ్లలో పూర్తి చేస్తామని తేల్చిచెప్పారు. 201419 మధ్యలో అమరావతిలో 131 సంస్థలకు 1277 ఎకరాలు కేటాయించామన్నారు. గత ఐదేళ్లలో జరిగిన పరిణామాలతో కొన్ని సంస్థలు వెనక్కి వెళ్లిపోయాయని ఆక్షేపించారు. అమరావతి నిర్మాణానికి 30 వేల ఎకరాలు కావాలని జగన్ ఇదే అసెంబ్లీ సాక్షిగా చెప్పారన్నారు.



# చిన్నారులపై అఘాయిత్యాలకి పాల్పడితే కఠిన శిక్షలు

## డిజీపీ హరీష్ కుమార్ గుప్తా

**విజయవాడ,మార్చి 11,ప్రభాతవార్త ప్రతినిధి:** మహిళలు, చిన్న పిల్లలపై అఘాయిత్యాలకి పాల్పడిన కేసులలో దర్యాప్తు వేగవంతం చేసి న్యాయస్థానాల ద్వారా కఠిన శిక్షలు విధించడం జరుగుతుందని రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఐపిఎస్ తెలిపారు. మహిళలు, చిన్నారులపై జరిగే దాడులను ఉక్కుపాదంతో అణచివేస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. విజయనగరం జిల్లా పరిధిలో చిన్నారులపై జరిగిన అఘాయిత్యాల కేసుల్లో నిందితులకు 3 నెలల నుండి 6 నెలల లోపే శిక్షలు ఖరారు చేయడంలో విజయం సాధించిన విజయనగరం పోలీసులను ఈ సందర్భంగా డీజీపీ అభినందించారు. మహిళలు, పిల్లలపై నేరాలకు పాల్పడే వారు శిక్షల నుండి తప్పించుకోలేరని అన్నారు. మహిళలు, చిన్నారులపై నేరాలను నివారించడానికి ఐజీ ర్యాంకు అధికారి నేతృత్వంలో "వుమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ వింగ్" ను ఏర్పాటు చేసినట్లు ఈ సందర్భంగా తెలిపారు. రాష్ట్రంలో మహిళలు, చిన్నారుల భద్రతకు"శక్తి" యాప్ ను అందుబాటులోకి తేవడం జరిగిందన్నారు. ఈ శక్తి యాప్ కు పలు అదునాతన ఫీచర్ లను జోడించడం జరిగిందన్నారు.


ఆపదలో ఉన్న మహిళలు టోల్ ఫ్రీ నంబర్స్ 181, 112, 1098,1093 కు కాల్ చేసినా లేదా మొబైల్లో ఉన్న శక్తి యాప్ లో గల"ఎస్ఓఎస్" మీట నొక్కినా లేదా ఫోనును అటూ, ఇటూ గట్టిగా ఊపినా కంట్రోల్ రూమ్ కి సమాచారం వెళ్లి నిమిషాల వ్యవధిలోనే శక్తి టీమ్స్ సంఘటనా స్థలానికి చేరుకుని రక్షణగా నిలుస్తాయని తెలిపారు.

బహిరంగ ప్రదేశాల్లో మహిళలు, పిల్లలపై వేదింపులు అరికట్టడం,

నేరాలను నిరోధించడమే లక్ష్యంగా శక్తి టీమ్స్ పనిచేస్తాయి అని అన్నారు. ఆంధ్రప్రదేశ్ పోలీసులు బాధితులకు తక్షణ న్యాయం అందించేందుకు కేసుల విచారణ, వేగవంతంపై ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందన్నారు.

# వృద్ధుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- మంత్రి డోలా వీరాంజనేయస్వామి



**విజయవాడ, మార్చి11, ప్రభాత వార్తప్రతినిధి:** వయో వృద్ధుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కటుబడి ఉందని మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి పేర్కొన్నారు. శాసన సభలో వయో వృద్ధుల సంక్షేమంపై ఎమ్మెల్యేలు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. వృద్ధాప్య పింఛన్లు, వృద్ధాశ్రమాలు, ఆరోగ్య సంరక్షణ, రవాణా సౌకర్యాలు, పరికరాలు ఉపకరణాల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రభుత్వం రెండు వృద్ధాశ్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్జీవోఎస్ ఆధ్వర్యంలో 25, పలు ప్రైవేట్ సంస్థల ఆధ్వర్యంలో మరో 119 వృద్ధాశ్రమాలు ఉన్నట్లు తెలియజేశారు. 2024- 25 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి కొత్తగా 12 వృద్ధాశ్రమాలు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు.గత ప్రభుత్వ వృద్ధుల సంక్షూమాన్ని పూర్తి నిర్లక్ష్యం చేసిందన్నారు.సీఎం చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే పెన్షన్ మొత్తాన్ని రూ.నాలుగువేలకు పెంచిందన్నారు.గత ఏడాది ఏప్రిల్ నెల నుంచి అమలు చేస్తూ ప్రభుత్వం అధికారంలోకి రాగానే లబ్దిదారులకు రూ.7వేలు అందించిన ఘనత తమ ప్రభుత్వానిదన్నారు.ఎన్ని ఇబ్బందులున్నా సంక్షేమ కార్యక్రమాలను ఆపేదే లేదని సీఎం చంద్రబాబు స్పష్టం చేసారు.విద్యార్థుల సంక్షేమ వసతి గృహాలను ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు.వారికి కనీస సౌకర్యాలు కల్పించలేదన్నారు.

# రైతులకు సత్వర న్యాయం జరగాలి

## అమరావతి నిర్మాణం పై అసెంబ్లీలో ఎమ్మెల్యే సుజనా చౌదరి

**విజయవాడ,మార్చి 11,ప్రభాతవార్త ప్రతినిధి:** రాజధాని అమరావతి కోసం భూములు ఇచ్చిన రైతులకు పూర్తిస్థాయిలో న్యాయం చేకూర్చి వారిని ఆదుకోవాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందని విజయవాడ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు యలమంచిలి సత్యనారాయణ (సుజనా చౌదరి) అన్నారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో మంగళవారం ఎమ్మెల్యే సుజనా చౌదరి మాట్లాడారు. 2014 నుంచి 2019 వరకు అమరావతి నిర్మాణం పరుగులు పెట్టిందన్నారు. ఆ తర్వాత వచ్చిన వై సీ పీ అరాచక పాలన సృష్టించి అమరావతిని విధ్వంసం చేసిందన్నారు. మూడు రాజధానులను తెర మీదకు తెచ్చి అమరావతిని విచ్ఛిన్నం చేయడంతో పాటు రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసిందన్నారు. మూడు రకాల పంటలు పండే భూములను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును నమ్మి 33 వేల ఎకరాల భూములను ఇచ్చిన రైతులను వైసీపీ అనేక వేధింపులకు గురి చేసిందన్నారు. విభజన చట్టం ప్రకారం అమరావతి ఏర్పాటు అయిందని పార్లమెంట్ సాక్షిగా కేంద్రం ప్రకటన చేసిన కూడా వైసీపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని తుంగలో తొక్కిందన్నారు. శాసనసభ సాక్షిగా వైయస్ జగన్మోహన్ రెడ్డి అమరావతి రాజధానిగా కొనసాగుతుందని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత మూడుముక్కలాటలాడారన్నారు. అమరావతి రైతుల అర్తనాధాలను వాళ్ల దయనీయ పరిస్థితిని చూసి వారందరికీ అండగా నిలబడటంతో పాటు న్యాయస్థానాలను ఆశ్రయించడం జరిగిందన్నారు. రాజధానిని ఒక్క అంగుళం కూడా ముందుకు కదలనివ్వకుండా రైతుల పక్షాన నిలబడి అనేక పోరాటాలు చేసామన్నారు. అమరావతిని భవిష్యత్తులో ఎవరూ కదిలించలేని విధంగా సి అర్ డి ఎ చట్టాన్ని రద్దుచేసి రే రా చట్టంగా మార్చడానికి ప్రభుత్వం జీవో తీసుకు రావాలన్నారు. ఇప్పటివరకు రైతులకు జరిగిన నష్టాన్ని ఏ విధంగా భర్తీ చేస్తారో చెప్పాలని సుజనా ప్రశ్నించారు.సుజనా చౌదరి ప్రశ్నకి మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ బదులిచ్చారు.. రాజధాని నిర్మాణం ముందుకు సాగక పోవడానికి గత ప్రభుత్వ నిర్వాకమేనని చెప్పారు.. రాబోయే మూడు సంవత్సరాల్లో రాజధాని నిర్మాణ పనులను పూర్తి చేస్తామని, దానికి సంబంధించిన ఆర్థిక వనరుల సమీకరణ వివరాలను తెలిపారు.. ప్రపంచ బ్యాంకు, ఎడిబి తో పాటు హడ్కో, ఇతర అంతర్జాతీయ ఆర్థిక సంస్థల సాయంతో దాదాపు 64 వేల కోట్ల రూపాయల అంచనాల తో నిర్మాణం పూర్తి చేస్తామన్నారు.. రోడ్లు, అధికారుల, ప్రజాప్రతినిధుల భవన సముదాయాలు, ఇతర మౌలిక సదుపాయాలను దశల వారీగా పూర్తి చేస్తామని వివరించారు.. రాజధాని విషయంలో దాష్టీకాలు, దారుణాలకు పాల్పడ్డ వారి పై చట్టపరమైన చర్యలు ఉంటాయని తెలిపారు.

అమరావతి రాజధాని అంశం పై సుధీర్ఘ చర్చ కూడా అవసరమని పేర్కొన్నారు..సుజనా చౌదరి మంచి ప్రశ్న అడిగారని స్పీకర్ అయ్యన్న పాత్రుడు కొనియాడారు..

అయితే ఈ అంశం పై సమయం చూసి ఈ సమావేశాల్లోనే చర్చ పెడతామని స్పీకర్ అన్నారు.

# దుర్గమ్మ సేవలో కేంద్ర ఐఎఎస్ అధికారుల బృందం



కేంద్ర బృందానికి దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

**ఇంద్రకీలాద్రి, మార్చి 11, ప్రభాత'వార్త' :** అమ్మలగన్న అమ్మ బెజవాడ దుర్గమ్మవారిని మంగళవారం కేంద్ర ప్రభుత్వ ఐఎఎస్ అధికారులు వందన గుర్‌నాని, శ్వేతమొమంతి, యశశ్వి ముండ్, గాయత్రి పాండే లు దర్శించుకున్నారు. అనంతరం వారికి దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం లను అందించారు. వేదపండితులు వేదాశీర్వచనం పలికారు.

# అలిపిరిలో చలువ పందిళ్లు

**తిరుమల,మార్చి 11ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థం తిరుమలకు వచ్చే దేశవిదేశాల భక్తులకు అలిపిరి తనిఖీ కేంద్రం వద్ద నిరీక్షించేందుకు వీలుగా చలువపందిళ్ళు ఏర్పాటుచేశారు. తిరుమలకు అలిపిరి తనిఖీ కేంద్రం ప్రధాన ప్రవేశద్వారం. ఇక్కడ వాహనాలను, భక్తుల లగేజీలను తనిఖీ చేసుకుని ఆ తరువాత తిరుమలకు రావాలి. తనిఖీ కేంద్రం వద్ద వాహనాలు, ఆర్టీసి బస్సులు దిగిన భక్తులు కొంత సమయం వేచివుండాల్సి వస్తుంది. ఇందుకు ఎండకు ఇబ్బంది లేకుండా చలువపందిళ్ళను టిటిడి ఇంజనీరింగ్ అధికారులు ఏర్పాటుచేశారు. రోజూ 60వేలమంది భక్తులు తిరుమలకు వస్తున్నారు. గత వారంలో అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి అలిపిరి తనిఖీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆసమయంలో భక్తులు అక్కడ సమస్యలు, ఇబ్బందులు ఆయన దృష్టికి తీసుకెళ్ళారు. దీంతో అక్కడ భక్తులకు నిరీక్షణకోసం చలువపందిళ్ళు ఏర్పాటుచేశారు.

# బిజెపి ప్రభుత్వం వచ్చాక ప్రజలకు చేసిందేమీలేదు

## మాజీ ఎంపి చింతా మోహన్




**కావలి, (నెల్లూరు)మార్చి11 ప్రభాతవార్త :** భారతదేశంలో బిజెపి ప్రభుత్వంవచ్చాక పేదప్రజలకు చేసిందేమీలేదని, ఈవీఎంల ట్యాంపరింగ్‌తోనే ఈ దేశంలో బిజెపి చలామణి అవుతుందని కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపి చింతామోహన్ సంచలనవ్యాఖ్యలు చేశారు. కావలి పట్టణం రైల్వేరోడ్డులోని జర్నలిస్ట్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ 11 సంవత్సరాలలో పేదప్రజలకు చేసిందేమీలేదన్నారు. 10వేల డ్రస్సులు కుట్టించుకుని నాలుగుపూట్ల బట్టలుమారుస్తూ చలామణి అవుతున్నారన్నారు. ఆయన బట్టల ఖరీదు 100కోట్ల రూపాయలు అవుతుందన్నారు. అది ప్రజల సొమ్మని ఆయన దుయ్యబట్టారు. కాంగ్రెస్‌పార్టీ అధికారంలో ఉన్నపుడు పేదప్రజలకోసం ఎన్నో సంస్కరణలు తెచ్చిందన్నారు. ఉపాధిహామీ, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్లు, ఓబిసి రిజర్వేషన్లు తెచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వందేనన్నారు. అలానే దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పవనాలు వీస్తున్నాయన్నారు. ప్రజలు కాంగ్రెస్‌పార్టీపట్ల సానుభూతి వ్యక్తం చేస్తున్నారన్నారు. రానున్న జెమిలి ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల్లో అధికారం చేపడుతుందన్నారు. అలాగే జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్షహోదా అడగడంలో తప్పులేదని ఆయన తండ్రి రాజశేఖర్‌రెడ్డిపేరును అడ్డంపెట్టుకుని వేలకోట్లు సంపాదించారని తెలిపారు. గత 5 సంవత్సరాలలోకూడా డబ్బే సంపాదనే ధ్యేయంగా జగన్‌రెడ్డి పనిచేశారన్నారు. ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్లను మూసివేసి ఆ నిధులను దుర్వినియోగం చేసిన ఘనతకూడా జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. టిడిపి అధినేత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మితిమీరిన హామీలిచ్చి అమలుపరచలేక ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. మందుబాబుల డబ్బులతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక విమానాల్లో విహరిస్తూ ప్రజల డబ్బును దుర్వినియోగం చేస్తున్నారన్నారు. ఆయన ఇచ్చిన హామీలకు మహిళలు ఉచితబస్సు కోసం ఎదురుచూస్తున్న పరిస్థితి దాపురించిందన్నారు. అలాగే, అమరావతి రాజధానికి 60వేలకోట్లరూపాయలు ఖర్చుపెడతామని చెప్పడం ఏమిటన్నారు. మిగతా జిల్లాల పరిస్థితి ఏమిటని ఆయన ప్రశ్నించారు.

# ఎన్నికల ప్రక్రియ మరింత బలోపేతానికి శ్రీకారం

## - జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల నుంచి భారత ఎన్నికల సంఘం సలహాలు, సూచనలకు ఆహ్వానం : ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్

**తిరుపతి కలెక్టరేట్, మార్చి 11 ప్రభాతవార్త :** భారత రాజ్యాంగ చట్టాలకు అనుగుణంగా ఎన్నికల ప్రక్రియ బలోపేతం చేయడంలో భాగంగా భారత దేశంలోని జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల నుంచి భారత ఎన్నికల సంఘం సలహాలు, సూచనలు ఆహ్వానిస్తున్నట్లు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. చట్టపరమైన పద్ధతిలో ఎన్నికల ప్రక్రియలను మరింత బలోపేతం చేయడానికి పరస్పర చర్చ కోసం పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకలను ఎన్నికల సంఘం ఆహ్వానిస్తోంది. ఓటరు నమోదు అధికారి, జిల్లా ఎన్నికల అధికారి, ముఖ్య ఎన్నికల అధికారి స్థాయిలో ఏవైనా పరిష్కరించబడని సమస్యల కోసం ఏప్రిల్ 30, 2025 నాటికి అన్ని జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల నుంచి భారత ఎన్నికల సంఘం సలహాలు సూచనలను ఆహ్వానించింది. ఈ రోజు రాజకీయ పార్టీలకు జారీ చేసిన వ్యక్తిగత లేఖలో, కమిషన్ ఏర్పాటు చేసిన చట్టానికి అనుగుణంగా ఎన్నికల ప్రక్రియలను మరింత బలోపేతం చేయడానికి పరస్పర అనుకూలమైన సమయంలో పార్టీ అధ్యక్షులు, పార్టీ సీనియర్ నాయకులతో పరస్పర చర్చలను ఆశిస్తోంది. ఇది వరలో గత వారం భారత ఎన్నికల సంఘం కాన్ఫెరెన్స్ సందర్భంగా ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ అన్ని రాష్ట్రాలు,యూనియన్ టెర్రిటరీల ముఖ్య అధికారులు, ఓటరు నమోదు అధికారులను రాజకీయ పార్టీలతో క్రమం తప్పకుండా పరస్పర చర్యలు జరపాలని, అటువంటి సమావేశాలలో అందిన ఏవైనా సూచనలను చట్టపరమైన పద్ధతిలో ఖచ్చితంగా పరిష్కరించాలని, మార్చి 31, 2025 లోగా కమిషన్‌కు చర్య తీసుకున్న నివేదికను సమర్పించాలని ఆదేశించారు. రాజ్యాంగం, ఎన్నికల ప్రక్రియ యొక్క అన్ని అంశాలను చట్టబద్ధమైన పద్ధతి ప్రకారం కమిషన్ గుర్తించిన 28 వాటాదారులలో రాజకీయ పార్టీలు కీలకమైన వాటాదారులలో ఒకటి. కమిషన్ రాజకీయ పార్టీలకు లేఖలో ప్రజా ప్రాతినిధ్యం చట్టం 1950, 1951 ఓటర్ల నమోదు నియమాలు 1960, ఎన్నికల నియమాల ప్రవర్తన, 1961 గౌరవ సుప్రీంకోర్టు ఆదేశాలు, భారత ఎన్నికల సంఘం ఎప్పటికప్పుడు జారీ చేసే సూచనలు, మాన్యువల్‌లు, హ్యాండ్‌బుక్‌లు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలను నిర్వహించడానికి వికేంద్రీకృత బలమైన, పారదర్శక చట్టపరమైన పద్ధతిలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

# బేగంపేట ఎయిర్‌పోర్టు వద్ద అండర్‌గ్రౌండ్ టన్నెల్ నిర్మాణం

**హైదరాబాద్, మార్చి 11, ప్రభాతవార్త:** హెచ్ఎండిఎ మరో కీలకమైన భారీ ప్రాజెక్టు నిర్మాణం చేసేందుకు సిద్ధమైంది. పారడైస్ నుంచి డెయిరీ ఫాం మీదుగా ఎన్‌హెచ్ 44లో నిర్మిస్తున్న భారీ ఫ్లైఓవర్‌కు కనెక్ట్ కానుంది. ఈ రహదారి నుంచి కేవలం 30 నిమిషాల వ్యవధిలో పారడైస్ నుంచి మేడ్చల్‌కు వెళ్లే విధంగా ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. పారడైస్ జంక్షన్ నుంచి డెయిరీ ఫాం రోడ్ కనెక్టివిటీ అయ్యే ఈ ప్రాజెక్టుకు హెచ్ఎండిఎ త్వరలోనే టెండర్లు పిలువనున్నారు. మొత్తం 5.40 కిలోమీటర్ల మేర ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం సాగనుంది. అదేవిధంగా బేగంపేట వద్ద అండర్‌గ్రౌండ్ టన్నెల్ నిర్మాణం సాగనుంది. సికింద్రాబాద్, తాడ్‌బండ్ జంక్షన్, బోయిన్‌పల్లి జంక్షన్ మీదుగా నిర్మాణం సాగనుంది. ఈ కారిడార్ 5.400 కిలోమీటర్ల నిర్మాణం సాగనుండగా, ఈ కారిడార్ లెంత్ 3.050 కిలోమీటర్లు, బేగంపేట వద్ద అండర్‌గ్రౌండ్ టన్నెల్ 0.600 కిలోమీటర్ల మేర సాగనుంది.

# సుంకాల తగ్గింపుపై యుఎస్‌కు ఎలాంటి హామీ ఇవ్వలేదు:కేంద్రం

**న్యూఢిల్లీ, మార్చి 11:** అమెరికా నుంచి వచ్చే దిగు మతులపై సుంకాల తగ్గింపునకు భారత్ అంగీ కరించిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ ప్రకటిస్తే భారత్‌ప్రభుత్వం మాత్రం సుంకాల తగ్గింపునకు ఎలాంటి హామీ ఇవ్వలేదని స్పష్టం చేసింది. ట్రంప్ రెండోసారి అదికారంలోకి వచ్చినప్పటినుంచి మిత్రులు,శత్రువులు అని తేడా లేకుండా పలు దేశాలపై సుంకాలమోత మోగిస్తున్నారు. భారత్ తమ వస్తువులపై భారీగా సుంకాలు విధిస్తోందని ఆరోపించిన ఆయన వచ్చేనెల రెండోతేదీనుంచి తమ ప్రతీకార సుంకాలు ప్రారంభం అవుతాయని కూడా చెప్పారు. ఇటీవలే మరోసారి ఇదే అంశంప్రస్తావించిన ట్రంప్ భారత్ అత్యధికంగా సుంకాలు వసూలుచేస్తోందని ఆదేశంలో ఏవస్తువు విక్రయించడానికి వీలులేనంత భారంగా ఉన్నాయన్నారు. భారత్‌చర్యలను తాము బహిరంగపరచడంవల్ల సుంకాలను తగ్గించడానికి ఆదేశం అంగీకరించిందని వెల్లడించారు. అయితే భారత్ స్పందిస్తూ సుంకాల తగ్గింపుపై అమెరికాకు ఎలాంటి హామీ ఇవ్వలేదు. అమెరికా అధ్యక్షుడు పదేపదే లేవనెత్తుతున్న ఈసమస్య పరిష్కారానికి సెప్టెంబరువరకూ సమయం కోరాం అని పార్లమెంటరీ ప్యానెల్‌కు భారత ప్రభుత్వం వెల్లడించింది.




కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మకు జ్ఞాపికను అందజేస్తున్న దృశ్యం

# అభివృద్ధి దిశగా దత్తత గ్రామం కొండపర్తి

### రోల్ మోడల్‌గా నిలవాలి: గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

### మహిళల ఆర్థికాభివృద్ధికి చిన్నచిన్న పరిశ్రమలు ఏర్పాటు

**ములుగు, ప్రభాతవార్త:** దేశానికి రోల్ మోడల్ గా కొండపర్తి గ్రామం నిలవాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ తెలిపారు. మంగళవారం ములుగు జిల్లా పర్యటనలో భాగంగా ఎస్ ఎస్ తాడ్వాయి మండలం కొండపర్తి గ్రామంలో రాష్ట్ర గవర్నర్ పర్యటించారు. తొలుత కొమరం భీం, బిర్సా ముండ విగ్రహాలను, పాఠశాలలో డిజిటల్ తరగతులను, అంగన్వాడీ కేంద్రాన్ని, రూ.7,84,700 ల వ్యయంతో నిర్మించిన మసాలా యూనిట్, రూ.7,76,594 వ్యయంతో కుట్టు మిషన్ యూనిట్ ను ప్రారంభించారు. అనంతరం రిమోట్ తో వ్యవసాయ మోటార్లు ప్రారంభించారు.

**రోల్ మోడల్‌గా కొండపర్తి గ్రామం**

గవర్నర్ పర్యటనలో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో గవర్నర్ మాట్లాడుతూ.. ఈ గ్రామంలో 70 గృహాలు 285 మంది ప్రజలు ఉన్నారని, చిన్న గ్రామమని అభివృద్ధిలో ఆదర్శంగా నిలవాలని ఆయన పేర్కొన్నారు. సమాజాభివృద్ధికి మన సేవలు ఎంతో అవసరం అని పేర్కొన్నారు. అటవీ ప్రాంతంలో ఉన్న ఈ గ్రామంలో డిజిటల్ తరగతులు ప్రారంభించుకోవడం ఎంతో సంతోషమని ఆయన అన్నారు. విద్యార్థులు ఇంగ్లీషు బాగా మాట్లాడుతున్నారని ఆయన తెలిపారు. కొండపర్తి గ్రామంలో మహిళల ఆర్థికాభివృద్ధికి చిన్న చిన్న పరిశ్రమలు ఏర్పాటు ఆవశ్యకత ఉందని తెలిపారు. స్వయం ఉపాధి యూనిట్ల ద్వారా ఆర్థికాభివృద్ధి సాధన జరుగుతుందని తెలిపారు. గుజరాత్ రాష్ట్రంలో అమూల్ ఏవిధంగా ప్రసిద్ధిగాంచిందో అదే తరహాలో కొండపర్తి గ్రామం కారం, పసుపు, మసాలా, యూనిట్లకు అంతటి పేరు ప్రఖ్యాతలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ ప్రాంతంలో మిర్చి సాగు బాగుందని, ఇక్కడ తయారయ్యే కారానికి మంచి రావాలని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ వ్యాప్తంగా ఇక్కడ తయారైన కారానికి బాగా మంచి గుర్తింపు రావాలని ఆయన సూచించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వికసిత్ భారత్ సంకల్పానికి ఈ గ్రామం ఆదర్శంగా నిలవాలని పిలుపు పిలుపునిచ్చారు. మారుమూల ప్రాంతమైన కొండపర్తి గ్రామాన్ని తాను దత్తత తీసుకున్నానని,ఈ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తయారు చేయుటకు ఆదివాసి మారుమూల గ్రామాల్లో పర్యటిస్తున్నట్లు తెలిపారు. తాను రాష్ట్రంలో ఏడు ఆదివాసి గ్రామాలను దత్తత తీసుకున్నానని అన్ని గ్రామాలను అభివృద్ధిలో ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దుటకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో కోటి 50 లక్షల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులు ప్రారంభించినట్లు తెలిపారు.ఆదివాసీల అభివృద్ధికి తాను, రాష్ట్ర ప్రభుత్వం,జిల్లా యంత్రాంగం కృషి చేస్తున్నట్లు తెలిపారు.చిన్న పరిశ్రమలు ఏర్పాటు ద్వారా ఆదాయం సమకూరుతుందని తద్వారా ఆదివాసులు ఆర్థికాభివృద్ధి సాధిస్తారని పేర్కొన్నారు.తాను, రాష్ట్రపతి, రాష్ట్ర మంత్రి సీతక్క అందరూ ఆదివాసి బిడ్డలమని ఆయన పేర్కొన్నారు. దేశానికి కొండపర్తి గ్రామం మోడల్ గా కావాలని పేర్కొన్నారు. మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, ఎస్పీ శబరీష్, గ్రామస్తులు తదితరులు గవర్నర్ ను ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందించారు.




సమావేశంలో మాట్లాడుతున్న రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

# రోడ్డుప్రమాదాల్లో మరణాలు తగ్గించేలా పనిచేయాలి

### రవాణా శాఖకు మంచి పేరు తీసుకురావాలి

### ఎంవిఐల శిక్షణ తరగతుల్లో మంత్రి పొన్నం ప్రభాకర్

### జూలై 9 వరకు కొనసాగనున్న శిక్షణ

**హైదరాబాద్, మార్చి 11, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొత్తగా నియమితులైన అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్(ఏఎంవిఐ)లు రోడ్డు ప్రమాదాల్లో మరణాలు తగ్గించేలా పనిచేయాలని రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. కొత్తగా నియమితైలన ఏఎంవిఐలు రవాణా శాఖకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కొత్తగా నియమితులైన ఏఎంవిఐలకు మంగళవారం నుంచి హైదరాబాద్‌లోని రాజా బహుదూర్ వెంకట రామిరెడ్డి తెలంగాణ పోలీస్ అకాడమీలో శిక్షణ తరగతులను మంత్రి పొన్నం ప్రారంభించారు. తెలంగాణ పోలీస్ అకాడమీలో జూలై 9 వరకు శిక్షణ కార్యక్రమాలు కొనసాగనున్నాయి. కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌తోపాటు రవాణా శాఖ కమిషనర్ సురేంద్ర మోహన్, తెలంగాణ పోలీస్ అకాడమీ డెరైక్టర్ శ్రీనివాస్ రావు, డిప్యూటీ డెరైక్టర్ నర్మదా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ నూతనంగా ఎంపికై నియామకాలు పొంది రవాణా శాఖకు గొప్ప పేరు తేవాలని .. శిక్షణ పొందడానికి వచ్చిన ఏఎంవిఐలకు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్‌లో సమర్థవంతంగా పనిచేసి రవాణా శాఖకి పేరు తేవడానికి ఈ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. గతంలో నెల రోజుల పాటు శిక్షణ ఉండేదని.. ఇప్పుడు 4 నెలల పాటు ఈ శిక్షణ ఉంటుందన్నారు. ఫీల్డ్‌లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమర్థవంతంగా పని చేయడానికి ఈ శిక్షణ ఉపయోగపడుతుందని.. రవాణా శాఖ గౌరవాన్ని కాపాడుతుందన్నారు. ఉద్యోగం పొందినప్పుడు ఎలా ఉంటారో ..దానినే ఎప్పటికీ కంటిన్యూ చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల్లో మరణాలు తగ్గించేలా పని చేయాలని మంత్రి పొన్నం సూచించారు. ఫిట్‌నెస్ ఉందా? లేదా? డ్రైవింగ్ లైసెన్స్ ఇస్తున్నమా? లేదా? అనే విధంగా పని చేయవద్దన్నారు. శిక్షణ ద్వారా ప్రేమ ఆప్యాయత, కాఠిన్యత ఉండాలన్నారు. రవాణా శాఖ మంచి పేరు తీసుకురావాలని.. రవాణా శాఖకి మొదటిసారి లోగో తయారు చేశామన్నారు. మీకు కూడా వాహనాలు వస్తున్నాయని.. దానిపై డిపార్ట్‌మెంట్ లోగో ఉంటుందన్నారు.

# డ్రగ్స్, గంజాయి నిర్మూలనమే ఏకైక లక్ష్యంగా పనిచేయాలి

### ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి

**హైదరాబాద్, మార్చి 11, ప్రభాతవార్త :** ఎక్సైజ్ శాఖలో పనిచేసి యంత్రాంగం రెవెన్యూ టార్గెట్లను పూర్తి చేస్తూ.. డ్రగ్స్, గంజాయి, నాన్‌డ్యూటి పెయిడ్ లిక్కర్, నాటుసారాను నిర్మూలన కోసం నిరంతరం కృషి చేయాలని ఎక్సైజ్ ఎన్ ఫోర్స్‌మెంట్ డెరెక్టర్ వి.బి. కమలాసన్‌రెడ్డి అన్నారు.అబ్కారీ భవన్‌లో మంగళవారం తెలంగాణలోని వివిధ భాగాల్లో ప్రతిభ కనబరిచిన వారికి ఆయన క్యాష్ రివార్డులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్సైజ్ శాఖ బాగా పనిచేయడానికి, గంజాయి.డ్రగ్స్‌ను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. కేసుల నమోదు, నేరాలకు పాల్పడుతున్న వారికి శిక్షణపడేలా కేసులను తయారీ చేయాలన్నారు. అంతకు ముందు ఆయన 14 కేసుల్లో శిక్షలు పడే విధంగా చొరవ తీసుకున్న 15 మందికి, డ్రగ్స్,గంజాయిని పట్టుకున్న 33మందికి క్యాష్ రివార్డులతో పాటు,మెదక్ సంగారెడ్డిలో 200 కేజీల గంజాయిని పట్టుకున్న 12మందికి ప్రశంస పత్రాలతోపాటు క్యాష్ రివార్డులను అందించారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ ఖురేషి, మెదక్, రంగారెడ్డి, వరంగల్, నల్లగొండ డిప్యూటీ కమిషనర్లు జె.హరి కిషన్, పి.దశరథ్, జి.అంజన్‌రావు, ఎ.శ్రీనివాసరెడ్డి ఎన్‌ఫోర్స్ మెంట్ అసిస్టెంట్ కమిషనర్ ప్రణవి,రంగారెడ్డి, ఖమ్మం, మెదక్ జిల్లా అసి స్టెంట్ కమిషనర్లు ఆర్.కిషన్, జి.గణేష్, జి.శ్రీనివాసరెడ్డి, ఖమ్మం, సంగారెడ్డి, సిద్దిపేట డిసిఇఐలు నరేందర్‌రెడ్డి, ఎస్.నవీన్‌చంద్ర, శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.


# స్కాలర్‌షిప్ బకాయిలు 20వ తేదీలోగా చెల్లించకపోతే సెమిస్టర్ పరీక్షల బహిష్కరణ

### ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రికి

### ప్రైవేటు డిగ్రీ, పిజి కాలేజీల యాజమాన్యాల లేఖలు

**హైదరాబాద్, మార్చి 11, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న డిగ్రీ, పీజీ విద్యార్థుల ఫీజు బకాయిలను వెంటనే చెల్లించాలని తెలంగాణ పీజీ, డిగ్రీ కాలెజెస్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(టిపిడిఎంఏ) డిమాండ్ చేసింది. ఈ నెల 20లోపుగా బకాయిలను చెల్లించకపోతే సెమిస్టర్ పరీక్షలను నిర్వహించకుండా బైకాట్ చేస్తామని అసోసియేషన్ ప్రకటించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితోపాటు, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకి లేఖ రాసినట్టు అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ సూర్యనారాయణ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి యాద రామకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్స్ పరమేశ్వర్, శ్రీధర్‌రావ్ కోశాధికారి శంకర్‌లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాలుగా 16 నెలలుగా తమరికి విన్నవిస్తూ.... మా ఆర్థిక ఇబ్బందులను మీరు చెల్లించవలసిన ఆర్‌టిఎఫ్‌లను చెల్లించాలని కోరారు. ఉప ముఖ్యమంత్రి మూడు పర్యాయాలు సమావేశం నిర్వహించి, ఫీజు బకాయిలను విడుదల చేపిస్తానని హామీ ఇచ్చిన నేపథ్యంలో ఆందోళన విరమింప చేసినట్టు తెలిపారు. కానీ ఇప్పటివరకు కనీసం 20 శాతం కూడా ఫీజు బకాయిలు విడుదల చేయలేదని.. కొన్ని కాలేజీలకైతే వన్ పర్సెంట్ కూడా విడుదల చేయలేదన్నారు.

తాము ఆర్థిక భారంతో అప్పుల బాధతో కళాశాలలు నిర్వహించలేని పరిస్థితుల్లో ఎంతో ఆందోళనకు గురవుతున్నట్టు చెప్పారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ కళాశాలల యాజమాన్యాలందరూ కేవలం ప్రభుత్వం చెల్లించే ఫీజు బకాయిలపైనే ఆధారపడి ఉండడం వలన, అవి రాక పోవడంతో వేదన భరించలేక ఈ నెల 20 లోపల ప్రభుత్వము ఫీజు బకాయిలైన సుమారు రూ. 2500 కోట్లు చెల్లించి ఆదుకోవాలని కోరారు. ఒకవేళ అలా జరగని పక్షంలో రాబోవు 2వ, 4వ, 6వ సెమిస్టర్ల రెగ్యులర్ ఎగ్జామ్స్‌ను నిర్వహించలేమని స్పష్టం చేశారు. కాబట్టి విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని.. తెలంగాణ రాష్ట్ర ప్రైవేట్ డిగ్రీ కళాశాలల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఈ నెల 20 లోపు ఫీజు బకాయిలను వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఫీజు బకాయిలు రానిపక్షంలో.... రాబోయే రెగ్యులర్ సెమిస్టర్ పరీక్షలను నిర్వహించలేమని తెలుపుటకు చింతిస్తున్నామని తెలిపారు.



ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న డా.జి.చిన్నారెడ్డి

# ప్రజావాణికి అందిన దరఖాస్తులు 337

**హైదరాబాద్ (బేగంపేట) మార్చి 11, ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 337 దరఖాస్తులు అందాయి. వీటిలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 60 దరఖాస్తులు, విద్యుత్ శాఖకు సంబంధించి 43, రెవెన్యూ సమస్యలకు సంబంధించి 39, ఇందిరమ్మ ఇళ్ల పథకం కోసం 129 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 66 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. ప్రజావాణి ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌ఛైర్మన్ డా. జి.చిన్నారెడ్డి దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు తెలుసుకుని సంబంధిత శాఖాధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలను వెంటనే పరిష్కరించారు.

# డంపింగ్ ఏరియాలో నవజాత శిశువు మృతదేహం

**యాదగిరిగుట్ట, మార్చి 11, ప్రభాతవార్త:** యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలోని యాదగిరిపల్లి పాలిటెక్నిక్ కాలేజీ సమీపంలో డంపింగ్ ఏరియాలో నవజాత శిశువు ఆడపిల్ల మృతదేహం లభ్యమైంది. యాదగిరిగుట్ట సిఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలోని యాదగిరి పల్లి పాలిటెక్నిక్ కాలేజీ సమీపంలో డంపింగ్ ఏరియాలో నవజాత శిశువు సుమారు రోజు నిండిన ఆడపిల్ల మృతదేహం గుర్తించినట్లుగా తెలిపారు మృతదేహంపై ఎలాంటి గాయాలు లేవని తెలిపారు. సమీపంలో ఉన్న ఆస్పత్రులలో విచారించి ఈ సంఘటన కారణమైన వారిని గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# యాంత్రీకరణలో చిన్న రైతులకు ప్రాధాన్యత

### వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, మార్చి 11, ప్రభాతవార్త:** వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా చిన్న, సన్నకారు రైతులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. హైదరాబాద్ నుండి మంగళవారం నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇందులో భాగంగా వ్యవసాయంలో ఉపయోగించే పవర్ టిల్లర్స్, పవర్ వీడర్, రోటోవేటర్ మరియు ట్రాక్టర్ తో నడిపే పరికరాలు, తైవాన్ స్ప్రేయర్స్ మొదలైన పనిముట్లను సబ్సిడి మీద అందించుటకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో సీడ్ డవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు రూ.90 కోట్లు నష్టం వచ్చిందని తెలిపారు. సీడ్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ ద్వారా నాణ్యమైన సన్నరకాల విత్తనాలను రైతులకు అందించేందుకు తగుచర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే కందులు, మినుములు, సన్ ఫ్లవర్, శనగలు మొదలైన పంటల విషయంలో నాణ్యమైన విత్తనాలను సీడ్ కార్పోరేషన్ ద్వారా అందించాలన్నారు. మార్క్ ఫెడ్ ద్వారా నిర్వహించబడుతున్న జిన్నింగ్ మిల్లు గత నాలుగేళ్లుగా ఉపయోగంలో లేదని, ఈ సంవత్సరం దాని జిన్నింగ్ పనిని ఆరంభించ మన్నారు. మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో ఉన్న గోదా ములు 100 శాతం పూర్తిస్థాయిలో వినియోగంలో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కందులు, శనగలు, వేరుశనగ, పొద్దుతిరుగుడు మొదలైన పంటల కొనుగోళ్ల విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కాగా స్వల్పకాలిక రకా లను నవంబర్ లోనే సాగును ప్రారంభిం చినట్ల యితే మార్చి మొదటి వారం వరకు వరి కోతకు రావడానికి అవకాశం ఉంటుందని గ్రహించి రైతులు ముందస్తు ప్రణాళికతో సాగుచేయాల్సి న అవసరం ఉందన్నారు.

# ప్రతి కార్యకర్తకు అండగా నిలబడదాం



మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

### గ్రామస్థాయిలో నాయకులుగా తయారుచేద్దాం

### పెండింగ్ పనుల వివరాలు తీసుకురండి

### పార్టీ ముఖ్యనేతల సమావేశంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ, పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ దిశానిర్దేశం

**పటాన్‌చెరు, మార్చి 11, ప్రభాతవార్త:** కార్యకర్తలే పార్టీకి బలమని ప్రతి నాయకుడు కార్యకర్తలకు అండగా నిలిచి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మం త్రులు దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ, పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సూచించారు. మంగళ వారం హైదరాబాద్ మినిస్టర్ క్వార్టర్స్‌లో ఉమ్మడి మెదక్ జిల్లా కాంగ్రెస్ ముఖ్యనాయకుల సమా వేశం నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తో పాటు జిల్లాకు చెందిన పార్టీ ఎమ్మె ల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, సీనియర్ నాయ కులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇద్దరు మంత్రులు స్థానికసంస్థల ఎన్నికల్లో అనుసరిం చాల్సి న వ్యూహాలపై దిశానిర్దేశం చేశారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం విరివిగా సంక్షేమ పథకాలను అమలుచేస్తున్న విషయాన్ని క్షేత్ర స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని సూచిం చారు. గ్రామ స్థాయిలో ప్రతివాడలో పెండింగ్లో ఉన్న అభివృద్ధి పనులకు సం బంధించిన వివరాలను సేకరించి తీసుకురావాలని కోరారు. అసెంబ్లీ పూర్తవ్వగానే ఎస్డీఎఫ్ నిధులు కేటాయిస్తామని స్పష్టం చేశారు. అభివృద్ధి కార్యక్రమాల పను లను కార్యకర్తలకే కేటాయించేలా ఎమ్మెల్యేలు నియోజకవర్గ ఇన్‌చార్జిలు చొరవ తీసుకోవాలని కోరారు. కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అని ప్రతినేత కార్యకర్తకు అందుబాటులో ఉంటూ వారి కష్టసుఖాల్లో తోడుండాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలకు అవకాశాలు కల్పించి వారిని నాయకులుగా తయారుచేయాల్సి న బాధ్యత మనపైనే ఉందన్నారు.

# విమానాశ్రయం ద్వారా రామగుండంలో వ్యాపార, పరిశ్రమల అభివృద్ధికి ప్రోత్సాహం

### విమానాశ్రయం స్థాపనపై కేంద్ర మంత్రితో కీలక చర్చ

**గోదావరిఖని, ప్రభాతవార్త:** పరిశ్రమల హబ్‌గా ఎదుగుతున్న రామగుండంలో విమానాశ్రయం ద్వారా వ్యాపార, పరిశ్రమల వృద్ధికి ప్రోత్సాహం లభిస్తుందని కేంద్ర పౌర విమానయాన మంత్రి కింజారపు రాంమోహన్ నాయుడుకు పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ, రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వివరించారు.

కేంద్ర మంత్రి రామ్ మోహన్ నాయుడును న్యూఢిల్లీలో వారు కలిసి రామగుండం విమానాశ్రయం ప్రతిపాదనను ప్రస్తావించారు. స్థానిక ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి, పెట్టుబడులు ఆకర్షించడానికి విమానాశ్రయం కీలకం, రామగుండంలో తాజా అధ్యయనం చేపట్టాలని కోరారు.

తద్వారా సాధ్యాసాధ్యాలపై స్పష్టత వస్తుందని వివరించారు. దీనికి కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని, విమానాశ్రయం స్థాపనకు సాధ్యాసాధ్యాలపై త్వరలో అధ్యయనం ప్రారంభిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. దీంతో పౌర విమానయాన మంత్రిత్వ శాఖ బృందాన్ని పంపించి సమగ్ర పరిశీలన చేయనున్నట్లు వారు వెల్లడిరచారు. ఈ సందర్భంగా పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ రామగుండంలో విమానాశ్రయం సాధ్యమయ్యేలా అన్ని కార్యాచరణలు చేపడతామని హామీ ఇచ్చారు. రాష్ట్ర స్థాయిలో అవసరమైన మద్దతును ప్రభుత్వం నుంచి అందించేందుకు మంత్రి వెంకటరెడ్డి కూడా ధృఢ సంకల్పంతో ఉన్నారని తెలిపారు.



రాష్ట్ర బడ్జెట్‌పై జరిగిన బిసి ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న బిసి సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం

# బిసి సంక్షేమానికి రూ.20 వేల కోట్ల బడ్జెట్ కేటాయించాలి

### సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం

**హైదరాబాద్, మార్చి 11, ప్రభాతవార్త:** వచ్చే బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి రూ.20 వేల కోట్ల బడ్జెట్ కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వచ్చే ఆర్థిక సంవత్సరంకు బీసీ బడ్జెటు రూ.20వేల కోట్లకు పెంచాలని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో బీసీలకు రూ.38 వేల కోట్ల బడ్జెట్ కేటాయించారని ఆయన పేర్కొన్నారు. బీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాల కోసం రూ.4వేల కోట్లు ఎంబీసీ కార్పొరేషన్‌కు రూ.2వేల కోట్లు, బీసీ కులాల ఫెడరేషన్లకు జనాభా నిష్పత్తి ప్రకారం ఒక్కొక్క ఫెడరేషన్లకు రూ.2వేల కోట్లు చొప్పున కేటాయించాలన్నారు. ఇంజినీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ, పీజీ, డిగ్రీ, ఇంటర్ తదితర కాలేజీ కోర్సులు చదివే బీసీ విద్యార్థుల మొత్తం ఫీజుల స్కీమును కాంగ్రెస్ ఎన్నికల మెనిఫెస్టో ప్రకారం పునరుద్ధరించాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు ఇస్తున్న మాదిరిగా బీసీ విద్యార్థులకు కూడా పూర్తి ఫీజులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అదనంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక బీసీ గురుకుల పాఠశాలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో నిధులను కేటాయించడంలో బీసీను నిర్లక్ష్యం చేస్తే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి బీసీలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

# ప్రతినెల చివరి వారంలో సివిల్ రైట్స్‌డే నిర్వహించాలి

### రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

**నల్గొండ ప్రతినిధి, ప్రభాతవార్త, మార్చి 11:** ఒకరోజు నల్గొండ జిల్లా పర్యటనలో భాగంగా రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అధ్యక్షతన కమిషన్ సభ్యులు కుస్రం నీలాదేవి, రాంబాబు నాయక్ ,కొంకతి లక్ష్మీ మ్రనారాయణ ,జిల్లా శంకర్ లు మంగళవారం నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఉన్న ఉదయాదిత్య భవన్లో షెడ్యూల్ కులాలు, తెగల వారిపై దాడులకు సంబంధించిన కేసులు, భూములకు సంబంధించిన సమస్యల పై సమీక్ష నిర్వహించారు. అంతేకాక షెడ్యూల్డ్ కులాలు, తెగల వారికి సంబంధించిన సమస్యలపై ఆయా సంఘాల ప్రతినిధులు తెలిపిన వివరాలను సావధానంగా విన్నారు. దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ నల్గొండ జిల్లాలో ఎస్సీ, ఎస్టీల భూములకు సంబంధించి (9) కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, ఈ కేసులకు సంబంధించి మార్చి 31లోగా నివేదికలు పంపించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠిని ఆదేశించారు. అలాగే జిల్లాలో ఎస్సీ, ఎస్టీలపై దాడులకు సంబంధించి(17)కేసులు పెండింగ్‌లో ఉన్నాయని వీటికి సంబంధించిన నివేదికలు పంపించాలని కోరగా, జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ మాట్లాడుతూ 12 కేసులకు ఇదివరకు నివేదికలు పంపించామని, 5 కేసులకు సంబంధించి నివేదికలు పెండింగ్‌లో ఉన్నాయని, కమిషన్ ఆదేశాల మేరకు నిర్దేశించిన సమయంలో నివేదికలు పంపిస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చే పరిహారం విషయంలో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తెస్తే ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. జిల్లాలో కొన్ని ప్రాంతాలలో దేవాలయ ప్రవేశం, అంటరానితనం, ఎస్సీ, ఎస్టీలపై దాడుల వంటి తమ దృష్టికి వచ్చాయని, వీటన్నిటి నివారణకు ప్రతి నెల చివరన గ్రామాలలో సివిల్ రైట్స్ డే నిర్వహించాలని, ఏ నెలలో, ఏ గ్రామంలో సివిల్



రైట్స్‌డే చేసే విషయాలను స్పష్టంగా తెలియజేయాలని, గ్రామం మధ్యలో నిర్వహించి చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే జిల్లా స్థాయి ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేయాలని, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ నిర్వహించే విషయాన్ని వారం రోజులముందే కమిషన్ దృష్టికి తీసుకు వచ్చినట్లయితే తాను కానీ, లేదా సభ్యులు కానీ జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీల సమావేశాలకు హాజరవుతామని స్పష్టం చేశారు. సమావేశం ప్రారంభమైన వెంటనే జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాటి మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ, ఎస్టీలపై దాడులకు సంబంధించిన కేసుల వివరాలను కూలంకషంగా వివరించారు. జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్ ఎస్సీ, ఎస్టీలపై దాడులకు సంబంధించిన వివరాలను తెలియజేసారు. ఈ సమావేశానికి ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు కుస్రం నీలాదేవి, ఇన్‌చార్జి డిఆర్‌ఓ అశోక్‌రెడ్డి, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, దేవరకొండ ఎసిపి మోనిక, ఆర్డీవోలు, డిఎస్పీలు, జిల్లా అధికారులు , ఎస్సీ ఎస్టీ కోర్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్ సంబంధించిన అఖిల తదితరులు హాజరయ్యారు. ఆనంతరం ప్రణయ్ హత్య కేసులో వాదనలు వినిపించి దోషులకు పడేలా చేసిన అడ్వకేట్ దర్శనం నర్సింహను ఈ సందర్భంగా చైర్మన్,సభ్యులు,జిల్లా కలెక్టర్,ఎస్ పి లను

# ఎసిబికి చిక్కిన మున్సిపల్ ఆర్‌ఐ

### మ్యూటేషన్ కోసం రూ.12 వేలు తీసుకుంటూ చిక్కిన వైనం



ఎసిబికి చిక్కిన మున్సిపల్ ఆర్‌ఐ జానయ్య

**సంగారెడ్డి బ్యూరో, మార్చి 11, ప్రభాతవార్త:** ఇంటి స్థలం మ్యుటేషన్‌కు లంచం డిమాండ్ చేసి బాధితుడి వద్ద నుంచి రూ.12 వేలు లంచం తీసుకుంటూ మెదక్ మున్సిపల్ రెవెన్యూ అధికారి ఏసీబీకి చిక్కిన ఘటన మంగళవారం జరిగింది. ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మెదక్ పట్టణానికి చెందిన శైలజకు సర్వే నెంబర్ 505/1/2లో 605 గజాల ఇంటి స్థలం ఉంది. భూమి మ్యుటేషన్ కోసం గత నెలలో దరఖాస్తు చేసుకున్నారు. కానీ మ్యుటేషన్ కోసం మున్సిపల్ అర్‌ఐ జానయ్యను సంప్రదించగా పని చేయలేదు. దీనితో పలుమార్లు అతని వద్దకు వెళ్లినా ప్రయోజనం కలగలేదు. దీంతో విషయం సోదరుడు ధర్మకారి శివకుమార్‌కు చెప్పడంతో మున్సిపల్ అర్‌ఐ వద్దకు వెళ్లి మ్యుటేషన్ చేయాలని కోరగా అందుకు రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు. ఇందుకు రూ.12 వేలు ఇచ్చేందుకు అంగీకరించాడు జానయ్యకు రూ.12 వేలు లంచం ఇవ్వగా అక్కడే కాపు కాసి ఉన్న ఏసీబీ అధికారులు పట్టుకొని అర్‌ఐ లంచంగా తీసుకొన్న డబ్బులను స్వాధీనం చేసుకొని అరెస్టు చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు.

**లంచం అడిగితే సమాచారం ఇవ్వండి: ఎసిబి డిఎస్పీ సుదర్శన్**

ప్రభుత్వ అధికారులు లంచం అడిగితే ఏసీబీకి సమాచారం ఇవ్వాలని ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ తెలిపారు. జిల్లాల్లో ఎక్కడ ఏ ప్రభుత్వ అధికారైన లంచం అడిగితే 9440446106 నెంబర్‌లో తమకు ఫిర్యాదు చేయాలని కోరారు.

## ఛాంపియన్స్ ట్రోఫీ..
# టీం ఆఫ్ ది టోర్నీ కెప్టెన్‌గా మిచెల్




### టీమిండియాలో కోహ్లితో సహా 6గురికి అవకాశం
### నో ఛాన్స్ అంటూ రోహిత్‌కు ఐసిసి బిగ్ షాక్

**న్యూఢిల్లీ:** ఛాంపియన్స్ ట్రోఫీ–2025 ముగిసింది. టీం ఇండియా 12 సంవత్సరాల తర్వాత మరోసారి ఈ ట్రోఫీని గెలుచుకుంది. ఈసారి రోహిత్ శర్మ కెప్టెన్సీలో భారత జట్టు టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఫైనల్లో కెప్టెన్ రోహిత్ అత్యుత్తమ ఇన్నింగ్స్ ఆడి జట్టు విజయానికి స్టార్‌గా నిలిచాడు. ఈ విజయంపట్ల దేశం మొత్తం రోహిత్, టీం ఇండియాను అభినందిస్తున్న తరుణంలో, ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ (ఐసిసి) ఒక షాకింగ్ నిర్ణయం తీసుకుంది. టోర్నమెంట్ ముగిసిన తర్వాత తాజాగా ఐసిసి టోర్నమెంట్ ఉత్తమ జట్టును ప్రకటించింది. కానీ, ఛాంపియన్ కెప్టెన్ రోహిత్ అందులో చోటు దక్కించుకోలేదు. ఐసిసి మిచెల్ సాంట్నర్‌ను ఈజట్టుకు కెప్టెన్‌గా నియమించింది. న్యూజిలాండ్ కెప్టెన్ సాంట్నర్ తన జట్టును అద్భుతంగా నడిపించడమే కాకుండా టోర్నమెంట్‌లో 9 వికెట్లు పడగొట్టాడు. ఇక టీమిండియా నుంచి 6గురు ఆటగాళ్లకు ఇందులో స్థానం లభించింది. టాప్‌మిడిల్ ఆర్డర్‌లో, టీమిండియా ఆత్మలుగా పేరుగాంచిన విరాట్ కోహ్లీ, శ్రేయాస్ అయ్యర్, కేఎల్ రాహుల్ ఎంపికయ్యారు. అదే సమయంలో, బౌలింగ్‌లో అద్భుతాలుచేసిన స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి, పేసర్ మహ్మద్ షమీ కూడా చోటు దక్కించుకున్నారు. కాగా, అక్షర్ పటేల్ 12వ ఆటగాడిగా ఎంపికయ్యాడు. రోహిత్‌కు ఎందుకు స్థానం దక్కలేదనేది ప్రస్తుతం చర్చనీయాంశమైంది. ఈనెల 9 ఆదివారం దుబాయ్‌లో జరిగిన ఫైనల్‌లో టీమిండియా న్యూజిలాండ్‌ను 4 వికెట్ల తేడాతో ఓడించి టైటిల్‌ను గెలుచుకుంది. ఫైనల్లో భారత కెప్టెన్ రోహిత్ శర్మ 76 పరుగుల అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. దాని ఆధారంగా టీం ఇండియా 252 పరుగుల లక్ష్యాన్ని సాధించి వరుసగా రెండో టైటిల్‌ను గెలుచుకుంది. ఈ ఇన్నింగ్స్‌కు రోహిత్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా కూడా ఎంపికయ్యాడు. అయితే ఐసిసి టోర్నమెంట్ జట్టును ఎంపిక చేసినప్పుడు, రోహిత్‌ను కెప్టెన్‌గా చేయలేదు. కానీ, 12 మంది ఆటగాళ్లలో చేర్చలేదు.

వాస్తవానికి ఫైనల్‌కు ముందు ఈ టోర్నమెంట్‌లో భారత కెప్టెన్ బ్యాట్ ఎక్కువ పరుగులు చేయకపోవడంతో రోహిత్‌కు స్థానం లభించలేదనేది ఐసిసి వర్గాలు చెబుతున్నాయి. మొత్తం టోర్నమెంట్‌లో రోహిత్ 5 ఇన్నింగ్స్‌లో 180పరుగులు మాత్రమే చేశాడు. ఇటువంటి పరిస్థితిలో, ఓపెనర్‌గా జట్టులో అతనిస్థానాన్ని కనుగొనడం కష్టం. టోర్నమెంట్‌లో అత్యధిక పరుగులు సాధించిన రచిన్ రవీంద్ర, ఆఫ్ఘనిస్తాన్ ఓపెనర్ ఇబ్రహీం జద్రాన్‌లను ఓపెనర్లుగా ఎంపికచేశారు. ఇటువంటి పరిస్థితిలో, రోహిత్‌కు చోటు దక్కలేదు. ఐసిసి ప్రకటించిన ఛాంపియన్స్ ట్రోఫీ టీం ఆఫ్ ది టోర్నమెంట్‌లో మిచెల్ సాంట్నర్ (కెప్టెన్), రచిన్ రవీంద్ర, ఇబ్రహీం జాద్రాన్, విరాట్ కోహ్లీ, శ్రేయాస్ అయ్యర్, కేఎల్ రాహుల్ (వికెట్ కీపర్), గ్లెన్ ఫిలిప్స్, అజ్మతుల్లా ఒమర్జాయ్, మాట్ హెన్రీ, మహమ్మద్ షమీ, వరుణ్ చక్రవర్తి, అక్షర్ పటేల్ ఉన్నారు.




## ఏసియన్ లెజెండ్స్ లీగ్‌లో..
# ఏసియన్ స్టార్స్ గెలుపు
### 6 వికెట్ల తేడాతో అఫ్ఘానిస్థాన్ పఠాన్స్ చిత్తు

**న్యూఢిల్లీ:** ఏసియన్ లెజెండ్స్ లీగ్–2025 తొలి ఎడిషన్ ఘనంగా ప్రారంభమైంది. ఈ టోర్నీలో మొత్తం ఐదు జట్లు ఏసియన్ లయన్స్, శ్రీలంక లయన్స్, అఫ్ఘానిస్థాన్ పఠాన్స్, ఇండియన్ రాయల్స్, బంగ్లాదేశ్ టైగర్స్ పాల్గొంటున్నాయి. ఇండియన్ రాయల్స్ తరఫున టీమిండియా స్టార్లు శిఖర్ ధవన్, ఇర్ఫాన్ పఠాన్, యూసఫ్ పఠాన్, అంబటి రాయుడు, మనోజ్ తివారి, మునాఫ్ పటేల్ తదితర స్టార్లు ఆడుతున్నారు. ఇక ఈ టోర్నీ తొలి మ్యాచ్‌లో ఏసియన్ స్టార్స్, అఫ్ఘానిస్థాన్ పఠాన్స్ జట్లు తలపడ్డాయి. రసవత్తరంగా సాగిన ఈ మ్యాచ్‌లో ఏసియన్ స్టార్స్ జట్టు 6 వికెట్ల తేడాతో అఫ్ఘానిస్థాన్ పఠాన్స్ జట్టును ఓడించింది. తొలుత బ్యాటింగ్ చేసిన అఫ్ఘానిస్థాన్ షోయబ్ ఖాన్ (63 బంతుల్లో 104 నాటౌట్) మెరుపు శతకంతో కదం తొక్కడంతో నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 216 పరుగుల భారీస్కోర్ చేసింది. అఫ్ఘానిస్థాన్ ఇన్నింగ్స్‌లో కెప్టెన్ అస్గర్ అఫ్ఘాన్ (65) అర్ధ సెంచరీతో రాణించాడు. అనంతరం బరిలోకి దిగిన ఏషియన్ స్టార్స్ కెప్టెన్ మెహ్రాన్ ఖాన్ (52 బంతుల్లో 109 నాటౌట్) సునామీ శతకంతో విరుచుకుపడటంతో 19.5 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదించింది. మరో ఎండ్‌లో మెహ్రాన్ ఖాన్‌కు పెద్దగా సపోర్ట్ లేనప్పటికీ ఒంటిచేత్తో ఏషియన్ స్టార్స్ జట్టును గెలిపించాడు. ఏసియన్స్ స్టార్స్ ఇన్నింగ్స్‌లో అంకిత్ నర్వాల్ (39), రాఘవ్ ధావన్ (34 నాటౌట్) ఓ మోస్తరు స్కోర్లు చేశారు. ఇక మరో మ్యాచ్ జరగాల్సి ఉండగా అది రద్దైంది. ఈ రెండో మ్యాచ్‌లో బంగ్లాదేశ్ టైగర్స్, ఇండియన్ రాయల్స్ జట్లు తలపడాల్సి ఉండింది. ఇక ఏసియన్ లెజెండ్స్ లీగ్‌లో ఇండియన్ రాయల్స్ జట్టులో అంబటి రాయుడు, మనోజ్ తివారి, సుబ్రమణ్యం బద్రీనాథ్, ఫయాజ్ ఫజల్, శిఖర్ ధవన్, యూసఫ్ పఠాన్, ఇర్ఫాన్ పఠాన్, నమన్ ఓఝా, శ్రీవట్స్ గోస్వామి, అనురీత్ సింగ్, ము నాఫ్, కరణ్‌వీర్ సింగ్, బరిందర్ శ్రాన్, షాదాబ్ జకాతి, మన్‌ప్రీత్ గోని, సుదీప్ త్యాగి ఉన్నారు.

## మహిళల ప్రీమియర్ లీగ్‌లో..
# ఫైనల్ రేస్‌లో ముంబై




**న్యూఢిల్లీ:** మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో అగ్రస్థానంతో నేరుగా ఫైనల్ చేరేందుకు ముంబై ఇండియన్స్ జట్టు విజయం దూరంలో నిలిచింది. గెజరాత్ జెయింట్స్‌పై జరిగిన ఉత్కంఠ పోరులో ముంబై 9 పరుగుల తేడాతో గెలుపొందింది. మొదట ముంబై నిర్ణీత 20 ఓవర్లలో 179 పరుగులు చేసింది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ కెప్టెన్ హర్మన్ ప్రీత్ (33 బంతుల్లో 54; 9 ఫోర్లు) అర్ధసెంచరీ సాధించింది. తర్వాత గుజరాత్ 20 ఓవర్లలో 170 పరుగులకు ఆలౌ టైంది. భారతి (25 బంతుల్లో 61; 8 ఫోర్లు, 4 సిక్స్‌లు) ముంబై బౌలర్లపై విరుచుకు పడింది. ఒకదశలో జెయింట్స్ 92 పరుగులకే 6 వికెట్లు కోల్పోయి ఓటమికి సిద్ధమవగా, భారతి ధనాధన్ ఆటతో ఆశలు రేపింది. 41 బంతుల్లో 88 పరుగుల సమీకరణం ఆఖరి ఓవర్‌కు వచ్చేసరికి 6 బంతుల్లో 13 పరుగులుగా మారింది. కానీ 20వ ఓవర్ వేసిన హేలీ, తనూజ (10)ను రనౌట్ చేసింది. తర్వాతి బంతికి సిమ్రాన్ (18; 1 ఫోర్,1 సిక్స్), చివరి బంతికి ప్రియా (1) వికెట్లు తీసి ఆలౌట్‌చేసింది. ప్రస్తుతం ముంబై, ఢిల్లీక్యాపిటల్స్ 10 పాయింట్లతో సంయు క్తంగా అగ్రస్థానంలో ఉన్నా, మెరుగైన రన్‌రేట్ కారణంగా ఢిల్లీ టాప్‌లో ఉంది.

## ఇంటర్నేషనల్ మాస్టర్స్ లీగ్‌లో..
# శ్రీలంక ఘన విజయం
### ఇంగ్లండ్‌పై 9 వికెట్ల తేడాతో గెలుపు



**న్యూఢిల్లీ:** ఇంటర్నేషనల్ మాస్టర్స్ లీగ్–2025లో శ్రీలంక జోరు కొనసాగుతుంది. ఇంగ్లండ్‌తో జరిగిన మ్యాచ్‌లో శ్రీలంక 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తద్వారా పాయింట్ల పట్టికలో భారత్‌ను వెనక్కు నెట్టి అగ్ర స్థానానికి చేరుకోవడంతో పాటు, నాకౌట్‌కు అర్హత సాధించింది. నాలుగు మ్యాచ్‌లుఆడినా ఒక్క విజయంకూడా సాధించని ఇంగ్లండ్ టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి తొలుత బౌలింగ్ ఎంచుకున్న శ్రీలంక, ఇంగ్లండ్‌ను స్వల్ప స్కోర్‌కే కట్టడి చేసింది. శ్రీలంక బౌలర్లు కలిసికట్టుగా రాణించడంతో ఇంగ్లండ్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 146 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఉడాన, దిలువన్ పెరేరా, గుణరత్నే, చతురంగ, జీవన్ మెండిస్ తలో వికెట్ తీయడంతో పాటు, పొదుపుగా బౌలింగ్‌చేశారు. ఇంగ్లండ్ బ్యాటర్లలో ఫిల్ మస్టర్డ్ (39 బంతుల్లో 50, 3 ఫోర్లు, 3 సిక్సర్లు) అర్ధ సెంచరీతో రాణించగా, కెప్టెన్ ఇయాన్ మోర్గాన్ (10), టీమ్ ఆంబ్రోస్ (17), డారెన్ మ్యాడీ (15), టిమ్ బ్రేస్నన్ (18 నాటౌట్), క్రిస్ ట్రెమ్లె ట్రెమ్లెట్ (14 నాటౌట్) రెండంకెల స్కోర్లు చేయగలిగారు. ఉడాన బంతితో సత్తా చాటడంతో పాటు, ఫీల్డింగ్‌లోనూ మెరిశాడు. ఈ మ్యాచ్‌లో అతను మూడు క్యాచ్‌లు పట్టాడు. స్వల్ప లక్ష్య ఛేదనలో శ్రీలంక ఓపెనర్ కుమార సంగక్కర విధ్వంసకర శతకంతో విరుచుకు పడ్డాడు. సంగ 47బంతుల్లో 19 ఫోర్లు, సిక్సర్ సాయంతో 106 పరుగులతో అజేయంగా నిలిచి తన జట్టును విజయతీరాలకు చేర్చాడు. లంక ఇన్నింగ్స్‌లో రొమేశ్ కలువితరణ 16, అసేల గుణరత్నే 22 పరుగులతో అజేయంగా నిలిచాడు. సంగక్కర సుడిగాలి శతకంతో చెలరేగడంతో శ్రీలంక 12.5 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది (వికెట్ కోల్పోయి). శ్రీలంక కోల్పోయిన ఏకైక వికెట్ (కలువితరణ) మాస్కరెన్హాస్‌కు దక్కింది.

## ఇండియన్ ప్రొ బాక్సింగ్ లీగ్‌లో..
# రఫాడించిన భారత్ బాక్సర్లు



**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రొబాక్సింగ్ లీగ్ (ఐపిబిఎల్)–2025లో భాగంగా వరల్డ్ ఛాంపియన్స్‌తో జరిగిన పోటీలో భారత్ బాక్సర్లు అదరగొట్టి రఫాడించారు. రానా దగ్గుబాటి బాక్సింగ్ బే-ఆంటొని పెట్టిస్ ఎపిఎఫ్‌సిల మధ్య జరుగుతున్న బాక్సింగ్ పోటీల్లో అక్షయ్ చహల్–సబరి జయశంకర్ సత్తా చాటారు. ప్రపంచ చాంపియన్లు అయిన లూయిస్ ఫెలిషియానో, సెర్గియో పెట్టిస్‌లపై అద్భుత విజయం సాధించి, ప్రొఫెషనల్ బాక్సింగ్‌కు భారత్ సిద్ధంగా ఉందనే సంకేతాలు ఇచ్చారు. అక్షయ్–సబరి వీరోచిత పోరాటం కారణంగా టీమిండియా–టీమ్ అమెరికా మధ్య సాగిన పోరు 2–2తో డ్రాగా ముగిసింది. ఈ సందర్భంగా మాజీ యూఎఫ్సీ లైట్ వెయిట్ ఛాంపియన్ ఆంటోని పెట్టిస్ మాట్లాడుతూ ఇండియన్ ప్రొ బాక్సింగ్ లీగ్ ప్రపంచంలోని అతి పెద్ద బాక్సింగ్ లీగ్‌లలో ఒకటిగా ఎదుగుతోందన్నారు. అగ్రశ్రేణి బాక్సర్లను ఇక్కడికి తీసుకువచ్చేందుకు కట్టుబడి ఉన్నట్లు తెలియచేశాడు. ఇండియాలో ఈ పోటీలను మరింత విస్తృతం చేయాలనే సంకల్పంతో ఉన్నామని వెల్లడించాడు.

## వాణిజ్యం

# యుపిఐ, రూపే లావాదేవీలపై ఇక ఛార్జీలు!

**న్యూఢిల్లీ, మార్చి 11:** ఈ మధ్య ఎక్కడచూసినా ఆన్‌లైన్ చెల్లింపులే! టీ తాగి రూ.10 చెల్లించాలన్నా యుపిఐ ఆధారిత డిజిటల్ చెల్లింపులు చేస్తున్నారు. ప్రస్తుతం ఇలాంటి యుపిఐ, రూపే డెబిట్ కార్డులతో చేసే లావాదేవీలపై వ్యాపారులపై ఎలాంటి ఛార్జీల భారం లేదు. అయితే త్వరలోనే ఈ లావాదేవీలపైనా మర్చెంట్ ఛార్జీలను విధించాలని కేంద్రం యోచిస్తున్నట్లు తెలిసింది. రానున్న రోజుల్లో పెద్ద వ్యాపారులు యుపిఐ ఆధారిత చెల్లింపులకు ఛార్జీలు చెల్లించే అంశాన్ని కేంద్రం పరిశీలిస్తోందని కొన్ని కథనాలు వెలువడ్డాయి. వార్షిక ఆదాయం రూ.40 లక్షలపైన ఉండే వ్యాపారులకు యుపిఐ చెల్లింపులపై మర్చెంట్ డిస్కౌంట్ రేట్‌ను తిరిగి తీసుకురావాలని ప్రతిపాదిస్తూ బ్యాంకింగ్ ఇండస్ట్రీ ప్రతినిధులు ఇటీవల కేంద్రానికి అధికారిక ప్రతిపాదన పంపారు. దీనిపైకేంద్రం సానుకూలంగా స్పందించిందని ఓ బ్యాంకర్ వెల్లడించినట్లు తెలిసింది. వీసా, మాస్టర్ కార్డ్ వంటి డెబిట్‌కార్డులు, ఇతర క్రెడిట్ కార్డులతో చేసే చెల్లింపులకు పెద్ద వ్యాపారులు ఎండిఆర్ ఛార్జీలు చెల్లిస్తున్నారు. అలాంటప్పుడు వారు యుపిఐ, రూపే డెబిట్‌కార్డు ఆధారిత లావాదేవీలకు ఎందుకు ఛార్జీలు కట్టకూడదు? అని సదరు బ్యాంకర్ ప్రశ్నించారు. కేంద్రం కూడా ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకుందని తెలిపారు. అయితే 'టైర్డ్ ప్రైజింగ్ సిస్టమ్' ఆధారంగా ఈ లావాదేవీలపై ఛార్జీలు విధించాలని కేంద్రం యోచిస్తున్నట్లు తెలిసింది. అంటే రూ.40 లక్షల్లోపు వార్షికాదాయం ఉండే వ్యాపారులు యుపిఐ చెల్లింపులను ఉచితంగానే స్వీకరించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ ఛార్జీలను తిరిగి తీసుకు రావడం వల్ల యూజర్లపై నేరుగా ఎలాంటి ప్రభావం ఉండబోదని తెలుస్తోంది. ఎందుకంటే ఈలావాదేవీల కోసం యూజర్ల నుంచి ఎలాంటి ఛార్జీలు వసూలు చేయబోరు. కాకపోతే దీనివల్ల వ్యాపారులు మళ్లీ నగదు చలామణికి మొగ్గుచూపే అవకాశాలున్నాయని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మూడేళ్ల ముందు వరకు యుపిఐ ఆధారిత చెల్లింపులకు వ్యాపారులు కొంతమొత్తం ఛార్జీలను బ్యాంకులకు కట్టాల్సి వచ్చేది. ఆయా ఆవాదేవీలను ప్రాసెస్ చేసేందుకు ఈ రుసుము చెల్లించేవారు. అది కూడా ఒక శాతం లోపే ఉండేది. అయితే యుపిఐ చెల్లింపులపై ఈ ఎండిఆర్ ఛార్జీలను 2022లో కేంద్రం తొలగించింది. అనంతరం ఈ ప్రాసెసింగ్ ఖర్చులను భర్తీ చేసేందుకు బ్యాంకులు, ఫిన్‌టెక్ కంపెనీలకు కేంద్రం సబ్సిడీలు ఇస్తూ వస్తోంది. అయితే ఈ యేడాది బడ్జెట్‌లో ఈ సబ్సిడీని రూ.3500 కోట్ల నుంచి రూ.437 కోట్లకు తగ్గించారు.




# 21 నెలల కనిష్టానికి డీమ్యాట్ ఖాతాలు!




**ముంబై, మార్చి 11:** దేశంలో కొత్త డీమ్యాట్ ఖాతాల సంఖ్య క్రమంగా తగ్గుముఖం పడుతోంది. ఒకప్పుడు డీమ్యాట్ ఖాతాలు తెరవడంలో సరికొత్త మైలురాళ్లు నమోదయ్యేవి. ప్రస్తుతం ఆ పరిస్థితి మారింది. స్టాక్ మార్కెట్లలో నెలకొన్న అనిశ్చితి పరిస్థితుల నేపథ్యంలో కొత్తగా మార్కెట్ వైపు చూసేవారి సంఖ్య తగ్గింది. దాదాపు రెండేళ్ల కనిష్టానికి చేరిందంటే మార్కెట్ పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. దీంతో ఫిబ్రవరిలో కొత్తగా కేవలం 22.6లక్షల డీమ్యాట్ ఖాతాలు మాత్రమే తెరుచుకున్నాయి. 2023 మే తర్వాత ఇదే అత్యల్పం. గతేడాది సెప్టెంబరు నుంచి దేశీయ స్టాక్ మార్కెట్లు తీవ్ర ఒడుదుడుకులు ఎదుర్కొంటున్నాయి. దీంతో నెలవారీ నమోదయ్యే కొత్త డీమ్యాట్ ఖాతాల సంఖ్య క్రమంగా తగ్గుముఖం పడుతోంది. గతేడాది డిసెంబరులో 32.6లక్షల కొత్త ఖాతాలు యాడ్ అవ్వగా, జనవరి నాటికి ఆ సంఖ్య 28.3 లక్షలకు పడిపోయింది. ఫిబ్రవరిలోఅయితే 22.6 లక్షలకు పరిమితమైంది. ఫిబ్రవరి ముగిసేసరికి ఎన్ఎస్‌డిఎల్‌లో నమోదైన డీమ్యాట్ ఖాతాల సంఖ్య 19.04కోట్లు ఉంటే, సిడిఎస్ఎస్ వద్ద నమోదైన డీమ్యాట్‌ఖాతాల సంఖ్య 18.81 కోట్లుగాఉంది. గతేడాది సెప్టెంబరు చివరిలో నమోదైన గరిష్టస్థాయిల నుంచి సెన్సెక్స్, నిఫ్టీ దాదాపు 14శాతం క్షీణించాయి. బిఎస్ఇ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు ఏకంగా 23శాతం పడిపోయాయి. ఈక్విటీ మార్కెట్లు క్రమంగా నష్టాల్లోకి జారుకోవడంతో దలాల్ స్ట్రీట్‌లో నేరుగా పెట్టుబడులు పెట్టేందుకు ఇన్వెస్టర్ల ఆసక్తితగ్గింది. ఐపిఒలరాక కూడా తగ్గింది. ఈ కారణంగా కొత్తగా ఖాతాలు తెరిచే వారి సంఖ్య తగ్గుముఖం పట్టేందుకు మరో కారణమని నిపుణులు చెబుతున్నారు. డెరివేటివ్స్ మార్కెట్లలో తగ్గిన కార్యకలాపాలు కూడా కొత్త డీమ్యాట్ ఖాతాలు తగ్గుముఖం పట్టేందుకు ఓ కారణమని మార్కెట్ల నిపుణులు పేర్కొంటున్నారు. డెరవేటివ్స్‌మార్కెట్లలో తగ్గి కార్యకలాపాలు కూడా కొత్త డీమ్యాట్‌ఖాతాలు తగ్గుముఖంపట్టేందుకు ఓ కారణమని మార్కెట్ నిపుణులు పేర్కొంటున్నారు. డెరివేటివ్స్ విభాగంలో రోజు వారీ సగటు టర్నోవర్ 46శాతం క్షీణించింది. 2024 సెప్టెంబరులో రూ.537.26లక్షల కోట్లుగా ఉన్న ఈ టర్నోవర్ ఈ యేడాది ఫిబ్రవరి నాటికి రూ.287.59 లక్షల కోట్లకు పడిపోయింది.

# సెన్సెక్స్, నిఫ్టీలను వీడని నష్టాలు

**ముంబై, మార్చి 11:** దేశీయ స్టాక్ మార్కెట్‌సూచీలు మంగళవారం ఫ్లాట్‌గా ముగిసాయి. అమెరికాలో నెలకొన్న మాంద్యం భయాలతో సోమవారం ఆ దేశ స్టాక్ మార్కెట్లు కుదేలవ్వగా, మంగళవారం ఆసియా స్టాక్ మార్కెట్లపైనా ప్రతికూల ప్రభావం పడింది. దేశీయ మార్కెట్లపైనా ఆరంభంలో ఆ ప్రభావం కనిపించినప్పటికీ, తర్వాత సూచీలు క్రమంగా కోలుకున్నాయి. చివరికి 12.85 పాయింట్లు నష్టపోయి 74,102.32 పాయింట్ల వద్ద ఫ్లాట్‌గా ముగిశాయి. నిఫ్టీ కూడా 37.60 పాయింట్లు నష్టపోయి 22,497.90 పాయింట్ల వద్ద నిలిచింది. ఇండస్ ఇండ్ బ్యాంకు, ఇన్ఫోసిస్, బజాజ్ ఫిన్‌సర్వ్, మహీంద్రా అండ్ మహీంద్రా, జొమాటో వంటి షేర్లు నష్టాల్లో ముగిసాయి. సన్‌ఫార్మా, ఐసిఐసిఐ బ్యాంకు, భారతీ ఎయిర్‌టెల్, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్, మారుతి సుజుకి వంటి షేర్లు లాభాల్లో ముగిసాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 69 డాలర్ల వద్ద కొనసాగగా, బంగారం ఔన్సు 2916 డాలర్ల వద్ద ట్రేడయింది.




# ఆపిల్‌కు రూ.15 లక్షల కోట్ల నష్టం

**వాషింగ్టన్, మార్చి 11:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేపడుతున్న చర్యలతో అక్కడి స్టాక్ మార్కెట్లు కుదేలవుతున్నాయి. అమెరికా ప్రధాన సూచి నాస్‌డాక్ ఏకంగా 4శాతం నష్టపోయింది. టెక్ సంస్థల షేర్లు కూడా భారీగా క్షీణించాయి. ప్రముఖ టెక్ దిగ్గజం ఆపిల్ అయితే కేవలం ఒక్క రోజులోనే ఏకంగా 174 బిలియన్ డాలర్లు అంటే రూ.15లక్షల కోట్లు నష్టాన్ని మూటగట్టుకుంది. ఆపిల్, మైక్రోసాఫ్ట్, టెస్లా, ఎన్విడియా, గూగుల్ పేరెంట్ కంపెనీ అయిన ఆల్ఫాబెట్, అమెజాన్, మెటా అమెరికాలో అతిపెద్ద టెక్ దిగ్గజ సంస్థలు. ఈ ఏడు అతిపెద్ద అమెరికా టెక్‌కంపెనీలు మార్కెట్లో ఆధిపత్యాన్ని చెలాయిస్తున్నాయి. మార్కెట్ ఒడుదు డుకుల నేపథ్యంలో ఈ అన్ని కంపెనీల షేర్లు ఒక్కసారిగా కుప్పకూలాయి. సోమవారం నాటి ట్రేడింగ్ సెషన్‌లో మార్కెట్ విలువలో ఏకంగా 750 బిలియన్ డాలర్లు కోల్పోయాయి. సుంకాల ఆందోళన నేపథ్యంలో నాస్‌డాక్ భారీగా క్షీణించింది. 2022 తర్వాత అత్యంత భారీ పతనాన్ని చవిచూసింది. ఆపిల్ తర్వాత అత్యధికంగా మార్కెట్ విలువను కోల్పోయిన స్థానంలో ఎఐ చిప్‌మేకర్ ఎన్విడియా ఉంది. కేవలం కంపెనీ షేర్లు 5శాతం క్షీణించి మార్కెట్ విలువలో 140 బిలియన్ డాలర్లు కోల్పోయింది. జనవరిలో కొత్త గరిష్టాన్ని నమోదు చేసిన సంస్థ కేవలం రెండు నెలల్లోనే మూడో వంతు క్షీణించింది. టెస్లా షేర్లు కూడా నష్టాల్లోకి జారుకున్నాయి. డిసెంబరు నుంచి ఇప్పటి వరకు కంపెనీ తన విలువలో సగానికిపైగా కోల్పోయింది. మైక్రోసాఫ్ట్ 98 బిలియన్ డాలర్లు, గూగుల్ 95 బిలియన్ డాలర్లు, అమెజాన్ 50 బిలియన్ డాలర్లు, మెటా 70 బిలియన్ డాలర్లు మేర తమ మార్కెట్ విలువను కోల్పోయాయి.



# రూ.349 లక్షల కోట్ల సంపద ఆవిరి

**వాషింగ్టన్, మార్చి 11:** అమెరికా స్టాక్ మార్కెట్లు దాదాపు 20 రోజుల వ్యవధిలోనే భారీగా పతనం అయ్యాయి. స్టాక్స్‌లోని ఇన్వెస్టర్ల సంపద 4 లక్షల కోట్ల డాలర్లు అంటే రూ.349 లక్షల కోట్ల మేరకు ఆవిరైపోయింది. ఇది యూకే, ఫ్రాన్స్ వంటి దేశాల జిడిపి కంటే ఎక్కువ కావడం విశేషం. ముఖ్యంగా అమెరికా ఫెడల్ గవర్నమెంట్ షట్‌డౌన్ భయాలు సూచీలను వెంటాడుతున్నాయి. దీనికి ట్రంప్ అస్థిర విధానాలు తోడయ్యాయి. ఎస్అండ్‌పి 500 సూచి ఫిబ్రవరి 19వ తేదీన నమోదు చేసిన ఆల్‌టైమ్ హై నుంచి ఇప్పటికి 8 శాతానికిపైగా విలువ కోల్పోయింది. నాస్‌డాక్ కాంపోజిట్ డిసెంబర్‌లో నమోదు చేసిన అత్యధిక విలువ నుంచి 10 శాతం పతనమైంది. ఇక ఒక్క సోమవారమే 1.7 లక్షల కోట్ల డాలర్ల సంపద కరిగిపోయింది. 2022 సెప్టెంబర్ తర్వాత ఈ స్థాయిలో పతనం కావడం ఇదే తొలిసారి. ఇక మస్క్ నేతృత్వంలోని టెస్లా షేర్ ధర 15శాతం పతనం కావడం విశేషం. డిసెంబరు 17 నుంచి ఈ సంస్థ షేరు విలువ 50శాతం ఆవిరైంది. నాడు అత్యధికంగా 479.86 డాలర్లు ఉండగా, సోమవారం అది 222.15 డాలర్లకు చేరింది. వివిధ కారణాలు కలిసి ఓ ప్యాకేజీలా మార్కెట్లను దెబ్బతీస్తున్నాయి. ముఖ్యంగా వాణిజ్య విధానాల్లో హఠాత్తుగా వస్తున్న మార్పులు, ఆర్థిక మాంద్యం భయాలు, స్టాక్స్ అధిక విలువలు వంటివి కారణమవుతున్నాయని లాజర్డ్ సిఇఒ పీటర్ ఓర్స్‌జాగ్ వెల్లడించారు. అమెరికాలోని భారీ సంపన్నులపై దీని ప్రభావం తీవ్రంగా ఉంటోంది. అక్కడి మార్కెట్లలో 50శాతం విలువైన సంపద ఒకశాతం మంది వద్ద ఉంటుంది. ఇక 37 శాతం విలువైన సంపద 10శాతం మంది వద్ద ఉంటుంది. 12శాతం వాటా 40 శాతం మంది వద్ద కేంద్రీకృతమైంది. మిగిలిన ఒకశాతం వాటా 50శాతం మందిప్రజల చేతిలో ఉందని ఫెడరల్ రిజర్వ్ బ్యాంకు ఆఫ్ సెయింట్ లూయిస్ డేటాపేర్కొంది.



# ఇండస్ ఇండ్ బ్యాంకు షేర్లు 20% డౌన్

**ముంబై, మార్చి 11:** ప్రముఖ ప్రైవేట్‌రంగ బ్యాంకు ఇండస్ ఇండ్ బ్యాంకు షేర్లు భారీగా కుంగాయి. మంగళవారం ట్రేడింగ్ సెషన్‌లో ఏకంగా 20శాతం మేర క్షీణించాయి. బ్యాంకుకు చెందిన డెరివేటివ్ పోర్ట్‌ఫోలియోలో అవకతవకలు ఉన్నట్లు గుర్తించిన నేపథ్యంలో షేర్లు నష్టాల్లోకి జారుకున్నాయి. తమ డెలివేటివ్ పోర్ట్‌ఫోలియోల అవకతవకల్ని గుర్తించినట్లు ఇండస్ ఇండ్ బ్యాంకు అంతర్గత సమీక్షలో వెల్లడించింది. దీంతో బ్యాంకు నికర విలువపై దాదాపు 2.35 శాతం ప్రతికూల ప్రభావం పడనున్నట్లు బ్యాంకు అంచనా వేసింది. అంటే ఏకంగా రూ.1.530 కోట్ల నష్టానికి సమానం. ఈ ప్రకటన షేర్లపై ఒత్తిడి పెంచింది. దీంతో షేర్లు 20శాతం మేర కుంగాయి. బ్యాంకు మార్కెట్ విలువ ఏకంగా రూ.14వేల కోట్లు క్షీణించింది. గతేడాది డిసెంబరు నాటికి బ్యాంకు నికర విలువ రూ.65,102 కోట్లుగా ఉంది. ఇండస్ ఇండ్ బ్యాంకు షేర్లు సోమవారం ట్రేడింగ్ సెషన్ లోనూ కుంగాయి. ప్రస్తుత సీఇఒ సుమంత్ కత్పలియా పదవీకాలాన్ని మూడేళ్ల కాకుండా, ఒక సంవత్సరం పాటే పొడిగించేందుకు ఆర్‌బిఐ అనుమతించింది. ఈ ప్రకటనతో షేర్లు సోమవారం బిఎస్ఇలో 3.86 శాతం నష్టంతో రూ.900.70 వద్ద ముగిశాయి. గత సంవత్సరంలో బ్యాంకు షేర్లు 42.42 శాతం క్షీణించాయి. గత ఆరు నెలల్లోనే 37.24 శాతం కుంగాయి.




Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 3rd Mile Stone Renigunta Road, Tirupati-517506 Ph No :2238770, Fax:08772238790, RNI NO.64860/96, Editor: *Damerla Sai Baba, * Responsible for Selection of News under the PRB Act, Regd.:No.H/H.T.P/57, Postal Licence/TRP104/2006/2008 Surcharge:Delhi:40 Ps.